Email:prajamantalu@gmail.com
www.prajamantalu.com
# ప్రజా మంటలు
తెలంగాణ జాతీయ దినపత్రిక
సంపుటి : 4 సంచిక : 156
పేజీలు - 8 వెల - రూ 5:00
ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు
బుధవారం 13, డిసెంబర్-2023

## ప్రజావాణికి పెరుగుతున్న ఆదరణ



3లో..

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri

## తెలంగాణలో పలువురు ఐపిఎస్‌కు స్థానచలనం





- హైదరాబాద్ సిపిగా కొత్తకోట శ్రీనివాసరెడ్డి
- సైబరాబాద్ సిపిగా అవినాశ్ మహంతి
- రాచకొండ సిపిగా సుధీర్ బాబు
- నార్కోటిక్ బ్యూరో డైరక్టర్‌గా సందీప్ శాండిల్యా
- డిజిపి కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని స్టీఫెన్ రవీంద్ర,చౌహాన్‌లకు ఆదేశం
- డిజిపి అంజనీకుమార్‌పై సస్పెన్షన్ ఎత్తేసిన ఎన్నికల సంఘం




**హైదరాబాద్,డిసెంబర్12 :** తెలంగాణలో పలువురు ఐపిఎలస్‌ల బదిలీలు జరిగాయి. పలువురికి కొత్త పోస్టులను ఇవ్వగా పాతవారిని డిజిపి కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. తెలంగాణలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టాక రాష్ట్ర వ్యాప్తంగా ఐపీఎస్ బదిలీలకు మొదటిసారి శ్రీకారం చుట్టారు. కీలకమైన బాధ్యతల్లో ఉన్న ఐపీఎస్ అధికారుల బదిలీలు మిగతా 3లో..

## పంచాయితీ, పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటుదాం

- ఓటమితో పార్టీ కార్యకర్తలు కుంగిపోవద్దు
- ముందంతా మంచి కాలం ఉంది: హరీష్ రావు

**సంగారెడ్డి,డిసెంబర్12 :** పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటా మని మాజీమంత్రి హరీష్ రావు అన్నారు. ఓడిపోయామని కుంగిపోవద్దు..వచ్చే పంచాయతీ ఎన్నికలు, పార్లమెంట్ ఎన్నికల్లో మన సత్తా చూపిం చాలని ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. సంగారెడ్డిలో సోమవారం నిర్వహించిన బీఆర్ఎస్ కృతజ్ఞత సభకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రమంతా కొంత ఇబ్బంది ఉన్నా సంగారెడ్డిలో మాత్రం ఈ సారి గులాబీ జెండా ఎగిరింది. చింతా ప్రభాకర్ ఆరోగ్యం దెబ్బ తిన్నా ప్రతి ఒక్క కార్యకర్త అభ్యర్థిగా కష్టపడి పని చేశారని ప్రశంసించారు. అధికార పార్టీ వాళ్లు మన మానసిక స్థైర్యాన్ని దెబ్బతీసే ప్రయత్నం చేస్తారు. టీఆర్ఎస్ పార్టీ పెట్టినప్పుడు కూడా ఎన్నో ఇబ్బందులు పడ్డాం. అయినా ఇబ్బందులు ఎదుర్కొని ఎన్నో విజయాలు సాధించామన్నారు. 2004 లో కాంగ్రెస్ మనతో పొత్తు పెట్టుకుని తెలంగాణ ఇవ్వలేదు. తెలంగాణపై కేసీఆర్ కి ఉన్న ప్రేమ ఇతరులకు ఉండదని పేర్కొన్నార్నారు. 14 ఏండ్లు కష్టపడి, పదవులు గడ్డి పోచల్లా వదిలేసి తెలంగాణ తెచుకున్నామని గుర్తు చేశారు. అధికారంలో ఉన్నప్పుడు పొంగిపోలేదు..లేనప్పుడు కుంగిపోలేదు. బీఆర్ఎస్ అధికార పక్షంలో ఉన్నా ప్రతి పక్షంలో ఉన్నా మనమెప్పుడు ప్రజల పక్షమేనని స్పష్టం చేశారు. తెలంగాణాని అన్ని రంగాల్లో దేశంలోనే నంబర్‌వన్ స్థానంలో నిలబెట్టింది బీఆర్ఎస్ పార్టీనేనని తెలిపారు. ప్రజలు కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చారు. వాళ్లు మనకంటే బాగా చేయాలని కోరుకుందామన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకిచ్చిన హామీల అమలు కోసం కొట్లాడుదాం అన్నారు. ప్రజల సమస్యలపై



పోరాడే వారికే భవిష్యత్తు మనకే ఉంటుందని చెప్పారు. కార్యకర్తలు ఎవరు కూడా అధైర్య పడొద్దు. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఏడుగురు ఎమ్మెల్యేలు ఉన్నారు. అందరం కలసి పని చేద్దామని పిలుపునిచ్చారు. ఓటమిపై సమీక్ష జరుపుదాం. తప్పొప్పులు సరి చేసుకొని ప్రజల పక్షాన నిలబడుదామన్నారు.

## ప్రజలకు మెరుగైన పాలనే లక్ష్యం


### అధికారులతో సమీక్షలో మంత్రి జూపల్లి

**జోగుళాంబ గద్వాల,డిసెంబర్12 :** ప్రజలకు మెరుగైన పాలన అందిస్తామని, అవినీతికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతెలిపారు. జోగుళాంబ గద్వాల ఐడీవోసీ కార్యాలయ సమావేశ హాల్‌లో మంగళవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జిల్లాలో మూడు రైస్ మిల్లులకు చెందిన యజమానులు ప్రభుత్వం నుంచి వడ్లు తీసుకొని బియ్యం ఇవ్వకుండా సుమారు రూ.100 కోట్ల అవినీతికి పాల్పడ్డారన్న ప్రచారం జరుగుతుందని.. వారిపై ఇప్పటివరకు పీడీ యాక్ట్ కేసులు ఎందుకు నమోదు చేయలేదని అధికారులను ప్రశ్నించారు. రైస్ మిల్లర్లకు ఎన్ని క్వింటాళ్ల ధాన్యం ఇచ్చారు.. వారు ఎంత బియ్యం ప్రభుత్వానికి తిరిగి ఇచ్చారో చెప్పాలన్నారు. ఇందుకుగానూ సంబంధిత శాఖ అధికారి నుంచి సరైన సమాచారం లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులు, పురోగతి, జూరాల, నె÷-టటెంపాడ్, ర్యాలంపాడ్, ఆర్డీఎస్, తుమ్మిళ్ల లిఫ్టలపై ఆరా తీశారు. ప్రాజెక్టు పనులు ఎంతవరకు పూర్తయ్యాయో నివేదిక అందజేయా లని ఆదేశించారు. ఆబ్కారీశాఖలో ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకు రావాలన్నారు. అక్రమ మద్యం, గుడుంబా విక్రయించే వారిపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. సమావేశంలో గద్వాల, అలంపూర్ ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, జెడ్పీచైర్‌పర్సన్ సరిత, కలెక్టర్ వల్లూరు క్రాంతి, తదితరులు పాల్గొన్నారు.



## దయచేసి ఆస్పత్రికి ఎవరూ రావద్దు

### వీడియో సందేశం విడుదల చేసిన కెసిఆర్



**హైదరాబాద్,డిసెంబర్12 :** తనను పరామర్శించేందుకు, చూసేందుకు అభిమానులు, పార్టీ నేతలు యశోద ఆస్పత్రికి రావద్దని దయచేసి సహకరి ంచాలని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు కోరారు. ఈ మేరకు ఓ వీడియోలో సందేశం విడుదల చేశారు. వీడియోలో కేసీఆర్ ఏం చెప్పారంటే... 'నాతోపాటు వందలాది పేషంట్లకు ఇబ్బంది కలగకూడదు. త్వరలోనే కోలుకుని మీమధ్యకు వస్తాను. ఇన్ఫెక్షన్ వస్తుందని డాక్టర్లు నన్ను బయటకు పంపడంలేదు. నేను ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నానని త్వరలో సాధారణ స్థితికి చేరుకుని మీ నడుమకే వస్తానని.. అప్పుడిదాకా సంయమనం పాటించి యశోద దవాఖానకు రావొద్దని కేసీఆర్ సూచించారు. ప్రజలనుద్దేశించి ప్రత్యేకంగా ఓ వీడియోను కేసీఆర్ విడుదల చేశారు. ఇదిలావుంటే సోమాజిగూడ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ పరామర్శించారు. కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిని డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్ త్వరగా కోలుకోని ప్రజాసేవలోకి రావాలని అక్బరుద్దీన్ ఆకాంక్షించారు. ఇప్పటికే కేసీఆర్‌ను చంద్రబాబు, చిరంజీవి, ప్రకాశ్ రాజ్, భట్టి విక్రమార్క, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, మోత్కుపల్లి నర్సింహులుతో పాటు పలువురు నాయకులు పరామర్శించిన సంగతి తెలిసిందే. కేసీఆర్ కాలు జారి కింద పడడంతో ఆయనకు హిప్ రిప్లేస్‌మెంట్ సర్జరీ నిర్వహించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం కేసీఆర్ వాకర్ సాయంతో నడుస్తున్నారు. మరో ఐదారు వారాల పాటు కేసీఆర్‌కు విశ్రాంతి అవసరమని వైద్యులు చెప్పారు.

## ఎపికి ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందే


- విభజన చట్టంలోనే దీనిని పొందుపరిచారు
- నాటి ప్రధాని మన్మోమన్ హామీ కూడా ఇచ్చారు
- మరోమారు ప్రత్యేకహోదా కోసం ప్రయత్నిస్తా
- త్వరలోనే తెలంగాణ భవన్ నిర్మాణం చేపడతాం
- తెలంగాణకు మణిహారంగా రీజినల్ రింగ్ రోడ్డు
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడి



**న్యూఢిల్లీ,డిసెంబర్12 :** ఎపికి ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందేనని, విభజన చట్టంలోనే ఇది ఉందని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక హోదా ఇవ్వాలని, అందుకు తన వంతు కృషి చేస్తానని మంత్రి వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హోదా ఇస్తామని...అప్పటి ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఏపీని ఆదుకోవాలన్న లక్ష్యంతోనే పార్లమెంట్ సాక్షిగా ప్రత్యేక స్పెషల్ స్టేటస్ హామీ ఇచ్చారని అన్నారు. విభజన వేళ ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిజానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటే ఎప్పుడో హోదా దక్కేదని కోమటిరెడ్డి వ్యాఖ్యానించారు. డిల్లీలో పర్యటిస్తున్న కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉమ్మడి ఏపీ భవన్‌కు వెళ్లారు. అక్కడ పలు బ్లాక్‌లను మంత్రి పరిశీలించారు. ఉమ్మడి ఏపీ భవన్ ఆస్తుల వివరాలు, రాష్ట్ర వాటాను అధికారులు మ్యాప్ ద్వారా ఆయనకు వివరించారు. ఆ తర్వాత తెలంగాణ భవన్ నిర్మాణ స్థలాన్ని కోమటిరెడ్డి పరిశీలించారు. వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి ఢిల్లీలో తెలంగాణ భవన్ నిర్మాణ పనులు చేపట్టాలనుకుంటున్నట్లు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఉమ్మడి ఏపీ భవన్‌కు చెందిన ఆస్తులను పరిశీలించామన్న ఆయన.. తెలంగాణ భవన్ నిర్మాణ వివరాలను సీఎంకు వివరిస్తానన్నారు. ఇప్పటికే నిర్మాణం ఆలస్యమైందన్న కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉమ్మడి ఏపీ భవన్ విషయంలో తెలుగు రాష్ట్రాల మధ్య ఎలాంటి వివాదం లేదని స్పష్టం చేశారు. త్వరలో రీజనల్ రింగ్ రోడ్ మిగతా 3లో..

## కేంద్ర సర్వీస్ నుంచి వస్తున్న ఆమ్రపాలి

### సిఎం రేవంత్‌తో మర్యాదపూర్వక భేటీ



**హైదరాబాద్,డిసెంబర్12 :** ప్రస్తుతం ఢిల్లీలోని ప్రధానమంత్రి కార్యాలయంలో డిప్యూటీ సెక్రటరీగా పనిచేస్తున్న ఐఏఎస్ అధికారి కాటా ఆమ్రపాలి తెలంగాణ రాష్ట్రానికి వచ్చేందుకు రంగం సిద్ధమైంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2010 బ్యాచ్‌కు చెందిన ఆమె రాష్ట్ర విభజన సందర్భంగా తెలంగాణ కేడర్‌కు అలాట్ అయ్యారు.గతంలో వరంగల్ జిల్లా కలెక్టర్‌గా పనిచేశారు. కాటా ఆమ్రపాలి 2018 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అదనపు చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్‌గా కొంతకాలం పనిచేశారు. 2019 లోక్‌సభ ఎన్నికల తర్వాత సెంట్రల్ డిప్యూటేషన్‌పై ఢిల్లీ వెళ్లిన ఆమె తొలుత (2019 అక్టోబర్ 29వ తేదీ నుంచి) కేంద్ర కేబినెట్‌లో డిప్యూటీ సెక్రటరీగా దాదాపు ఏడాది కాలం పనిచేశారు. ఆ తర్వాత పిఎంఓలో డిప్యూటీ సెక్రటరీగా చేరారు. ఇటీవల కేంద్ర సర్వీసులో ఆమె డిప్యూటేషన్ పూర్తి కావడంతో రాష్ట్ర సర్వీసులో చేరనున్నారు. ఈ క్రమంలోనే సిఎం రేవంత్ రెడ్డిని ఆమ్రపాలి మర్యాదపూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వానికి ఆమె రిపోర్ట్ చేశారు. కాగా, ఆమెకు రేవంత్ ప్రభుత్వంలో కీలక పదవి కట్టబెట్టే ఛాన్స్ ఉందన్న టాక్ వినిపిస్తోంది.

## ప్రజానాడి




## ఆందోళనకరంగా పౌరసరఫరాల శాఖ

- ఏకంగా రూ.56వేల కోట్ల నష్టం
- 12శాతం మంది రేషన్ వినియోగించడం లేదు
- కొత్త కార్డులపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటాం
- పౌరసరఫరాల శాఖ సమీక్షలో మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్,డిసెంబర్12 :** పౌరసరఫరాల శాఖ ఆర్థికపరిస్థతి ఆందోళనకరంగా ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. గత పాలకుల వల్ల శాఖలో తప్పిదాలు జరిగాయని.. ఏకంగా రూ.56వేల కోట్ల నష్టంలో ఉందని మంత్రి చెప్పారు. మంగళవారం నగరంలోని సివిల్ సప్లై భవన్‌లో మంత్రి ఉత్తమ్ అధి కారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా 12 శాతం వినియోగదారులు రేషన్ కార్డులు ఉపయోగించడం మిగతా 3లో..



## నగర సమస్యలపై సిఎం రేవంత్ సమీక్ష

- సమీక్షకు హాజరైన ఎంఐఎం ఎమ్మెల్యేలు

**హైదరాబాద్,డిసెంబర్12 :** నగర సమస్యలపై అధికారులు, మంత్రులతో పాటు మజ్లిస్ ఎమ్మెల్యేలు ఏడుగురు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమీక్షించారు. సెక్రటేరియట్‌కు అక్బరుద్దీన్ సారధ్యంలో వచ్చిన ఎమ్మెల్యేలు.. పలు అంశాలపై చర్చించారు. పాతబస్తీ, మూసీ అభివృద్ధి తదితర అంశాలపై చర్చించినట్లుగా చెబుతున్నారు. రేవంత్ రెడ్డితో సమావేశానికి వచ్చే ముందు ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాజీ సీఎం కేసీఆర్‌ను పరామర్శించారు. ప్రొటెం స్పీకర్‌గా అక్బరుద్దీన్ ను ప్రభుత్వం ఎంపిక చేసుకోవడంపై విమర్శలు వచ్చాయి. ఇతర సీనియర్లు ఉన్నప్పటికీ ఆయననే ఎంపిక చేసుకున్నారని బీజేపీ నేతలు విమర్శించారు.



అయితే ఇతర సీనియర్లు ఉన్నారు కానీ వారు పార్టీలు మారిన రికార్డు ఉన్న వారని అందుకే.. ఒకే పార్టీ నుంచి వరుసగా గెలుస్తూ వస్తున్న అక్బరుద్దీన్ ను ఎంపిక చేశామని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. కానీ కాంగ్రెస్ పార్టీకి బొటాబొటి మెజార్టీ ఉండటం వల్ల మజ్లిస్ తో సన్నిహిత సంబంధాల కోసం ప్రయత్నిస్తు న్నారని బీజేపీ ఆరోపించింది. కారణం ఏమైనప్పటికీ అక్బరుద్దీన్ రెండు, మూడు రోజుల్లోనే తన ఎమ్మెల్యేలందరితో కలిసి రేవంత్ రెడ్డితో సమావేశం కావడం రాజకీయవర్గాలను కూడా ఆశ్చర్య పరుస్తోంది. కాంగ్రెస్ పార్టీతో చాలా కాలంగా మజ్లిస్ విబేధిస్తోంది. జాతీయ మిగతా 2లో..

# మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డికి ఉచ్చు

- రుణం చెల్లింపు కోసం ఫైనాన్స్ కార్పోరేషన్ నోటీసులు
- ఇప్పటికే ఆర్టీసి, విద్యుత్ సంస్థల తాఖీదులు

**నిజామాబాద్,డిసెంబర్12 :** ఆర్మూర్ బీఆరెస్స్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. ఇంతకాలం అధికార పార్టీలో ఉండి చేసిన అక్రమాలకు సమాధానం చెప్పుకోలేక పోతున్నారు. ఆర్టీసీ, ట్రాన్స్ కో అధికారులు ఏకకాలంలో బకాయిల వసూలుకు చర్యలు ప్రారంభిస్తూ షాక్ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇదే క్రమమో తాజాగా మరో షాక్ తగిలింది. ఇందులో భాగంగా తమ వద్ద తీసుకున్న రూ.20 కోట్ల రుణం వడ్డీతోకలిపి మొత్తం కలిపి రూ. 45 కోట్లు చెల్లించాలంటూ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ అధికారులు నోటీసులు జారీ చేశారు. గతంలో ఆయన తనపై కాల్పులు జరిగాయంటూ నానా హంగామా చేశారు. మొత్తంగా ఇప్పుడు ఆర్మూర్ బీఆరెస్స్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డికి అధికారులు గ్యాప్ ఇవ్వడలేదు! ఈ క్రమంలో తాజాగా ఆయన ఇంటికి స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ అధికారులు నోటీసులు అంటించారు. అసలు రూ. 20 కోట్లు, వడ్డీ రూ. 25కోట్లు చెల్లించాలని ఆ నొటీసుల్లో కోరారు. దీంతో ఏమిటి లోన్, ఎవరి పేరున తీసుకున్నారు, ఎప్పుడు తీసుకున్నారు, ఇంతకాలం ఎందుకు చెల్లించకున్నారు.. మొదలైన ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి. కార్పొరేషన్ నుంచి మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి రూ.20కోట్లు రుణం తీసుకున్నారు. 2017లో ఆయన సతీమణి రజిత రెడ్డి పేరున జీవన్ రెడ్డి ఈలోన్ తీసుకున్నారని తెలుస్తుంది. అయితే నాటి నుంచి నేటి వరకు వడ్డీలు డబ్బు కూడా చెల్లించలేదని అంటున్నారు. ఫలితంగా అసలు ప్లస్ వడ్డీ కలిసి రూ.45 కోట్ల బకాయి ఉందని అధికారులు తెలిపారు. ఈ క్రమంలో తాజాగా ఆయన ఇంటికి వెళ్లిన అధికారులు నోటీసులు అంటించారు. దీంతో ఇంటికి నోటీసులు అంటించిన అంశం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. అయితే జీవన్ రెడ్డి మాత్రం ఈ విషయంపై ఇంకా స్పందించలేదు! జీవన్ రెడ్డికి ఆర్టీసీ, ట్రాన్స్ కో అధికారులు ఏకకాలంలో బకాయిల వసూలుకు చర్యలు ప్రారంభిస్తూ ఇప్పటికే నోటీసులు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా... ఆర్మూర్ పట్టణంలోని జీవన్ రెడ్డి సతీమణి రజితరెడ్డి తాను మేనేజింగ్ డైరెక్టర్ గా ఉన్న విష్ణుజిత్ ఇన్ ఫ్రా డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరిట టీఎస్ ఆర్టీసీ స్థలాన్ని లీజ్ కు తీసుకుని మాల్ అండ్ మల్టిప్లెక్స్ పేరిట ఐదు అంతస్తుల భారీ షాపింగ్ మాల్ నిర్మించారు.



# అధికారుల పర్యవేక్షణ లోపం చౌకబియ్యం అక్రమ రావాణా

**నిజామాబాద్,డిసెంబర్12 :** అక్రమంగా తరలిస్తున్న వందల క్వింటాళ్ల బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకోగా, అనధికారంగా తరలింది లెక్కకు అందనంత ఉంటుందని అంటున్నారు. బియ్యం అక్రమ రవాణాను నిరోధించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని పౌరసరఫరాల అధికారులు చెబుతున్నా అక్రమ రవాణా ఆడగం లేదు. పేదలకు చెందాల్సిన బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నా అక్రమ రవాణా తగ్గడం లేదు. లబ్ధిదారులకు సక్రమంగా సరకుల పంపిణీని పర్యవేక్షణ చేయాల్సిన మండల తహసీల్దార్లు, ఉప తహసీల్దార్లు, ఎన్ఫోర్స్‌మెంట్ విభాగం, పౌరసరఫరాల శాఖ అధికారులు పట్టనట్లుగా వ్యవహరించడం వల్ల ప్రజా పంపిణీ వ్యవస్థలో అక్రమాలు పాతుకుపోయాయి. డీటీల సాయంతో నిత్యం తనిఖీలు చేస్తూ అక్రమ రవాణా జరుగుతున్న ప్రదేశాలపై నిఘా ఉంచామన్నా ఎక్కడా కానరావడం లేదు. నిరుపేదల కడుపుకొట్టి అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారనే దారుణం ఈ తనిఖీల్లో వెలుగులోకి వచ్చింది. చెక్‌పోస్టు దాటి బియ్యం మహారాష్ట్రకు తరలుతోంది. స్థానికంగా ఉన్న వ్యాపారులు బియ్యాన్ని సేకరించి పాలిష్, ప్యాకింగ్ చేసి మళ్లీ విక్రయిస్తున్నారు. రేషన్ సరకుల ఇంటర్‌నెట్‌లో కీ రిజిస్టర్ ఆధారంగా విడుదలవుతున్నాయని డీలర్లు అక్రమాలకు తెరతీస్తున్నారు. మీ సరకులు అన్‌లైన్‌లో రాలేదని లబ్ధిదారులను ముప్పతిప్పలు పెట్టి, రేషన్ కార్డులను తీసుకుని సరకులను కాజేస్తున్నారు. వస్తువుల ధరల పట్టికలు ఏ రేషన్ దుకాణంలో కానరావు. ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు ప్రతి మాసం అన్ని దుకాణాలను తనిఖీ చేయాల్సి ఉండగా, ఈ తనిఖీలు మొక్కుబడిగా సాగుతున్నాయి.


# విద్యుత్ బకాయిలే సమస్య..

## గుదిబండగా అక్రమ కనెక్షన్లు

**వరంగల్,డిసెంబర్12 :** పేరురుపోతున్న విద్యుత్ బకాయల కారణంగా సంస్థకు నష్టాలు తప్పడం లేదు. ప్రస్తుతం వరంగల్ రూరల్, అర్బన్‌గా రెండు డివిజన్లుగా విభజించి సేవలు అందిస్తున్నారు. ఈ రెండు డివిజన్‌లలోనే సుమారు నాలుగు లక్షలకుపైగా విద్యుత్తు సర్వీసులు ఉన్నాయి. అత్యధిక ఆదాయం కూడా ఈ రెండు డివిజన్ల నుంచే వస్తుంది. విద్యుత్ ఉద్యోగుల సంఖ్య పెరిగినా ఆదాయ వనరులు పెద్దగా పెరిగిన దాఖలాలు లేకపోవడంతో కంపెనీ పీకల్లోతు నష్టాలతో కాలం నెట్టుకొస్తుంది. పదోన్నతులు కల్పించకుండా ప్రస్తుతమున్న ఇంజినీర్లతోనే కొత్త జిల్లాల్లో సర్దుబాటు చేస్తున్నారు. పని లేని విభాగాలకు సంబంధించిన పోస్టులను రద్దు చేసి సర్దుబాటు చేశారు. పేరుకుపోయిన బకాయిలు వసూలయితేనే సంస్థ మనుగడ సాధ్యమని కొందరు అధికారులు అన్నారు. ఇదిలావుంటే గ్రేటర్ పరిధిలో సుమారు పదివేల వరకు అక్రమ నల్లా కనెక్షన్లు ఉన్నట్లు ఇంజినీరింగ్ అధికారులు భావిస్తున్నారు. గత మూడు నెలల కింద డివిజన్ల వారీగా చేసిన సర్వే ఆధారంగా అధికారులకు సుమారు ఆరువేల అక్రమ నల్లా కనెక్షన్లు ఉన్నట్లు తేలింది. దీనికి అదనంగా మరో నాలుగు వేల వరకు అక్రమ కనెక్షన్లు ఉంటాయని అంచనాకు వచ్చారు. రెసిడెన్షియల్ నల్లా కనెక్షన్లతో పాటు కమర్షియల్ కనెక్షన్లు కూడా పెద్ద ఎత్తున ఉన్నట్లు వారు గుర్తించారు. పెద్దమొత్తంలో బల్దియా ఆదాయానికి అక్రమ నల్లాలతో గండి పడుతోందని భావిస్తున్న అధికారులు వాటిని క్రమబద్ధీకరించే ప్రక్రియకు శ్రీకారం చుడుతున్నారు. క్షేత్రస్థాయిలో అక్రమ నల్లాల తొలగింపు ప్రక్రియను చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. పెద్ద సంఖ్యలో ఉన్న అక్రమ నల్లా కనెక్షన్లను క్రమబద్ధీకరిస్తే కార్పొరేషన్‌కు పెద్దమొత్తంలో ఆదాయం వస్తుందని వారు భావిస్తున్నారు.

# ప్రజాస్వామ్యం కోసం ప్రజలు పోరాడారు

## ప్రశ్నించే గొంతుకగా ఉంటా: కూనంనేని



**ఖమ్మం,డిసెంబర్12 :** ప్రజాస్వామ్యం,స్వేచ్ఛ,వాక్ స్వాతంత్ర్యం, భావస్వేచ్ఛ కోరుకు న్నారు కాబట్టే 10 ఏళ్ల రాచరిక పాలనకు చరమగీతం పాడారని సిపిఐ నేత, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. ప్రజలు వారి బాధలు చెప్పుకోవడానికి,ఆ బాధలను వినే నాయకులను ఇష్టప డతా రన్నారు. కాంగ్రెస్ పార్టీ కొన్ని నమ్మదగ్గ హామీలు ఇచ్చిందన్నారు. కేసీఆర్ హామీలను ప్రజలు నమ్మలేదని కూనంనేని తెలిపారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల లింకును తాము బయటపెట్టి, ఓడించాలనుకున్నామ న్నారు. అందుకే చివరి నిమిషంలో కాంగ్రెస్‌తో ఒక్క సీటు ఇచ్చినా పొత్తు పెట్టుకున్నామని కూనంనేని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ, టీడీపీ, న్యూడెమోక్రసీ, సీపీఎం, జనసమితి పార్టీలు మనస్ఫూర్తిగా పనిచేశాయన్నారు. ఈ గెలుపు ఒక్క సీపీఐది కాదని.. ప్రశ్నించే గొంతుక అసెంబ్లీలో ఉండాలని అనుకున్న ప్రతి ఒక్కరిదన్నారు. పేదవాడి గొంతుక వినిపించాలని అనుకున్న న్యాయం కోసం తనను ఆదరించారన్నారు. ఇంకా చాలా మంది కమ్యూనిస్టులు ప్రశ్నించేందుకు అసెంబ్లీలో ఉండాలని.. కానీ తనకు ఒక్కడికే అవకాశం వచ్చిందన్నారు. అయినా ప్రజల పక్షాన నిలబడి పోరాడుతామని అన్నారు.

# శ్రీవారిని దర్శించుకున్న భట్టి విక్రమార్క

**తిరుమల,డిసెంబర్12 :** తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మంగళవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయం వెలుపల మీడియాతో భట్టి మాట్లాడుతూ.. రెండు రాష్ట్రాల ప్రజలు సంతోషంగా ఉండాలన్నారు. డిసెంబర్ 28న కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించిన రోజు మరిన్ని సంక్షేమ పథకాలను ప్రారంభిస్తామని తెలిపారు. రైతు భరోసా అమలు చేయడానికి విధి విధానాలను త్వరలోనే ఖరారు చేస్తామని భట్టి విక్రమార్క వెల్లడించారు. శ్రీవారి ఆశీస్సులు నిత్యం తెలుగు రాష్ట్రాలపై ఉండాలని తెలంగాణ మంత్రి భట్టి విక్కమార్క తెలిపారు. తెలంగాణ ప్రజలు చరిత్రాత్మకమైన తీర్పు ఇచ్చారని ప్రశంసించారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీ నెరవేరుస్తామన్నారు. దేశంలో ఎవరూ ఉచిత కరెంట్ ఆలోచన చేయని రోజుల్లోనే వైఎస్ ఆర్ అమలు చేశారని ప్రశంసించారు. ఉచిత కరెంట్ కాంగ్రెస్‌పెటెంట్‌అని భట్టి చెప్పారు. తెలంగాణలో కాంగ్రెస్ 64 సీట్లు గెలిచి ప్రభుత్వం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. తెలంగాణకు ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి సేవలందిస్తున్నారు.

# కౌలురైతులను ఎలా గుర్తిస్తారో అని చూశా

## తెలంగాణ ప్రభుత్వంపై కెటిఆర్ సెటైర్లు

**హైదరాబాద్,డిసెంబర్12 :** మాజీ మంత్రి కేటీఆర్ తెలంగాణ కొత్త సర్కార్‌పై సెటైర్లు వేశారు. కౌలురైతులనుఎలా గుర్తిస్తారో.. పైసలు ఎట్లా వేస్తారో చూద్దామనుకుంటే 6 నెలలు తప్పించుకు న్నారుగా?అంటూఎక్స్‌వేదికగా ఎద్దేవా చేశారు. 22 లక్షల మంది కౌలు రైతులకు పెట్టుబడి లేనట్టేనా యాసంగికి అని విమర్శలు గుప్పించారు. మళ్లీ ఒక బహిరంగ లేఖ రాస్తాడా ముఖ్యమంత్రి..? అని విమర్శించారు. యాసంగి సీజన్‌కు సంబంధించి రైతుబంధు నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసే ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు.ఏ ఒక్క రైతుకూ ఇబ్బంది కలగకుండా మంగళవారం నుంచిపెట్టుబడి సాయం పంపిణీ చేయాలనిసూచించారు.వ్యవసాయ శాఖపై సచివాలయంలో సోమవారం ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగానే రైతుబంధు పంపిణీపై ఆదేశాలిచ్చారు.

# వేర్వేరు ప్రమాదాల్లో టాటా ఏస్ దగ్ధం

## పొలాల్లోకి దూసుకు పోయిన ఆర్టీసీ బస్

**వరంగల్,డిసెంబర్12 :** వేర్వేరు ప్రమాదాల్లో ఓ వాహనం తగులబడగా, ఓ ఆర్టీసి బస్సు పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ప్రాణనష్టం జరగలేదు. హనుమకొండ జిల్లా కరుణాపురంలో జాతీయ రహదారిపై టాటాఏస్ వాహనంలో మంటలు చెలరేగాయి. ప్రయాణికులతో వెళ్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో వెంటనే డ్రైవర్ అప్రమత్తం కావడంతో ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. క్షణాల వ్యవధిలో టాటాఏస్ వాహనం నడిరోడ్డుపైనే దగ్ధమైంది. స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక యంత్రాలు ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పేశారు. మరో ఘటనలో వరంగల్ రోడ్డు ప్రమాదం జరిగింది. జిల్లాలోని దామెర మండలం ఊరుగొండ గ్రామం సమీపంలో ఆర్టీసీ బస్సు అదుపుతప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఇద్దరు ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే గాయపడిన వారిని చికిత్స కోసం దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు. ప్రమాద సమయంలో బస్సులో దాదాపు 70మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోంది. ఆర్టీసీ బస్సు మంగళవారం ఉదయం హనుమకొండ నుంచి ఏటూరునాగారం వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి విరాలు తెలియాల్సి ఉంది.

# మాట నిలబెట్టుకోవడం కాంగ్రెస్ కల్చర్

## పదేళ్లుగా బిఆర్ఎస్ దురాగతాలకు పాల్పడింది

## కాంగ్రెస్ సీనియర్ నేత విహెచ్ విమర్శలు

**న్యూఢిల్లీ,డిసెంబర్12 :** పదేళ్లలో బీఆర్ఎస్ అందరినీ మోసం చేసిందని మాజీ ఎంపీ వి.హనుమంతరావు అన్నారు. కానీ కాంగ్రెస్ ఇచ్చిన మాట నిలబెట్టుకుని పాలన చేస్తుందని అన్నారు. మాట నిలబెట్టుకోవడం కాంగ్రెస్ కల్చర్‌లోనే ఉందన్నారు. సోమవారం నాడు ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ...పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ నేతలను ఇబ్బంది పెట్టింది. కేసీఆర్ దళిత ముఖ్యమంత్రిని చేస్తానని చెప్పి మాట తప్పారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను అమలు చేయదని అంటున్నారు.. కర్ణాటక వెళ్లి చూడాలి. బీఆర్ఎస్, బీజేపీ ఎమ్మెల్యేలు ప్రభుత్వం ఆరు నెలలు కూడా ఉండదని వ్యాఖ్యలు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పింది.. ఏమైందని కిషన్ రెడ్డిని అడుగుతున్నాను. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అన్ని హామీలు పూర్తి చేస్తాం. ఇప్పటికే రెండు హామీలు అమలు చేస్తున్నాం అని హనుమంతరావు స్పష్టం చేశారు.'మహిళలకు ఫ్రీ బస్ పథకం అమలు చేస్తున్నాం. ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం కాంగ్రెస్ కల్చర్. కాంగ్రెస్ పేదలకు భూములు ఇస్తే బీఆర్ఎస్ ప్రభుత్వం వాటిని తీసుకుంది. కేవలం ధనవంతులకు మాత్రమే బీఆర్ఎస్ న్యాయం చేసింది. కేసీఆర్ ఇంటికో ఉద్యోగం, మూడెకరాల భూమి అన్నారు కానీ ఇవ్వలేదు. ధరణి పోర్టల్ ద్వారా భూములు లాగేశారు దాన్ని రద్దు చేయాలి. రెవెన్యూ శాఖలో తప్పులు జరిగాయి. ప్రభుత్వం పడిపోతుందనే స్టేట్మెంట్‌పై . బీఆర్ఎస్, బీజేపీ ఎమ్మెల్యేలు కామెంట్ చెయొద్దు. ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మారు అందుకే సోనియాగాంధీ తెలంగాణ వచ్చారు' అని హనుమంతరావు స్పష్టం చేశారు.


# నగర సమస్యలపై సిఎం రేవంత్ సమీక్ష



రాజకీయాల్లో కూడా కాంగ్రెస్ పార్టీ ఓటమి కోసం ప్రయత్నిస్తోంది. పలు రాష్ట్రాల్లో ముస్లిం అభ్యర్థులను నిలబెట్టడం ద్వారా ముస్లిం ఓట్లను చీల్చి.. కాంగ్రెస్ ఓటమికి కారణం అవుతోంది. తెలంగాణలోనూ కాంగ్రెస్ కు వ్యతిరేకంగా మజ్లిస్ రాజకీయం చేసింది. బీఆర్ఎస్ పార్టీకి బహిరంగంగా మద్దతు తెలిపింది. మజ్లిస్ కేవలం తొమ్మిది స్థానాల్లో మాత్రమే పోటీ చేసింది. మిగతా అన్ని చోట్ల బీఆర్ఎస్ పార్టీకి మద్దతు ఇచ్చింది. గ్రేటర్ పరిధిలో బీఆర్ఎస్ ఎక్కువ స్థానాలు సాధించడానికి మజ్లిస్ మద్దతు కూడా ఓ కారణం అని భావిస్తున్నారు. అయితే మజ్లిస్ ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీతో సన్నిహితంగా ఉంటుంది. అధికార పార్టీలతో గొడవలు పెట్టుకోవాలనుకోదు. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో పాత విషయాలు మర్చిపోయి.. మళ్లీ కాంగ్రెస్ కు దగ్గరవుతున్న సూచనలు కనిపిస్తున్నాయంటున్నారు. కాంగ్రెస్ పార్టీకి సాధారణ మెజార్టీ కంటే.. మూడు సీట్లే ఎక్కువగా ఉన్నాయి. అందుకే? మజ్లిస్ కు చెందిన ఏడుగురు బలం కలిసి వస్తుందని అంచనా వేస్తున్నారు. నేరుగా మద్దతు ఇవ్వకపోయినా ప్రభుత్వం వైపు ఉంటారన్న సందేశం పంపితే చాలన్నట్లుగా కాంగ్రెస్ భావిస్తోంది.

# మిడ్‌మానేరు నిర్వాసితులకు దక్కని న్యాయం

## తక్షణమే సమస్యల పరిష్కారానికి వినతి



**కరీంనగర్,డిసెంబర్12 :** తమ సమస్యలు పరిష్కరించాలని మిడ్‌మానేరు ప్రాజెక్టు నిర్వాసితులు కోరుకుంటున్నారు. ఈ ప్రభుత్వంలో అయినా సమస్యలు పరిష్కరించాలని అన్నారు. తెలంగాణ ఏర్పడ్డాక మెజార్టీ నిర్వాసితులకు పరిహారం, ప్యాకేజీలు అందాయని అధికారులు అంటుంటే.. చాలా మంది పరిహారం అందాల్సినవారున్నారని నిర్వాసితులు వాపోతున్నారు. ముంపు గ్రామాల ఐక్యవేదిక,అఖిలపక్షం ఆధ్వర్యంలో గతంలో పోరుబాట నిర్వాహించారు. అదే ఊపుతో రాష్ట్రస్థాయిలో వివిధ పార్టీల ముఖ్యనేతలతో కలిసి సభలు పెట్టి తమ గలం విప్పారు. ఇండ్ల నిర్మాణానికి రూ.5.04లక్షల హామీ,18 ఏళ్లు నిండిన యువతీ, యువకులకు రూ. 2 లక్షల ప్యాకేజీ, పట్టా, ఇల్లు ఉండి గ్రామంలో లేరనే నెపంతో గెజిట్ జాబితా నుంచి తొలగించిన వారి పేర్లు మళ్లీ గెజిట్ జాబితాలో చేర్చి పరిహారం, అధికారులు ఎస్టిమేట్ చేసిన పరిహారం రాని ఇళ్లకు పరిహారం ఇవ్వాలని, కాలనీల్లో కుటీర పరిశ్రమలు నెలకొల్పాలనే డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచారు. రాజన్నసిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం మాన్వాడ వద్ద 2006లో రాజరాజేశ్వర (మిడ్‌మానేరు)రిజర్వాయర్ పనులు ప్రారంభించారు. పదేళ్ల అనంతరం ప్రాజెక్టులోకి నీరు చేరింది. ప్రాజెక్టు నిర్మాణంలో బోయినపల్లి మండలం కొదురుపాక, నీలోజిపల్లి, వరదవెల్లి, వేములవాడ మండలం అనుపురం, రుద్రవరం, సంకెపెల్లి, ఆరెపెల్లి కొడుముంజ, తంగళ్లపల్లి మండలం చీర్ల వంచ, చింతలఠాణా, ఇల్లంత కుంట మండలం గుర్రంవానిపల్లి గ్రామాలు ముంపునకు గురయ్యాయి. అధికారులు ఆయా గ్రామాల్లో సర్వే చేసి 11,731 కుటుంబాలు ముం పునకు గురవుతున్నట్లు 2008–09లో గెజిట్ ప్రకటించారు. ప్యాకేజీలు రాని నిర్వాసితుల నుంచి ప్రత్యేకాధి కారులు దరఖాస్తులు తీసుకు న్నారు. ఆర్అండ్ఆర్ కాలనీలకు తరలిన నిర్వాసితులకు ప్రభుత్వం 242చదరపు గజాల ఇంటి స్థలం మంజూరు చేసింది. ఇళ్ల నిర్మాణాలకు రూ.5.04 లక్షలు ఇస్తామని కేసీఆర్ వేములవాడలో ఇచ్చిన హామీని అమలు చేయాలని ఐక్యవేదిక, అఖిల పక్షం నేతలు డిమాండ్ చేసారు. ఇళ్ల నిర్మాణాలకు రూ. 5.04 లక్షలు ఇవ్వాలనే విషయం దృష్టికి తీసుకువెళ్లినట్లు స్థానిక నేతలు తెలిపారు.అయితే సమస్యలేవీ పరిష్కారం కాలేదని నిర్వాసితులు అంటున్నారు.కొత్తప్రభుత్వంతమసమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

# హైకోర్టు ఆదేశాలు బేఖాతర్

**అమరావతి,డిసెంబర్12 :** కోర్టు ఆదేశాలు పాటించకపోవడంతో మున్సిపల్ కమిషనర్‌కు ఎపి హైకోర్టు నెల రోజులు జైలు శిక్షతో పాటు రెండువేల రూపాయల జరిమానా విధించింది. గుంటూరు మున్సిపల్ కమిషనర్‌గా కీర్తి చేకూరి పని చేస్తున్నారు. గుంటూరు కార్పొరేషన్ పరిధిలోని యడవలి వారి సత్రాన్ని అక్రమంగా ఆక్రమించుకొని లీజు చెల్లించకుండా స్కూల్‌ను నడుపుతున్నారంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. పిటిషనర్‌లకు రూ.25 లక్షలు చెల్లించాలని హైకోర్టు ఆదేశించింది. హైకోర్టు ఆదేశాలను మున్సిపల్ కమిషనర్ కీర్త అమలు చేయలేదు. దీంతో పిటిషనర్ మరోసారి హైకోర్టును ఆశ్రయించడంతో కోర్టు ధిక్కరణ వ్యాజ్యంపై హైకోర్టు విచారణ చేపట్టింది. మున్సిపల్ కమిషనర్ కీర్తికి నెల రోజుల జైలు శిక్షతో పాటు రెండు వేల రూపాయల జరిమానా విధించింది. జనవరి 2న రిజిస్ట్రార్ వద్ద లొంగిపోవాలని కోర్టు ఆమెకు సూచించింది.

# వచ్చే ఏడాదికి సెలవులు ప్రకటన

**హైదరాబాద్,డిసెంబర్12 :** 2024 సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం సెలవుల జాబితాను ప్రకటించింది. వచ్చే ఏడాదిలో సాధారణ సెలవులు 27, ఐచ్ఛిక సెలవులు 25 ఉండనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు.జనవరి 15న సంక్రాంతి సెలవు, మార్చి 8న మహా శివరాత్రి, మార్చి 25న హోలీ, ఏప్రిల్ 9న ఉగాది, ఏప్రిల్ 17న శ్రీరామనవమి, జూన్ 17న బక్రీద్, సెప్టెంబర్ 7న వినాయక చవితి, అక్టోబర్ 10న దసరా, అక్టోబర్ 31న దీపావళికి సెలవులు ప్రకటిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ రాజీనామా

## ఇంకా ఆమోదించని గవర్నర్ తమిళసై

## కోర్టులో కేసు ఉండడమే కారణమని భావన

హైదరాబాద్,డిసెంబర్12 : టిఎస్‌పిఎస్‌సి ఛైర్మన్ జనార్ధన్ రెడ్డి రాజీనామాను గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆమోదించలేదు. సోమవారం సాయంత్రం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో జనార్ధన్ రెడ్డి సమావేశమైన తరువాత అతడు రాజీనామా చేశారు. రాజీనామాను ఆమోదించినట్లు వస్తున్న వార్తలు అవాస్తవం అని రాజ్‌భవన్ వర్గాలు వెల్లడించాయి. గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ప్రస్తుతం పుదుచ్చేరిలో ఉన్నారని వివరించాయి. జనార్ధన్ రెడ్డి రాజీనామా లేఖ గవర్నర్ పరిశీలనలో ఉందని వెల్లడించాయి. పుదుచ్చేరిలో ఉన్న గవర్నర్‌కు అన్ని వివరాలు పంపించామని పేర్కొన్నాయి. పేపర్ లీకులు అయినప్పుడే నిరుద్యోగుల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని టీఎస్పీఎస్సీ బోర్డును రద్దు చేయాలని కోరుతూ రాష్ట్రపతికి గవర్నర్ తమిళసై లేఖ రాశారు. అప్పుడు దానిని డీఓపీటీకి రాష్ట్రపతి అధికారులు పంపించారు. టీఎస్ పీఎస్సీ వ్యవహారంపై వివరణ ఇవ్వాలని .. ఏం జరిగిందో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వానికి అక్కడినుంచిలేఖ అందింది. మునుపటి బీఆర్ఎస్ ప్రభుత్వం స్పందించకుండా సైలెంట్‌గా ఉండిపోయింది.

ఇపుడు ప్రభుత్వం మారగానే టీఎస్ఎస్‌పీఎస్సీ ఛైర్మన్ రాజీనామా లేఖ ఇచ్చారు. ఇప్పటికే కోర్టులో పేపర్ లీకు కేసు ఉంది. గతంలో చర్యలు తీసుకునేలా బోర్డును పుర్తిగా రద్దు చేసేలా ముందుకి వెళ్లడమా..? లేదంటే జనార్దన్ రెడ్డి రాజీనా మాను ఆమోదించడమా? అనే దానిపై గవర్నర్ సందిగ్ధంలో ఉన్నారు. రాజీనామా ఆమోదిస్తే పేపర్ లీకు సంగతి అంతేనా అనే ఆలోచనలో గవర్నర్ తమిళి సై ఉన్నారు. లీగల్ ఒపీనియన్ తీసుకోవడంతో పాటు.. ప్రస్తుత రాష్ట్ర సర్కార్ స్టాండ్ తెలుసుకునేందుకు సీఎస్‌కు లేఖ రాసే అవకాశం ఉంది.

# ప్రజావాణికి పెరుగుతున్న ఆదరణ



- భారీగా తరలివచ్చి ప్రజల వినతులు
- సమస్యలు పరిష్కరిస్తామన్న మంత్రి కొండా సురేఖ

**హైదరాబాద్,డిసెంబర్12 :** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణికి అనూహ్య స్పందన లభించింది. అర్జిదారుల సమస్యలను పరిష్కరించటానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర దేవాదాయ, అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ చెప్పారు. ప్రజావాణికి వచ్చిన ప్రతి ఒక్కరి సమస్యను తెలుసుకుని, వారి అర్జీలను తీసుకున్నారు. ప్రతి అర్జికి ఒక నంబర్ ను కేటాయిస్తున్నట్లు తెలిపారు. అలాగే అర్జిదారుల రిఫరెన్స్ కోసం వారి సెల్ ఫోన్ నంబర్ కు సంక్షిప్త సందేశనీ పంపుతున్నట్లు తెలిపారు.ప్రజావాణి నిర్వహణను జలమండలి ఎండి దాన కిషోర్, జిహెచ్ ఎంసి కమిషనర్ రోనాల్డ్ రాస్ సమన్వయం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఐఎఎస్ అధికారి ముషారఫ్ అలీ, ఆయుష్ డైరెక్టర్ హరిచందన, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ వెంకటేష్ దొత్రి, ఇతర అధికారులు పాల్గొన్నారు. మహాత్మా జ్యోతి బాపూలే ప్రజాభవన్ నందు ఇక నుండి వారానికి రెండు రోజులు పాటు ప్రజావాణి నిర్వహించనున్నట్లు ప్రజాభవన్ అధికారులు వెల్లడించారు. ప్రతి మంగళవారం, శుక్రవారం రోజుల్లో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజావాణి జరుగుతుంది. ఆయా రోజుల్లో ఉదయం 10 గంటల నుండి విజ్ఞాపనలు ఇచ్చుటకు ప్రజాభవన్ కు చేరుకోవాలని అర్జిదారులకు అధికారులు సూచించారు. ఈ శుక్రవారం 15వ తేదీన ప్రజావాణి వుంటునీదని అధికారులు వెల్లడించారు.



# ప్రభుత్వాన్ని అస్థిరపరచే కుట్ర

### డిజిపికి కాంగ్రెస్ నేతల ఫిర్యాదు

**హైదరాబాద్,డిసెంబర్12 :** బీఆర్ఎస్, బీజేపీ పార్టీల ఎమ్మెల్యేలపై తెలంగాణ డీజీపీ రవిగుప్తాకి కాంగ్రెస్ నేతలు మంగళవారం నాడు ఫిర్యాదు చేశారు. పీసీసీ జనరల్ సెక్రెటరీలు కైలాష్ నేత, చారుకొండ వెంకటేష్, మధుసూదన్‌రెడ్డి డీజీపీ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదును డీజీపీకి ఇచ్చారు. ఇటీవల ఆరు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందని బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు మాట్లాడుతూ.. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల ఎమ్మెల్యేలు కుట్ర పన్ని ఒకరకమైన స్టేట్‌మెంట్ ఇచ్చారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీల ఎమ్మెల్యేలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. అందుకే డీజీపీకి ఫిర్యాదు చేశాం. బీఆర్ఎస్, బీజేపీ పార్టీల ఎమ్మెల్యేలు రాష్ట్రంలో కుట్రలకు తెరలేపారు. మా ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి ప్రజాస్వామ్యాన్ని కులగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. డీజీపీ రవిగుప్తాకు వినతిపత్రం ఇచ్చాం. సమగ్రంగా అధ్యయనం చేయాలని డీజీపీని కోరాం. ప్రజలందరూ బీఆర్ఎస్, బీజేపీ పార్టీల ఎమ్మెల్యేల వ్యాఖ్యలను గమనిస్తున్నారని కాంగ్రెస్ నేతలు తెలిపారు.

# అవినీతిలో కాంగ్రెస్‌ది 70ఏళ్ల చరిత్ర

### మరోమారు ట్వీట చేస్తూ ప్రధాని విమర్శలు

**న్యూఢిల్లీ,డిసెంబర్12 :** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మరోసారి కాంగ్రెస్ పార్టీ అవినీతి పై చురకలు వేశారు. ఒడిశాలోని డిస్టిలరీలపై వరుస దాడుల్లో సుమారు రూ.350 కోట్ల నల్లధనం, 3 కిలోల బంగారు అభరణాలను ఆదాయం పన్ను శాఖ స్వాధీనం చేసుకున్న నేపథ్యంలో మోదీ తాజా ట్వీట్ చేశారు.ఇండియాలో...డబ్బు దోపిడీ ఫిక్షన్ స్టోరీలు కావాలంటే కాంగ్రెస్ పార్టీ ఉంది కదా,వాళ్లదోపిడీచరిత్ర70ఏళ్లు, ఆచరిత్ర లెజెండ్రీ. ఆ లెజెండ్రీ దోపిడీలను ఇంకా లెక్కపెడుతూనే ఉన్నారని అంటూ మోదీ ట్వీట్ చేశారు. పట్టుబడిన కరెన్సీ నోట్లు, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఉన్న ఒక వీడియోను బీజేపీ పోస్ట్ చేసింది. స్పానిష్ హిట్ సిరీస్ 'మనీ హీస్ట్'పై బీజేపీ క్రియేట్ చేసిన మార్ఫ్‌డ్ వీడియోను మోదీ షేర్ చేశారు. ప్రస్తుతం ఈ వీడియో వైరల్ అవుతోంది.

# నిర్మాణాత్మక ప్రతిపక్షంగా ఉంటాం: దేవిరెడ్డి

**హైదరాబాద్,డిసెంబర్12 :** ఓటమితో కుంగిపోవటం రాజకీయ నాయకుల లక్షణం కాదని ఎల్‌బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం అసెంబ్లీ ప్రాంగణంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ పార్టీలకు ప్రజల వైపు ఉండాలనే సూత్రీకరణకు అనుగుణంగా తాము ఉంటామని, ఈ క్రమంలో గెలిచిన ప్రభుత్వానికి ప్రతిపక్ష పార్టీగా తాము నిర్మాణాత్మక సూచనలు తప్పకుండా చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని సూచించారు. గెలిచినా ఓడినా ప్రజల యోగక్షేమాలే పరమాధిగా పనిచేస్తామని ఆయన వెల్లడించారు. తొందరపడి ఎవరూ వ్యాఖ్యలు చేయడం సరియైంది కాదన్నారు. ఓటమిని హుందాగా స్వీకరిద్దామన్నారు. కొత్త ప్రభుత్వానికి కనీసం నాలుగైదు నెలల సమయం ఇచ్చి వేచి చూశాక.. హామీలు అమలు చేయకపోతే ప్రజల అభిప్రాయానికి అనుగుణంగా వ్యవహరిస్తామని చెప్పారు. తాను పార్టీ మారుతున్నట్టు వస్తున్న వ్యాఖ్యలను ఆయన తిప్పి కొట్టారు. ప్రజా సేవకు పార్టీ మారాల్సిన అవసరం లేదన్నారు.

# పార్టీ ఆదేశిస్తే మెదక్ ఎంపిగా పోటీ

**హైదరాబాద్,డిసెంబర్12 :** భారతీయ జనతా పార్టీ ఆదేశిస్తే పార్లమెంట్ ఎన్నికలలో మెదక్ నుంచి ఎంపిగా పోటీ చేస్తానని ఆ పార్టీ నేత రఘునందన్ తెలిపారు. ఇటీవల ఆయన దుబ్బాకలో ఓడిపోయిన సంగతి తెలిసిందే. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. దుబ్బాకలో డబ్బులు పంచడంతోనే బిఆర్ఎస్ విజయం సాధించిందని ఆరోపణలు చేశారు. సిపికి ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని దుయ్యబట్టారు. దుబ్బాక్ నుంచి పోటీ చేసి రఘునందన్ ఓటమి పాలయ్యారు. ఈ నియోజకవర్గంలో రఘునందన్‌పై కొత్త ప్రభాకర్ రెడ్డి గెలిచారు. 53 వేలకు పైగా ఓట్ల తేడాతో ప్రభాకర్ రెడ్డి గెలిచారు.

# టీఎస్‌పీఎస్సీ సభ్యుడు ఆర్ సత్యనారాయణ రాజీనామా

**హైదరాబాద్,డిసెంబర్12 :** టీఎస్‌పీఎస్సీ సభ్యుడు ఆర్ సత్యనారాయణ రాజీనామా చేశారు. తాను ఏ తప్పు చేయలేదు.. అయినా తప్పుకుంటున్నానని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో తమ బాధ్యత నిర్వర్తించే వాతావరణం లేదని పేర్కొన్నారు. కొత్త కమిషన్ ఆధ్వర్యంలోనే నియామకాలు జరగాలన్న ఉద్యోగార్థుల ఆకాంక్షలను గౌరవిస్తున్నాను. ఇప్పుడే కాదు.. తన విద్యార్థి జీవిత కాలం నుంచి కూడా తాను నిరుద్యోగుల పక్షమే. ఇక ముందు కూడా నిరుద్యోగుల పక్షమే. మీ అందరి ఆశలు, ఆకాంక్షలు వీలైనంత త్వరగా నెరవేరాలని కోరుకుంటున్నానని సత్యనారాయణ పేర్కొన్నారు.

# ఆర్థిక శాఖ పుస్తకం ఆవిష్కరించిన భట్టి



**హైదరాబాద్,డిసెంబర్12:** రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కను మంగళవారం డా.బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో పలువురు ఉన్నతాధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు కలసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. అలాగే ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సునీల్ శర్మతో పాటు ఆశాఖ ఉన్నతాధికారులు మంత్రిని కలసి అభినందనలు తెలిపారు. రాష్ట్రాభివృద్ధిలో అందరూ కలిసికట్టుగా పని చేయాలని డిప్యూటీ సీఎం సూచించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక శాఖ రూపొందించిన 'తెలంగాణ స్టేట్ ఎట్ ఏ గ్లాన్స్'అనే పుస్తకాన్ని మంత్రి బట్టి విక్రమార్క ఆవిష్కరించారు. ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, తదితరులు పాల్గొన్నారు.

# పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రక్షాళనతో భరోసా

### నిరుద్యోగలు సమస్యలు సిఎంకు వివరిస్తాం: వెంకట్

**హైదరాబాద్,డిసెంబర్12 :** నిరుద్యోగుల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ తెలిపారు. మంగళవారం నాడు ఆయన మీడియాతో మాట్లాడుతూ... తెలంగాణలో ఉన్న నిరుద్యోగులు పేపర్ లీకవుతున్నాయని మొరపెట్టుకున్నా గత బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని చెప్పారు. ఆరోజు రేవంత్‌రెడ్డి చెపినట్టు .. టీఎస్పీఎస్సీ ప్రక్షాళన చేస్తానని మాట ఇచ్చారన్నారు. సోమవారం సీఎం 48 గంటల్లో పేపర్ లీకేజీలపై టీఎస్పీఎస్సీ చైర్మన్ జనార్ధన్‌రెడ్డిని వివరణ అడిగితే ఆయన తప్పిదాలను కప్పిపుచ్చు కోడానికి రాజీనామా చేశారని చెప్పారు. టీఎస్పీఎస్సీ ప్రక్షాలనపై సీఎం తీసుకున్న నిర్ణయం నిరుద్యోగులకు భరోసాని ఇస్తుందన్నారు. టీఎస్పీఎస్సీ విషయంలో సీఎం కలిపించిన భరోసాకి విద్యార్థుల తరుపున కృతజ్ఞతలు. రాష్ట్రంలో వివిధ శాఖలల్లో ఉన్న భర్తీలను నిరుద్యోగులతె భర్తీ చేసేలా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని భావిస్తున్నామని అన్నారు. నిరుద్యోగులకి ప్రభుత్వానికి మధ్య వారధిగా ఎన్ఎస్‌యూఐ పనిచేస్తుందని తెలిపారు. సీఎం సమక్షంలో టీఎస్పీఎస్సీ (ఃూఖాఅ) నిరుద్యోగులకు న్యాయం చేసే దిశగా పనిచేస్తుందని నమ్ముతున్నామని బల్మూరి వెంకట్ పేర్కొన్నారు.

# జెన్కో రాత పరీక్ష వాయిదా

**హైదరాబాద్,డిసెంబర్12 :** జెన్కో రాత పరీక్షను తెలంగాణ ప్రభుత్వం వాయిదా వేసింది. ఈనెల17వ తేదీన జరగాల్సిన జెన్కో పరోక్షని వాయిదా వేశారు. ఇతర సంస్థల, ప్రభుత్వ పోటీ పరీక్షలు ఉండడంతో జెన్కో రాత పరీక్షను వాయిదా వేయాలని ప్రభుత్వాన్ని పలువురు నిరుద్యోగులు కోరారు. అభ్యర్థులు కోరడంతో ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ఈ పరీక్షను వాయిదావేసింది.దీంతో అభ్యర్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మళ్లీ ఓ తేదీని త్వరలోనే ప్రకటిస్తామనితెలిపింది.వివరాలకోసం సంస్థ వెబ్‌సైటులో తెలియ చేస్తామని ప్రభుత్వం పేర్కొంది.

# ఎన్నికల వరకే రాజకీయాలు

### తరవాత అభివృద్ధి కోసం కృషి

### హుస్నాబాద్‌లో మంత్రి పొన్నం





**హుస్నాబాద్,డిసెంబర్12 :** కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి హుస్నాబాద్‌లో కేంద్రీయ విద్యాలయాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. ఎన్నికల వరకే రాజకీయాలు ఉండాలని, అనంతరం అభివృద్ధి ఎజెండాగా పనిచేయాలని సూచించారు. మంగళవారం హుస్నాబాద్ మున్సిపల్ సమావేశ మందిరంలో మంత్రికి పౌరసన్మానం జరిగింది. మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజితతో పాటు పాలకవర్గం మంత్రికి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. హుస్నాబాద్ పట్టణానికి చుట్టూ 40కిలోమీటర్ల వరకు పెద్ద పట్టణం లేదని, హుస్నాబాద్ పట్టణాన్ని నగరంగా తయారు చేసి ఈ ప్రాంత ప్రజలు గర్వంగా చెప్పుకునే విధంగా అభివృద్ధి చేస్తానని చెప్పారు. హుస్నాబాద్‌కు మెడికల్ కాలేజీ మంజూరు ఖాయమని, ఇందుకోసం స్థల పరిశీలన చేయాల్సిందిగా రెవెన్యూ అధికారులను ఆదేశించామని తెలిపారు. అనంతరం హుస్నాబాద్ లోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ సందర్శించారు. అక్కడ వాసవీ సేవా సమితి వారు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం దవాఖాన లోపలికి వెళ్లి రోగులతో మాట్లాడి సౌకర్యాలపై ఆరాతీశారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్, వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనితారెడ్డి, కమిషనర్ రాజశేఖర్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# యశోదలో కెసిఆర్‌కు మంమంత్రుల పరామర్శ

### త్వరగా కోలుకుని రావాలని ఆకాంక్ష



**హైదరాబాద్,డిసెంబర్12 :** తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పరామర్శలు కొనసాగుతున్నాయి. తుంటి ఎముక ఫ్యాక్చర్‌తో ప్రస్తుతం కేసీఆర్ సోమాజిగూడ యశోదా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు కేసీఆర్‌ను కలిసి పరామర్శిస్తున్నారు. చంద్రశేఖర్‌రావుని మంత్రులు దామోదర రాజనర్సింహ, దుద్దిళ్ల శ్రీధర్ బాబు సోమాజిగూడ యశోద ఆస్పత్రిలో పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ... కేసీఆర్‌ని పరామర్శించేందుకు వచ్చాం. కేసీఆర్ ఆరోగ్యంగా ఉన్నారు... బహుశా రెండురోజుల్లో కేసీఆర్ డిశ్చార్జ్ అవుతారని మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. కేసీఆర్‌ని పరామర్శించి ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నాం. కేసీఆర్ త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను. అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనాలని కోరాం. స్పీకర్ ఎన్నికలో కూడా ఏకగ్రీవంగా ఎన్నిక జరిగే విధంగా సహకరించాలని కేసీఆర్‌ని కోరాం. కేసీఆర్‌కి ఉన్న సుదీర్ఘ రాజకీయ అనుభవాన్ని అందించాలని కోరాం. అందరూ నాయకులను కలుపుకుని ప్రజలకు మంచి పాలన అందిస్తామని కేసీఆర్‌కి చెప్పామని దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. తాజాగా మేఘాలయ ముఖ్యమంత్రి కోన్రాడ్ సంగ్మా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఫోన్ చేసి కేసీఆర్ ఆరోగ్యపరిస్థితి అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అదే సమయంలో యూపీ మాజీ సీఎం అఖిలేష్ యాదవ్ మరోసారి కేటీఆర్‌కు ఫోన్ చేసి కేసీఆర్ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ బుధవారం స్వయంగా వచ్చి కేసీఆర్‌ను పరామర్శించనున్నారు. ఇప్పటికే కేటీఆర్‌కు గవర్నర్ ఫోన్ చేసి కేసీఆర్ ఆరోగ్యస్థితి పై ఆరా తీసి పరామర్శించిన సంగతి తెలిసిందే.

# తెలంగాణలో పలువురు ఐపిఎస్‌కు స్థానచలనం

(మొదటిపేజీ తరువాయి)

జరిగాయి. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ పరిధిలో కమిషనర్లను బదిలీ చేస్తూ రేవంత్ సర్కార్ నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ నూతన సీపీగా కొత్త కోట శ్రీనివాస్‌రెడ్డి నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాచకొండ సీపీగా సుధీర్ బాబు , సైబరాబాద్ సీపీగా అవినాష్ మహంతి నియమితులయ్యారు. అలాగే హైదరాబాద్ పాత సీపీ సందీప్ శాండిల్యాను తెలంగాణ నార్కోటిక్ బ్యూరో డైరక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర, రాచకొండ సీపీ చౌహన్‌ను డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇదిలావుంటే మాజీ డీజీపీ అంజనీ కుమార్‌పై కేంద్ర ఎన్నికల సంఘం సస్పెన్షన్ ఎత్తివేసింది. డిసెంబర్ 3న అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ముగియక ముందే పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డిని అప్పటి డీజీపీ అంజనీ కుమార్‌తోపాటు అదనపు డీజీ సంజయ్ కుమార్, మహేశ్ భగవత్ కలిశారు. దీంతో ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని అంజనీ కుమార్‌ను సస్పెండ్ చేయగా, మిగిలిన ఇద్దరు ఐపీఎస్ అధికారులకు నోటీసులు జారీచేసింది. అయితే తాను ఉద్దేశపూర్వకంగా ఎన్నికల కోడ్ ఉల్లంఘించలేదని ఈసీకి మాజీ డీజీపీ తెలిపారు. ఎన్నికల ఫలితాల రోజున రేవంత్ రెడ్డి పిలిస్తే వెళ్లానని చెప్పారు. ఇలాంటి ఘటన పునరావృతం కాదని వివరణ ఇచ్చారు. ఆయన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న ఈసీ.. సస్పెన్షన్ ఎత్తివేస్తూ నిర్ణయం తీసుకున్నది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి సీఈసీ సమాచారం అందించింది. నవంబర్ 30న అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరిగింది.. డిసెంబర్ 3న ఫలితాలు వెల్లడయ్యాయి. ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధిక్యంలో కొనసాగింది. పూర్తిస్థాయిలో కౌంటింగ్ పూర్తికాకముందే డీజీపీగా ఉన్న అంజనీకుమార్ మధ్యాహ్నం సమయంలో ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఐపీఎస్ అధికారులు మహేశ్ భగవత్, సంజయ్ కుమార్‌తో కలిసి రేవంత్ వద్దకు వెళ్లిన ఆయన పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అయితే ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతోపాటు ఓట్ల లెక్కింపు పూర్తవకముందే డీజీపీ హోదాలో రేవంత్ రెడ్డిని కలవడంపై కేంద్ర ఎన్నికల సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆనపై సస్పెన్షన్ వేటువేసిన విషయం తెలిసిందే.

# ఎపికి ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందే

(మొదటిపేజీ తరువాయి)

పనులు ప్రారంభిస్తామన్నారు. నేషనల్ హైవేస్ అథారిటీ ఛైర్మన్‌ను కలిసి చర్చిస్తానన్న ఆయన, గత ప్రభుత్వం రూ. 300 కోట్ల విషయంలో ప్రాజెక్టు ముందుకు వెళ్లకుండా చేసిందన్నారు. రూ. 20 వేల కోట్ల విలువైన ప్రాజెక్టు పూర్తిగా కేంద్రం భరిస్తోందన్న కోమటిరెడ్డి, యుటిలిటీ ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వం భరించాలని కోరిందన్నారు. గత ముఖ్యమంత్రి రూ. 300 కోట్లు ఇవ్వలేమని లేఖ రాయడంతోనే పనులు ప్రారంభం కాలేదని గుర్తు చేశారు. 340 కి.మీ పొడవైన రీజనల్ రింగ్ రోడ్ తెలంగాణకే మణిహారం అని, సగం తెలంగాణ రాష్ట్రం దీని కింద కవర్ అవుతుందన్నారు. దేశంలో మరెక్కడా ఇంత పెద్ద రింగ్ రోడ్డు ప్రాజెక్టు లేదన్నారు.ముఖ్యమంత్రితో చర్చించి యుటిలిటీ ఖర్చులు భరిస్తామంటూ కేంద్రానికి లేఖ రాయిస్తానన్నారు. నెల రోజుల్లో టెండర్లు పిలిచి పనులు ప్రారంభించేలా చూస్తామని, రూ. 60 కోట్లకు ఒక టెండర్ చొప్పున బిట్లుగా పనిని విభజించి త్వరగా పూర్తయ్యేలా చూస్తామని వెల్లడించారు. రేవంత్ రెడ్డి కేబినెట్ లో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆర్ అండ్ బీ, సినిమాటోగ్రఫీ మినిస్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. నల్గొండ నియోజకవర్గం నుంచి గెలుపొందిన ఆయన ఎన్ఎస్‌యూఐ ద్వారా రాజకీయాల్లోకి ఆరంగేట్రం చేశారు. 1999, 2004, 2009, 2014 అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందారు. నల్గొండ స్థానం నుంచి వరసగా 3 సార్లు విజయం సాధించిన తొలి సభ్యుడిగా పేరు సంపాదించుకున్నారు. వైఎస్, రోశయ్య మంత్రివర్గాలలో ఐటీ, యువజన సర్వీసులు, క్రీడల మంత్రిగా పని చేశారు. కిరణ్ కుమార్ రెడ్డి మంత్రివర్గంలో మౌలిక వసతులు, పెట్టుబడులు శాఖల మంత్రిగా పని చేసిన ఆయన, తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో 2011 అక్టోబరు 5న మంత్రి పదవికి రాజీనామా చేశారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో నల్గొండ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరపున పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో భువనగిరి నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున ఎంపీగా విజయం సాధించారు. బీఆర్ఎస్ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్ పై 4500 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. 2022 ఏప్రిల్ 10న శాసనసభ ఎన్నికల స్టార్ క్యాంపెనర్‌గా నియామకం అయ్యారు. 2023 సెప్టెంబర్ 20న కాంగ్రెస్ ఎన్నికల స్క్రీనింగ్ కమిటీలో స్థానం సంపాదించారు. తాజాగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నల్గొండ నుంచి పోటీ చేసి విజయం సాధించి...మంత్రిగా బాధ్యతలు చేపట్టారు.

# ఆందోళనకరంగా పౌరసరఫరాల శాఖ

(మొదటిపేజీ తరువాయి)



లేదని చెప్పారు. కొందరు రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారని తెలిపారు. గ్యాస్ సిలిండర్ హామీ వంద రోజుల్లో అమలు చేస్తామని తెలిపారు. కొత్త రేషన్ కార్డు దరఖాస్తులపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. రాష్ట్రంలో రైతుల నుంచి సివిల్ సప్లై శాఖ ద్వారా కొనుగోలు చేస్తున్న ధాన్యం వివరాలను మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమీక్ష అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పేద ప్రజలకు ప్రభుత్వం ఇస్తున్న బియ్యం సరఫరా విషయంలో మరింత పారదర్శకంగా ఉండాలన్నారు. 1.8 మెట్రిక్ టన్నుల బియ్యం ప్రజలకు ఉచితంగా ఇస్తున్నామని, కానీ ప్రజలు వాటిని ఉపయోగించుకుంటున్నారా అన్నది మనం గమనించాలని ఆధికారుకులకు సూచించినట్లు తెలిపారు. కిలో 39 రూపాయలు పెట్టి బియ్యం సేకరించి ప్రజలకు ఉచితంగా ఇస్తున్నామని.. కానీ, అవి పేదలు తినకపోతే ఇంత పెద్ద గొప్ప ఉచిత బియ్యం పథకం నిరుపయోగం అవుతుందని అన్నారు. మొక్కుబడిగా కాకుండా లోపాలు ఎక్కడ ఉన్నాయో వెతకాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. బియ్యం పేదలకు ఎలా ఉపయోగకరమైన పథకంగా ఉంటుందో అధ్యయనం చేయాల్సి ఉందన్నారు. రేషన్ బియ్యాన్ని కొందరు పక్కదారి పట్టిస్తున్నారని.. పేదలకు ఇస్తున్న బియ్యం వారు తినే విదంగా ఉండాలి తప్ప.. దుర్వినియోగం కావొద్దని అన్నారు. మిల్లర్ల సమస్యలపైనా అధికారులతో చర్చించామని తెలిపారు. కొత్త రేషన్ కార్డు దరఖాస్తులపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని మంత్రి ఉత్తమ్ తెలిపారు. పేదలకు నాణ్యమైన రేషన్ బియ్యం ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ప్రజలకు అవినీతిలేని పారదర్శకమైన పాలన అందిస్తామన్నారు. సచివాలయంలో యాసంగి, వర్షాకాంలో ధాన్యం ఉత్పత్తిపై అధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మిల్లింగ్ సామర్థ్యం, బియ్యం నాణ్యత అధికారులు మంత్రికి వివరించారు. రైతుల నుంచి ధాన్యం సేకరణ పారదర్శకంగా జరగాలని అధికారులను ఆదేశించారు. పౌరసరఫరాల శాఖ ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా ఉందన్నారు. రూ.56 వేల కోట్ల అప్పుల్లో ఉందని చెప్పారు.

# కాశ్మీర్ సమస్య ఇరు దేశాలదే

### సంప్రదింపులతో పరిష్కరించుకోవాలి

### చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి వెల్లడి

**బీజింగ్,డిసెంబర్12 :** కశ్మీర్ సమస్యను భారత్, పాకిస్థాన్‌లు పరస్పర సంప్రదింపుల ద్వారా పరిష్కరించుకోవాలని చైనా సూచించింది. ఇది ద్వైపాక్షిక విషయం , ఈ వరుసలోనే చర్చలు అవసరం అని మంగ ళవారం చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి మావో నింగ్ తెలిపారు. కశ్మీర్ సంబంధిత ఆర్టికల్ 370 రద్దుపై సుప్రీంకోర్టు తీర్పు గురించి చైనా ప్రతినిధి విలేకరుల సమావేశంలో ప్రస్తావించారు. పాకిస్థానీ జర్నలిస్టు ఈ సందర్భంగా భారతదేశ సుప్రీంకోర్టు తీర్పుపై చైనా స్పందనను కోరారు. దీనికి చైనా తరఫున నింగ్ సమాధానం ఇచ్చారు. కశ్మీర్ విషయంలో చైనా వైఖరి సుస్పష్టంగా ఉందని ఈ ప్రతినిధి తెలిపారు. ఇరుదేశాలే సమస్యను పరిష్కరించుకోవల్సి ఉంటుందని ఈ మహిళా ప్రతినిధి వెల్లడించారు. శాంతియుత పద్దతులు, ఐరాస ఛార్టర్, భద్రతా మండలి తీర్మానాలు కశ్మీర్ విషయంలో ఖరారు అయి ఉన్నాయని, వీటి పరిధిలోనే భారత్ పాకిస్థాన్ సరైన రీతిలో పరిష్కారాలు వెతుక్కోవల్సి ఉంటుందన్నారు. ఆర్టికల్ 370పై సుప్రీంకోర్టు తీర్పు పట్ల పాకిస్థాన్ స్పందించింది. ఆర్టికల్ 370 రద్దు సబబే అనే తీర్పు చట్టరీత్యా చెల్లనేరదని స్పందించింది. అంతర్జాతీయ న్యాయం పరిధిలో ఎట్టి పరిస్థితుల్లోనూ ఆర్టికల్ 370 రద్దు నిర్ణయం నిలవజాలదని చైనా మిత్రదేశం అయిన పాకిస్థాన్ ప్రకటించింది.

# బిజెపి నేతలకు చరిత్ర తెలియదు

### నెహ్రూపై అమిత్ షా వ్యాఖ్యలపై రాహుల్ విమర్శలు

**న్యూఢిల్లీ,డిసెంబర్12 :** తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మంగళవారం స్పందించారు. బీజేపీ నేతలకు చరిత్ర తెలియదంటూ విమర్శలు గుప్పించారు. రాజ్యసభలో సోమవారం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా కాశ్మీర్ సమస్యకు నెహ్రూనే కారణం అంటూ విమర్శించారు. ఈ వ్యాఖ్యలపై రాహుల్ స్పందిస్తూ నెహ్రూ దేశం కోసం తన జీవితాన్ని త్యాగం చేశారన్నారు. ఏళ్ల తరబడి జైలులోనే ఉన్నారని, అమిత్ షాకు చరిత్ర తెలియదన్నారు. ఆయన చరిత్రను గుర్తుంచుకుంటాడని నేను ఆశించడం లేదన్నారు. ఇది కేవలం దృష్టి మళ్లించడమేనన్నారు. కుల గణనపైనే ఉందని.. దేశం సొత్తు ఎవరి చేతుల్లో ఉందనేది మొత్తం సమస్య అన్న రాహుల్.. ఈ విషయాలపై మాట్లాడేందుకు వారు (బీజేపీ) మాట్లాడడం లేదన్నారు. భయపడి పారిపోయేందుకు ప్రయత్నిస్తున్నారని.. ఆయా అంశాలను కాంగ్రెస్ నిరంతరం ముందుకు తీసుకెళ్తూనే ఉంటుందన్నారు. పేదలకు వారి హక్కులను కల్పిస్తామన్నారు.

# కెసిఆర్ లేని నాయకత్వాన్ని ఊహించలేం

### లోటుపాట్లను ఆలోచించి ముందుకు సాగుతాం: జగదీశ్ రెడ్డి

**సూర్యాపేట,డిసెంబర్12 :** కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను దేశంలోనే నంబర్‌వన్‌గా తీర్చిదిద్దిన కేసీఆర్ నాయకత్వం లేని తెలంగాణను ప్రజలు ఊహించుకోలేకపోతున్నారని సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జోగులాంబ నుంచి ఆలంపూర్ వరకు అందరూ బీఆర్ఎస్ అభ్యర్థులు ఓటమి పాలనప్పటికీ సూర్యాపేట మాత్రం బొడ్రాయిలా నిలిచి గెలిచిందని, వచ్చే ఎన్నికల వరకు ఒక్కటి లేకుండా అన్ని గెలుస్తామన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు జరిగిన లోటుపాట్లను ఆలోచన చేసుకావాలని అవి మరలా పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. ప్రజలు మనకు ప్రతిపక్ష బాధ్యతను ఇచ్చారని ప్రజల ఆలోచనలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకొని ముందుకు పోవాలన్నారు. అధికారం ఉన్నా లేకున్నా అణిగిమణిగి ఉండడం రాజకీయంగా తరగని పెట్టుబడి అని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలపై వారంలో స్పష్టత వస్తుందని దానిపై ఆలోచన చేద్దామన్నారు. ప్రజలు విజ్ఞులని వారు ఆలోచన చేస్తారని, మన ప్రధాన బాధ్యత పార్టీ ఏ పిలుపునిచ్చినా వెంటనే స్పందించాలన్నారు. అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజల తరపున పోరాడటమే మన ప్రధాన కర్తవ్యమని, దీన్ని నాయకులు, కార్యకర్తలు దృష్టిలో ఉంచుకొని చైతన్యవంతులై పని చేయాలని పిలుపునిచ్చారు.



# వారం రోజుల్లోనే ప్రభుత్వంపై భరోసా !

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తరవాత శరవేగంగా నిర్ణయాలు తీసుకుంటున్న తీరు అభినంద నీయం. సిఎం రేవంత్ రెడ్డి ,మంత్రులు సమీక్షలు చేస్తూ త్వరితగతిన ఇచ్చిన హామీల మేరకు ముందుకు సాగుతున్నారు. ఇవన్నీ ఒక ఎత్తయితే ప్రజలకు చేరువగా అవుతున్న తీరు కూడా అభినందనీయం. ప్రజల్లో కూడా రేవంత్ నాయకత్వంపై విశ్వాసం ఏర్పడింది. ఏదైనా చేయగలరన్న భరోసా కలిగింది. గతంలో కెసిఆర్ అహంకారంతో ఎవరినీ దరిచేరనీయలేదు. లెక్కలు తీసేవరకు ఆగకుండా రైతుబంధును ముందుగా విడుదలకు ఆదేశించారు. నిరుద్యోగులు ఎదురుచూస్తున్నట్లుగా పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టబోతున్నారు. నియామకాలు, ఖాళీల వివరాలతో రావాలని టిపి పిఎస్సీ ఛైర్మన్‌ను ఆదేశించారు. దీంతో దెబ్బకు ఆయన రాజీనామా చేశారు. అలాగే అనేకమంది సలహాదారులను, కార్పోరేషన్ ఛైర్మన్లను తొలగిం చారు. మొత్తంగా నిరుద్యోగులకు కూడా భరోసా ఏర్పడింది. సిఎం రేవంత్ రెడ్డి కూడా ఈ విషయంలో చిత్తశుద్దితోనే ఉన్నట్లుగా ఉంది. మరోవైపు మంత్రులు కూడా సమీక్షలు చేస్తున్నారు. కాళేశ్వరం అవకతవకల పై ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్షించారు. సమీక్షలు ఒకవైపు చేస్తూనే ప్రజలకు సమాచారం చేరవేస్తున్నారు. ఢిల్లీలో గత పదేళ్లుగా తెలంగాణ భవన్ పంచాయితీ తెంచలేదు. దానిని పునర్నించే పని గురించి ఆలోచించ లేదు. ఇప్పుడా పనికి కూడా మంత్రి కోమటిరెడ్డి పూనుకున్నారు. ఇలా ప్రభుత్వం ఏర్పడిన వారం రోజుల్లో నే చురుకుగా పనులు సాగుతున్నాయి. కెసిఆర్ అధికారంలో ఉండగా ఏం జరుగుతుందో ఎవరికీ తెలిసేది కాదు. ప్రజలకు సమాచారం చేరవేసేది కాదు. కెసిఆర్ ఎవరినీ దరిచేయనీయకుండా చూసుకున్నారు. తన కోటరీతో కాలక్షేపం చేశారు. ప్రజలతో సంబంధం లేకుండా పదేళ్లు అధికార పెత్తనం చెలాయించారు. తాను చేసిందే పనిగా తలచి ప్రజలపై రుద్దారు. కాళేశ్వరం లాంటి పథకాలతో అప్పులకుప్పను చేశారు. సంపద పెంచానని బొంకుతూ..ఐదులలక్షల కోట్లు అప్పుల్లో పెట్టారు.నిరంతర విద్యుత్ ఇస్తున్నానని చెప్పి.. ప్రజలను మభ్య పెట్టి 85వేల కోట్ల అప్పులను చేశారు. ఇవన్నీ ఏనాడు బయటకు రాలేదు. కానీ కొత్త ప్రభుత్వం ఏర్పడ్డ తరవాత వారం రోజుల్లోనే తేడా కనిపిస్తోంది. అందుకే రాజకీయాలలో అహంకారంతో పనిచేస్తే వారి జాతకాలను ప్రజలే మార్చివేస్తారని రుజువు అయ్యింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలి ముఖ్యమంత్రిగా పనిచేసిన కేసీఆర్ ఇంతగా అహంకారం జీర్ణించుకుంటారని ప్రజలు ఊహించి వుండరు. నిజానికి ఉమ్మడి రాష్ట్రంలో రెండవ పర్యాయం ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు తన మంత్రివర్గంలోకి కేసీఆర్‌ను తీసుకోకుండా పక్కనపెట్టడంతో కసితో కెసిఆర్ తెలంగాణ ఉద్యమాన్ని తలకెత్తుకున్నారు. తెలంగాణ ప్రజల్లో ఉన్న సెంటిమెంటును తనకు అనుకూలంగా మార్చుకుని గద్దెను ఎక్కారు. ప్రజలు కూడా కెసిఆర్‌ను నమ్మారు. చంద్రబాబు తన మంత్రివర్గంలోకి కెసిఆర్‌ను తీసుకుని ఉంటే తెలంగాణ ఉద్యమానికి అవకాశం ఏర్పడి ఉండేది కాదేమో..! ఇకపోతే ఇప్పుడు రేవంత్ ప్రభుత్వాన్ని అస్థిర పరచాలన్న ప్రయత్నాలు కూడా జరుగుతున్నట్లుగా ప్రచారం సాగుతోంది. పదిమంది ఎమ్మెల్యేలను తీసుకుంటే మాదే ప్రభుత్వం అని క్షేత్రస్థాయిలో బిఆర్ఎస్ నేతలు విర్రవీగుతున్నారు. ఇలాంటి ప్రచారాలపై రేవంత్ ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాలి. ఇదే విషయాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా బహిరంగంగానే వెలిబుచ్చారు. గతంలో ఎమ్మెల్యేలను గంపగుత్తగా కొన్న అనుభవం కెసిఆర్‌కుంది. అందువల్ల ఇలాంటి ప్రయత్నాలను పసిగట్టి ముందుకు సాగాలి. ప్రత్యేక తెలంగాణ లో రెండవ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రేవంత్ రెడ్డి ప్రజాస్వామ్యబద్దంగా ముందుకు సాగుతున్నారు. ప్రజలు కూడా ఈ విషయంలో నిశ్చింతంగా ఉన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వ అధినేతగా, తెలంగాణ రాష్ట్ర రెండవ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రేవంత్ రెడ్డి ప్రజల అభిమానం చూరగొని ముఖ్యమంత్రి స్థాయికి ఎదగడానికి పరోక్షంగా కేసీఆరే అహంకారమే కారణంగా చెప్పుకోవాలి. కుమార్తె పెళ్లి సందర్భంగా రేవంత్ రెడ్డిని బయటకు రాకుండా చేయాలని చూసినా.. బెయిల్‌పై బయటకు వచ్చి మళ్లీ వెంటనే జైలుకు వెళ్ళవలసి వచ్చింది. ఈ సంఘటన రేవంత్ రెడ్డి జీవితంలో మరచిపోలేనిదని చెప్పాలి. ఇది రేవంత్‌కు జరిగిన అవమానం. ఇలా తెలంగాణ ఉద్యమకారులు ప్రొఫెసర్ కోదండరామ్ తదితర వేలాదిమందికి ఎన్నో రకాలు గా అవమానాలు జరిగాయి. ఈ క్రమంలో తెలంగాణ పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి కూడా మరో తెలంగాణ ఆత్మగౌరవ పోరాటం చేశారు. అందుకే ప్రజలు ఆయనను ఆదరించి చేరదీసి అధికారం కట్ట బెట్టారు. బిఆర్ఎస్, బిజెపిల కుటిల రాజకీయాలరు కూడా ప్రజలు గుర్తించి, కాంగ్రెస్ పార్టీని గుర్తించి ఆదరించారు. రేవంత్ రెడ్డి నాయకత్వానికి ప్రజలు జై కొట్టారు. రేవంత్ రెడ్డి కూడా కెసిఆర్ లాగా కాకుండా అధికారంలోకి రాగేనే ప్రజాభవన్ ప్రారంభించారు. దానిముందున్న ఇనుప కంచెను తొలగించారు. ప్రజల వినతులు స్వీకరించి పరిష్కరించే కార్యక్రమం మొదలు పెట్టారు. ఆర్థిక పరిస్థితిపై లోతుగా అధ్యయనం మొదలు పెట్టారు. గత పదేళ్లుగా ఎక్కడైతే అవినీతి, అక్రమాలు జరిగాయో అక్కడి నుంచే పాలన మొదలు పెట్టడం శుభసూచకం. అందుకే ఒక్కో అంశాన్ని, పథకాన్ని సమీక్షించి ముందుకు సాగాల్సిన బాధ్యత ఇప్పుడు సిఎం రేవంత్ రెడ్డిపై ఉంది. రైతుబంధులో అవినీతిని ఆపి, అడ్డగోలు చెల్లింపులకు చెక్ పెట్టాలి. కిలో రూపాయి బియ్యంపై సమీక్షించాలి. తెల్లరేషన్ కార్డులను అర్హులైన పేదలకే అందించాలి. ప్రభుత్వ ఆస్పత్రులను ఆధునీకరించాలి. హడావిడిగా ప్రచారం చేసిన వైద్యరంగంపై నిజానిజాలు వెలికితీయాలి. ప్రభుత్వ ఆస్పత్రులు బలోపేతం అయితే ఆరోగ్యశ్రీల అవసరం ఉండదు. విద్ఆయరంగాన్ని కూడా పటిష్టం చేయాలి. కెజి టూ పిజి ఉచిత విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలి. కులాలు, మతాల వారిగా విద్యను చెప్పే విధానాలకు తిలోదకాలు ఇవ్వాలి. ఇలా చేయడం వల్ల పిల్లల్లో కులాల ప్రభావం పెరిగి సమాజంలో విచ్ఛిన్నకర ధోరణుల ప్రబలుతాయి.

# రాజకీయాల్లో చెరగని ముద్ర తేళ్ల లక్ష్మీకాంతమ్మ

## డిసెంబర్ 13....తేళ్ల లక్ష్మీకాంతమ్మ వర్ధంతి



(రామ కిష్టయ్య సంగన భట్ల)
94405 95494

**తేళ్ల** లక్ష్మీకాంతమ్మ... ఈ పేరు ఈ తరం తెలుగు వారికి అంతగా తెలియక పోవచ్చు. అవిభక్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి ఆరున్నర దశాబ్దాల క్రితం లోకసభకు ఎన్నికై...నెహ్రూ, శాస్త్రి లాంటి నాటి కాంగ్రెస్ అగ్ర నాయకుల అభిమా నాన్ని చూరగొని, తర్వాత ఇందిరా గాంధీ, పి.వి. నరసింహా రావు లాంటి ప్రధానులకు చేరువై, మహిళా పక్షపాతిగా పేరెన్నిక గన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఏనాడూ డిపాజిట్ రాని, ఒకనాటి కమ్యునిస్టు కంచుకోట అయిన ఖమ్మం నుండి లోక సభకు పోటీ చేసి తొలి విజయం నమోదు చేసి, అదే ఊపులో మరో రెండు సార్లు విజయ దుందుభి మోగించి కాంగ్రెస్ జెండాను రెపరెప లాడించిన రికార్డు ఆమెదే.

ఆమె రాజకీయ ఆరంగేట్రం ఎలా జరిగింది అంటే...1957లో తనకు ఎమ్మెల్యే టిక్కెట్ కావాలని కాంగ్రెస్ పార్టీని అడిగిన సందర్భంలో ఆమె భర్త ఒక ప్రభుత్వ అధికారి అయిన కారణం తో, ఆమెకు టికెట్ నిరాకరించారు. తాను ముందుగా భారత పౌరురాలినని, తర్వా తే అధికారి భార్యనని వాదించి, లాల్ బహదూర్ శాస్త్రిని మెప్పించి ఒప్పించి ఖమ్మం లోకసభ స్థాన టికెట్ పొందారు.



అసలు కాంగ్రెస్ కు అంతకు ముందు డిపాజిట్లు కూడా దక్కని సీటులో ఆమె పోటీ చేయడం, గెలవడం ఏమిటని చర్చల నేపథ్యంలో అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తి, ఔరా అనిపించి ఆ సీటులో గెలిచి చూపించారు తేళ్ల లక్ష్మీ కాంతమ్మ. 1957, 1962, ఆ తర్వాత లోక్ సభ ఎన్నికల్లోనూ లక్ష్మీకాంతమ్మ వరుసగా మూడుసార్లు ఖమ్మం ఎంపీగా గెలిచారు. నెహ్రూ ప్రభు త్వంలో పార్లమెంటు కమిటీ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యురాలిగా పని చేశా రు. అలాగే ఆమె తనకు వచ్చిన అవకాశాన్ని వినియోగించి, అప్పటిదాకా సివిల్స్ లో మహిళ లకు ప్రవేశం లేని స్థితిలో, ఇందిరా గాంధీని ఒప్పించి సివిల్స్ లో మహిళ లకు అవకాశం లభించేలా చేశారు. మహిళలకు సమాన ఆస్తి హక్కు కోసం పార్లమెంటులో అనేక సార్లు మాట్లాడారు. 1972లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ ఎన్నికల కమిటీ సభ్యురాలిగా మహిళలు, యువకులకు ఎక్కువ టిక్కెట్లు వచ్చేలా కృషి చేశారు. తెలంగాణ రాష్ట్రానికి చెందినతేళ్ల లక్ష్మీకాంతమ్మ 1924, జూలై 16న జోగులాంబ గద్వాల జిల్లా, ఆలంపూర్ లోని కమ్మ భూస్వా ముల కుటుంబానికి చెందిన వెంకట్ రెడ్డి - మంగమ్మ దంప తులకు జన్మించారు. 5వ తరగతి వరకు కర్నూలులో చదివి, గుడివాడలో ఎస్ఎస్-ఎల్సీ, ఇంటర్మీడియట్ మద్రాసు క్రిస్టియన్ కాలేజీలో, మచిలీ పట్నంలో బిఏ, బెనారస్ హిందూ విశ్వ విద్యా లయం నుండి 1971లో ఆర్థిక శాస్త్రంలో ఎం.ఏ పట్టా పొందారు. ఆమె 1944, నవంబరు 1న అనంతపురం జిల్లా అటవీ అధికారి టి.వి.సుబ్బారావును వివాహం చేసుకున్నారు. లక్ష్మీకాంతమ్మ ఖమ్మం నియోజక వర్గం నుండి 1957లో ఆంధ్ర ప్రదేశ్ శాసనసభకు ఎన్నికై, ఆ తర్వాత 1962లో, ఆ తర్వాత ఖమ్మం లోకసభ నియోజకవర్గం నుండి వరుసగా మూడు సార్లు ఎన్నికై 1977వరకు లోక్‌సభలో ఖమ్మంకు ప్రాతినిధ్యం వహించారు. 1967లో పార్లమెంటు బృందంలో సభ్యురాలిగా ఆస్ట్రేలియా పర్యటించారు. 1978లో జనతా పార్టీ తరఫున హైదరాబాదు నగరంలోని హిమాయత్ నగర్ శాసనసభా నియోజకవర్గం నుండి గెలుపొందారు. ఆమె తెలుగులో ప్రగతి పథంలో మహిళలు అనే పుస్తకాన్ని, ఆంగ్లం లో కో-ఆపరేషన్ టుడే అండ్ టుమారో అనే పుస్తకాల్ని ప్రచురించారు. బాద్షా ఖాన్ జీవితచరిత్రను తెలుగులోకి అనువదించారు. తాను రాష్ట్రపతిగా ఎన్నిక కావడంలో తేళ్ల లక్ష్మీకాంతమ్మ పాత్ర కీలకమని తన జీవిత చరిత్రలో చెప్పుకున్నారు దివంగత రాష్ట్రపతి వి.వి.గిరి. ఇందిరా గాంధీకి ఆమెతో ఉండిన సాన్నిహిత్యం దృష్ట్యా, ఎన్నిసార్లు అడిగినా కేంద్ర మంత్రి పదవి స్వీకరించ లేదని, ఒక దశలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి పదవి ఇస్తామని ఇందిరా గాంధీ ప్రతిపాదించినా, ఆమె అంగీక రించక, మేధావి, అనుభవజ్ఞుడు అయిన పీవీ అయితేనే బాగుం టుందని చెప్పారని, పీవీ నరసింహా రావు ముఖ్య మంత్రి కావడానికి లక్ష్మీ కాంతమ్మ ఒక విధంగా కారణమని ఆ రోజుల్లో చెప్పుకునే వారు. ఇందిరాగాంధీకి అంత సన్నిహి తురాలు అయినా, ఇందిర విధించిన ఎమర్జెన్సీని తీవ్రం గా వ్యతిరేకించి, లక్ష్మీకాంతమ్మ కాంగ్రెస్ ను వీడి, జనతాపార్టీలో చేరి, కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. హైదరాబాద్ లో హిమా యత్ నగర్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. హైదరాబాద్ లో బీహెచ్ఈఎల్, కొత్తగూడెం థర్మల్ ప్రాజెక్ట్, వైజాగ్ స్టీల్ ప్లాంట్ రావడంలో ఆమెది కీలక పాత్ర అని చెబుతుంటారు. లక్ష్మీ కాంతమ్మ 1924 ఆగస్టు 1న జన్మించారు. 2007 డిసెంబర్ 13న 83 ఏళ్ల వయసులో మరణించారు.

# సాహితీ ప్రేమికులకు ప్రత్యేకం




**‘ ప్రజా మంటలు” తెలంగాణ జాతీయ దినపత్రికలో రేపటి నుండి ప్రతి రోజు, “ నేటి కథ” శీర్షికన ఒక కథను ప్రచురించనున్నామని తెలుపుట కు సంతోషిస్తున్నాం. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.com కు పంపవచ్చు...**

**-ఎడిటర్**

# తడుకుపేట సోమలింగడు



తడుకుపేట సోమలింగడులోని తెలివితేటలు వాక్చాతుర్యంను చంద్రగిరి రాజు గుర్తించాడు.సోమలింగడుని తమ భవనంలో ఆస్థాన కవిగానూ,తన సలహాదారుడుగానూ నియమించారు.రాజు పాలనలో దర్మం నాలుగు పాదాలతో నడుస్తోందన్న నమ్మకం ప్రజలలో కలిగింది. ఒకసారి ఆ రాజ్యంలో ఎక్కువమందికి జ్వరం విరేచనాలు లాంటి జబ్బులతో బాధపడసాగారు .ముఖ్యంగా చిన్న పిల్లలు చాలామందికి ఆ జబ్బు రావడంతో కొంతమంది మరణించడం చూసి రాజుగారు చాలా బాధపడ్డారు.ఈ వ్యాధి రావడానికి కారణమేమిటని ఆస్థాన వైద్య పండితులను అడిగాడు .వారుఅన్ని విధాలా పరిశోధించిన తరువాత “ కల్తీ నూనె వలన ఈ అనారోగ్యం సంభవిస్తోంది. “అంటూ వైద్యులు తెలిపారు.“మహామంత్రీ, మీరు ,సోమలింగడు కలిసి ఆ దుర్మార్గుడిని పట్టుకొనే బాధ్యతను అప్పగిస్తున్నాను. “ అంటూ ఆజ్ఞాపించారు రాజు గారు.మహామంత్రి , సోమలింగడు ఆలోచించసాగారు.“మహామంత్రీ ,మన రాజ్యంలో గానుగ పట్టణంలో వంటనూనెల టోకు వ్యాపారం జరుగుతుంది .కల్తీ నూనె వ్యాపారం అక్కడున్న నూనె వ్యాపారస్థులలో ఎవరో ఒకరు కల్తీ నూనె చేస్తున్నాడు .వాడిని పట్టుకొనాలి “ అన్నాడు సోమలింగడు “అంతమంది నూనె వ్యాపారస్థులలో ఆ ఒక్కడిని ఎలా పట్టుకొనాలి “అనడిగాడు మహామంత్రి “ వ్యాపారస్తుల కుమారులందరూ గురుకులాశ్రమంలో చదువుకుంటున్నారు వారిని విచారిస్తే సరిపోతుంది. పిల్లలు నిజం చెబుతారు. “అన్నాడు సోమలింగడు. మహామంత్రి, సోమలింగడు కలసి అక్కడున్న గురువుగారిని కలుసుకొని వివరించి చెప్పారు.గురుకులాశ్రమం గురువు గారు విచారించారు.“ మీరు చెప్పిన విధంగా పిల్లలను కొట్టకుండా విచారించాను,వాడెవడో కానీ నిజం చెప్పలేదు “ అన్నారు గురువుగారు. సోమలింగడు సలహా మీద పాత గురువును ఇంకొక ఆశ్రమానికి బదిలీ చేయించాడు. ఆశ్రమానికి వచ్చిన కొత్త గురువు పిల్లల బాధ్యత తీసుకొన్నాడు. కొన్ని రోజులలోనే ఒక విద్యార్థి తన తండ్రి కల్తీనూనెను ఇంటిలోనే తాయారు చేస్తున్నట్లు చెప్పాడు. ఆ విషయం మాహారాజు గారికి చెప్పగానే ఆ కల్తీ వ్యాపారస్థుడిని ఖైదు చేశారు. “ మహామంత్రీ, కల్తీ నూనె వ్యాపారిని ఎలా పట్టుకొనగలిగారు”అడిగాడు మహారాజు.“అంతా మన తడుకుపేట సోమలింగడు సహకారంతో పట్టుకొనగలి గానుమహారాజా”“ఎలాగా“అడిగాడు.కల్తీ నూనెను ఇంటి కుటుంబసభ్యులతో తయారుచేస్తున్నట్లు ఊహించిన సోమలింగడు ,వారి పిల్లలు చదివే గురుకులాశ్రమానికి వెళ్లి గురువుగారిద్వారా విచారించినా ఫలితం లేకపోవడంతో సోమలింగడు సలహా మీద ఆ గురువుగారిని బదిలీ చేసి కొత్త గురువుగారిని నియమించాను” “ ఆ కొత్త గురువు ఏం చేసాడు”“ఎక్కువ సమయం అతను పిల్లలకు నీతి కథలు చెప్పడం ప్రారంభించాడు .నీతికథల ప్రభావం వలన ఆ విద్యార్థి నిజం చెప్పాడు.” “ నీతికథలలోని విలువలను తెలుసుకున్నాను. నీతి కథలు చెప్పిన ఆ గురువుగారు ఎవరు” అడిగాడు “మన తడుకుపేట సోమలింగడు గురువుగారి వేషంలో వెళ్ళాడు మహారాజా.” మహారాజు గారు సోమలింగడిని ఎంతగానో పొగిడాడు.

**ఓట్ర ప్రకాష్ రావు**
**,తిరుత్తణి 0978744602**

# దొంగ రేషన్ కార్డుల తొలగిస్తేనే
# పేదలకు న్యాయం జరుగుతుంది



## తెల్ల రేషన్ కార్డుతో ఆరోగ్య శ్రీ లింకు తొలగించాలి



సిహెచ్ వ ప్రభాకర్ రావు సీయర్ జర్నలిస్ట్, 9391533339

**రా**ష్ట్రంలో గత జనాభా లెక్కల ప్రకారం 3,50,03,674 మంది ప్రజలు ఉన్నారు. ఇందులో 1,76,11,633 మంది పురుషులు ఉండగా, 1,73,92,041మంది మహిళలు ఉన్నారు. గత 12 ఏళ్లలో దాయఫయపు 11.5 శాతం పేరుగుడాలతో 3,96,40,000 కు పెరిగినట్లు అంచనావేస్తున్నారు. ఆశతరంలోని పేదలకు కనీస ఆహారామ్ అందించాలనే లక్ష్యంతో ప్రారంభించిన ఆహార బధ్రత స్కీమ్ లో ప్రతి మనిషికి 5 కిలోల బియ్యాన్ని రూ.1 కిలో చొప్పున అంది స్తున్నారు. పెదలను అతి పెదలుగా వర్గీకరించి మూడు రకాల రేషన్ కార్డులను అందించారు. అందులో ఎలాంటి ఆసరా లేకుండా, ఒంటరిగా ఉండే వయోవృద్ధులకు ఇచ్చే అన్నపూర్ణ కార్డ్స్ 5,772 మందికి, అతి పేదలుగా గుర్తించిన కుటుంభలకు అంత్యోదయ కార్డ్స్ పేర 5,66,424 కుటుంబాలకు రేషన్ కార్డులు ఇచ్చారు. వీరికి ప్రతినెల ఒక రూపాయి ధరతో 35 కిలోల బియ్యాన్ని ఇస్తున్నారు. , సాధారణ పేదలుగా గుర్తించ బడిన కుటుంబాలకు ఆహార బద్రతా కార్డ్స్ పేర 84,70,614 కుటుంభాకు రేషన్ కార్డ్స్ ఇచ్చారు. అంటే రాష్ట్రంలో మొత్తం బిపిఎల్ రేషన్ కార్డ్స్ 90,42,810 ఉన్నాయి. రాష్ట్రం లోని 17,117 రేషన్ షాప్ ల ద్వారా అన్నార్తులకు రూపాయికే కిలో బియ్యం చొప్పున రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుంది. మన రాష్ట్రంలో ఒక కూతమభయంలో సరాసరిగా 4 సంభయులు ఉన్నట్లుగా గతంలో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో తేలింది. అయితే, కొత్తగా మంత్రి పదవి చేపట్టిన మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి సరాసరి కుటుంబ సభ్యులా సంఖ్య, ఒక్కో కార్డుకు 3.5 గా ఉంటుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గణాంకాల ప్రకారం 90 లక్షలకు పైగా కార్డులు ఉండగా, మంత్రి 69 లక్షల కార్డులు ఉన్నాయని ప్రకటించారు. కొత్తగా పదవి చేపపట్టడంతో వారికి అధికారులు సమాచార ఇచ్చి ఉండకపోవచ్చు. అయినా ఆయనకు ఉన్న సమాచారం ప్రకారం జనాభాలోని దాదాపు 2.5 కోట్ల మందికి రేషన్ బియ్యం అందిస్తున్నారు. అంటే రాష్ట్రంలోని రేషన్ కార్డ్స్ ద్వారా ప్రతి నెల దాదాపు 12,07.500 క్వింటాళ్ల బియ్యాన్ని ప్రజలకు అందిస్తున్నారు. ఇందులో సగానికి పైగా బియ్యం నల్లబజార్ కు తరలిస్తున్నారనే విషయం అందరికీ తెలిసిందే. మంత్రి స్వయంగా 12 శాతానికి పైగా రేషన్ కార్డ్ ల కుటుంభయాల వారు వీటిని ఉపయోగించడం లేదని తెలుస్తుంది. రేషన్ కార్డ్స్ ద్వారా గతంలో అనేక నిత్యావసర వస్తువులను కూడా సరఫరా చేశారు. కొన్ని రోజులు పంచదార, కందిపప్పు, మంచి నూనె సరఫరా చేశారు. కానీ గాన రెండు , కోవిడ తరువాత నుండి, మూడు సంవత్సరాలుగా ఒక్క బియ్యం మాత్రమే ఇస్తున్నారు. ప్రతి రోజు వందల క్వింటాళ్ల రేషన్ బియ్యం నల్ల బజార్ కు తరాలదాన్ని అధికారులు, పోలీసులు పట్టుకొంటున్నారు. ఈ బియ్యాన్ని మళ్ళీ మరపట్టి, పాలిష్ పెంచి అధిక ధరకు అమ్ముతున్న అనేక రైస్ మిల్లులపై అనేక కేసులు నమోదు అయ్యాయి. కానీ ఈ దళారీల దోపిడి మాత్రం తగ్గడం లేదు. ప్రభుత్వం ఈ నల్ల బజారును అరికట్టడానికి వెలిముద్రాలు వేయాలని, రేణు మూడు నెలలకు పైగా రేషన్ తీసుకోకుంటే కార్డులు రద్దు చేస్తామని ఎన్ని పద్దతులు పెట్టినా, రేషన్ బియ్యం అక్రమ తరలింపు ఆగడం లేదు. దీనికి కారణం బియ్యం నాణ్యమైనవిగా లేకపోవడమే కారణంగా చెప్పుకొంటున్నారు.

అందుకే ఇక ముందు అందరికీ సన్న బియ్యం ఇస్తామని ఎన్నికలకు ముందు కెసిఆర్ ప్రకటించారు. అదే విషయాన్ని దృష్టిలో పెట్టుకొని, మంత్రి ఉత్తమ కుమార్ తన మొదటి సమీక్షలో మాట్లాడుతూ, ప్రజలకు మంచి బియ్యం అందారు తినడానికి అనువైనవి ఇచ్చే ప్రయత్నం చేయాలని అధికారులను ఆదేశించమని తెలిపారు. దీనితో రేషన్ బియ్యాన్ని ప్రజలు నల్ల బజార్ కు తరలించకుండా, తామే వాడుకొంటారని భావిస్తున్నారు. ఈ లెక్కల ప్రకారం రాష్ట్రంలోని దాదాపు 70 శాతం మంది ప్రజలకు రేషన్ బియ్యం అందుతున్నాయి. గ్రామలలోనే అధికశాతం రేషన్ కార్డులు ఉన్నాయి. అలాగే అర్బన్, సెమీ అర్బన్ పట్టణాలలో ఉన్న రేషన్ కార్డులలో ఎక్కువ శాతం అనర్హులకే ఉన్నాయనే ప్రచారం కూడా ఉంది. అసలు ఈ తెల్ల రేషన్ కార్డులు కావాలను కొనే చాలా మందికి బియ్యం పొందే అర్హత లేదు. కానీ తెల్ల రేషన్ కార్డు ఉన్న వారికే ఆరోగ్య శ్రీ సదుపాయం అందుబాటులో ఉండడంతో, ఎంతోమంది అనర్హులు రాజకీయ అండదండలతో ఈ రేషన్ కార్డ్ లు పొందుతున్నారు. వీటిని తెలగించాలని ప్రభుత్వం ప్రకటించినా, స్థానికంగా ఓట్ల కొరకు రాజకీయ నాయకుల ప్రమేయంతో , దొంగ కార్డుల తొలగింపు సాధ్యం కాలేదు. దీనితో ప్రభుత్వం కొత్త కార్డులను అండీచడంలో విఫలం అయింది. కొత్తప్రభుత్వం అయినా, అనర్హులకు ఉన్న తెల్ల రేషన్ కార్డులు తొలగించి, నిజమైన పేదలకు కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలయి. అలాగే తెల్ల రేషన్ కార్డు కు ఆరోగ్య శ్రీ కి ఉన్న అనుబంధాన్ని తొలగించిని రోజు ప్రజలే స్వయంగా తమ కార్డులను రద్దు చేసుకొంటారని అనుకొంటున్నారు. ఆరోగ్య శ్రీ కొరకు మరో కొత్త రకమైన, న్యాయమైన నిబంధనలను రూపొందించాలని, పేదలకు మాత్రమే న్యాయం జరిగేలా ఆచూడాలని సామాన్య పేదలు ప్రభుత్వాన్ని కోరుకొంటున్నారు.

# చిన్నపిల్లలచే బిక్షాటన చేయిస్తే కఠిన చర్యలు

### జిల్లా ఎస్పీ శ్రీ సన్ ప్రీత్ సింగ్, ఐపీఎస్



**జగిత్యాల డిసెంబర్ 12 (ప్రజామంటలు):** పిల్లలను అపహరించి వ్యబిచారం లోనికి దింప డం, అమ్మడం, బలవంతపు వెట్టి చాకిరీ, బలవంతపు బిక్షాటన, పిల్లలను బంధించి పని చేయించడం, పిల్లల అవయవాలను అమ్ముకోవడం మరియు అక్రమంగా దత్తత తీసుకోవడం వంటి కార్యకలాపాలు మానవ అక్రమ రవాణా కింద వస్తాయి. పై కార్యకలాపాలు చేసే వారికి చట్టప్రకారం చర్యలు తీసుకుని త్వరితగతన శిక్షలు పడే విధంగా చేస్తామని జిల్లా ఎస్పీ అన్నారు. ఈ కార్యక్రమాలకు ఎవరైనా పాల్పడితే 8712656810 నెంబర్ ఫోన్ చేసి సమాచారం అందించగలరు సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. తప్పిపోయిన, వదిలివేయబడిన కార్మికులుగా ఉన్న బాలబాలికలు ఉన్నట్లయితే అలాంటి వారి సమాచారం సేకరించి, రక్షించి వారి తల్లి దండ్రులకు అప్పగించి, బలవంతంగా బిక్షాటన చేయించిన వారిపై వెట్టి చాకిరి చేయించిన వారిపై తగిన క్రిమినల్ కేసులు నమోదు చేసి తగిన చర్యలు తీసుకునే విదంగా ప్రత్యేకంగా సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు.

# పికెట్ స్కూల్‌లో ఉచిత మెగా మెడికల్ క్యాంపు

### వైద్య పరీక్షలు, మందుల పంపిణీ
### 159 మందికి ఎనీమియా పరీక్షలు

**సికింద్రాబాద్ డిసెంబర్ 12 (ప్రజామంటలు):** కోహెన్స్ లైఫ్ సైన్సెస్ సీఎస్ఆర్ సహకారంతో మంగళవారం సికింద్రాబాద్ పికెట్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జనహిత సేవా ట్రస్ట్ ప్రతినిధులు ఉచిత మెగా మెడికల్ క్యాంపును నిర్వహించారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ రోటరీక్లబ్ సాయంతో నిర్వహించిన ఈ క్యాంపులో 356 మందికి ఆర్.బీ.ఎస్, బీపీ, ఈసీజీ, ఫిజియోథెరపీ తదితర వైద్య పరీక్షలను నిర్వహించి, వారికి అవసరమైన మందులను ఉచితంగా అందచేశారు. డెంటల్, జనరల్ ఫిజీషియన్, పీడియాట్రిక్స్ విభాగాలకు చెందిన వైద్య నిపుణులు పాల్గొన్న ఈ క్యాంపులో భారత వికాస పరిషత్ నిర్వాహకులు ఎనీమియా ముక్త్ భారత్ కింద 159 మంది ఎనీమియా పేషంట్లకు హిమాగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి, మందులను అందచేశారు. కార్యక్రమంలో కోహెన్స్ లైఫ్ సైన్సెస్, రోటరీక్లబ్, జనహిత సేవా ట్రస్ట్, భారత వికాస పరిషత్ నిర్వాహకులు, వాలంటీర్లు పాల్గొన్నారు. ఉచితంగా వైద్య పరీక్షలను నిర్వహించి, మందులను అందచేసిన కోహెన్స్, జనహిత సేవా ట్రస్ట్ ప్రతినిధులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.



# అన్నపూర్ణ సేవ సమితి సభ్యులను సన్మానించిన తుమ్మేటి సమ్మిరెడ్డి





**జమ్మికుంట (ప్రజామంటలు):** జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని పురాతన మహా లింగేశ్వరస్వామి ఆలయం బొమ్మల గుడిలో గత సంవత్సర కాలంగా అన్న పూర్ణ సేవా సమితి వారు నిత్య అన్నదానం నిర్వహించడం ఎంతో గర్వించదగ్గ విషయమని జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మి రెడ్డి అన్నారు. ఆ కమిటీ సభ్యులు చేస్తున్నటువంటి సేవకు వారిని శాలువాతో ఎంతో ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా తుమ్మేటి సమ్మిరెడ్డి మాట్లాడుతూ.... నిస్వార్ధంగా ఆ భగవంతుని సన్నిధిలో రోజుకు 100 నుండి 150 మంది బీదవారికి అనాధలకు రోడ్డుపై జీవిస్తున్నటువంటి వారికి ఆ భగవంతుని ప్రసాదంగా నిత్యం ఒక పూట కడుపు నింపుతున్నారు అన్నారు. ఈ నిత్య అన్నదానాన్ని కొనసాగించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ వారికి ఆ భగవంతుడు ఎల్లవేళలా తోడు ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సమ్మిరెడ్డి వెంట జమ్మికుంట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సుంకరి రమేష్, మాజీ మార్కెట్ డైరెక్టర్ ఎండీ సలీం, మాజీ ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎగ్గని శ్రీనివాస్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కాగితం శ్రీనివాస్, పనికెల శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# "శాతవాహన" కో-ఆర్డినేటర్‌ను సన్మానించిన మెట్ పల్లి ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి



**కోరుట్ల డిసెంబర్ 12 (ప్రజామంటలు):** శాతవాహన యూనివర్సిటీ జాతీయ సేవ పథకం (ఎన్ఎస్ఎస్) ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ ఈ. మనోహర్ ను మంగళవారం జగిత్యాల జిల్లా మెట్ పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి మరియు అర్థశాస్త్ర సహాయ ఆచార్యులు కే.వేంకయ్య శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు గోపికృష్ణ జయప్రకాష్,లావణ్య, కరుణాకర్ లతోపాటు వివిధ ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలకు చెందిన ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు తదతరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం అధికారి కే.వేంకయ్య మాట్లాడుతూ,ఎన్ ఎస్ ఎస్ కార్యక్రమాలను ప్రజల వద్దకు తీసుకు వెళ్ళాలని, అప్పుడే తెలంగాణ రాష్ట్రంలో శాతవాహన యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలకు మంచి స్థానం ఉంటుందని అన్నారు. యూనివర్సిటీ పరిధిలో మొత్తం 120 ఎన్ఎస్ఎస్ యూనిట్లు ఉన్నాయని, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారుల సహాయ, సహకారాలపైననే శాతవాహన యూనివర్సిటీ పేరు, ప్రతిష్టలు ఆధారపడి ఉంటాయని శాతవాహన యూనివర్సిటీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ ఈ. మనోహర్ స్పష్టం చేశారు. సమాజ సేవ చేయటానికి ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు ఉత్సాహంగా పాల్గొనేటట్లు చూడాలని డాక్టర్ మనోహర్ ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం అధికారులకు పిలుపునిచ్చారు.

# జనవరి 22న అయోధ్యలో రామ విగ్రహ ప్రతిష్ఠ

### మన వంతుగా 'రామగాయత్రి' జపం చేద్దాం

"ఓం దాశరథయా విద్మహే
సీతా వల్లభాయ ధీమహి
తన్నో రామః ప్రచోదయాత్"



2024 జనవరి 22 న అయోధ్యలో రామ విగ్రహ ప్రతిష్ఠ జరుగనుంది. ఆ మహాయజ్ఞానికి మంత్ర భూమికగా 2023 డిసెంబరు 14 నుంచి 40 రోజులు, అంటే, మండలం రోజుల పాటు మనవంతుగా రామగాయత్రి మంత్రాన్ని జపించమని మానవాళికి విజ్ఞప్తి. ప్రతి ఒక్కరు ప్రాతఃకాలంలో కనీసం 108 లేదా 1008 చొప్పున ఈ కింద ఇచ్చిన రామగాయత్రిని జపించి రామతరంగశక్తిని ఉత్తేజితం చేయాలని ప్రార్థన. దేశవిదేశాల్లో ఎక్కడ ఉన్నవారైనా సరే అయోధ్య రాముని మనసులో ఉంచుకుని యథాశక్తి 'రామగాయత్రి' ని జపించడం ద్వారా రామశక్తిని ప్రేరేపింతురుగాక. మీకు తెలిసిన అందరితో దీనిని పంచుకోమని 'రామగాయత్రి' ని మనవి.

# క్లీన్ టాయిలెట్ క్యాంపేయన్




**కోరుట్ల డిసెంబర్ 12 (ప్రజామంటలు):** స్వచ్ఛ భారత్ లో భాగంగా డిసెంబర్ 5 నుండి 25 వరకు క్లీన్ టాయిలెట్ క్యాంపేయన్ నిర్వహించడం జరుగుతుంది. కోరుట్ల పట్టణంలో కల్లూరు రోడ్ లో ఉన్న తెలంగాణ సోషల్ వెల్ఫేర్ స్కూల్ కి చెందిన విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని తనవంతుగా విద్యార్థులందరికీ క్లీన్ టాయిలెట్ క్యాంపెయిన్ అనే అక్షరాల మాదిరిగా నిలబడి టాయిలెట్ క్యాంపెయిన్ నిర్వహించడం జరిగింది. ఈ క్యాంపియన్ భాగంగా కోరుట్ల పట్టణంలోని ప్రజలు మరియు పరిసర ప్రాంతాల నుంచి కోరుట్ల పట్టణానికి వచ్చే ప్రజలు పట్టణంలోని పబ్లిక్ టాయిలెట్లను ఉపయోగించుకుని కోరుట్ల పట్టణాన్ని బహిరంగ మలమూత్ర విసర్జన లేని పట్టణంగా మార్చడం కొరకు సహకరించాలని కోరారు.

### జగిత్యాల పట్టణంలోని పురాణిపేట శ్రీ లక్ష్మినృసింహ, ఆంజనేయ, శివ పంచమి దేవాలయంలో ఘనంగా కార్తీక మాస అమావాస్య చివరి రోజున ఘనంగా జరిగిన తులసి, దామోదర కళ్యాణం.



# ఇప్పటి నుంచే "పంచాయతీ" కుస్తీ - ఇక "లోకల్ లొల్లి" షురూ

### పార్టీల గుర్తు లేని "పార్టీ" ఎన్నికలు
### పంచాయితీల రిజర్వేషన్ వివరాలు తెప్పించుకుంటున్న అధికారులు
### పాత రిజర్వేషన్ల పద్ధతేనా?
### లేక కొత్త రిజర్వేషన్లు అమలు చేస్తారా?
### ఇప్పటి నుండే ఆశావాహుల ఆరాటం

**(ప్రజామంటలు రిపోర్టర్, కాశిరెడ్డి ఆదిరెడ్డి, ప్రత్యేక కథనం)**




**భీమదేవరపల్లి డిసెంబర్ 12 (ప్రజామంటలు):** స్థానిక సంస్థల ఎన్నికలలో గ్రామ సచివాలయానికి నిర్వహించే ఎన్నికలకు న్నంత ప్రాధాన్యత మరే ఎన్నికలకు లేదంటే అతిశయోక్తి కాదేమో! ఎందుకంటే వార్డు మెంబర్ నుండి సర్పంచి దాకా తమ ఊరు వాళ్లు ఎక్కడెక్కడ ఉన్నారో వారి కుటుంబ సభ్యుల ద్వారా ఇప్పటి నుండే వివరాలు సేకరించే పనిలో పడ్డారు. ఎందుకంటే ప్రతి ఓటు ముఖ్యమైనదే కాబట్టి పట్నంలో ఉన్న వారికి కట్నాలు పంపి రప్పించుకోవడం స్థానిక ఆనవాయితీ. ఎందుకంటే అసెంబ్లీ ఎన్నికలలో పోలిస్తే స్థానిక సంస్థల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలలో 90 కి పైగా శాతం ఓటింగ్ ఉంటుంది కాబట్టి పంచాయితీకి ప్రతి ఓటరు ప్రాధాన్యుడే. ప్రస్తుతం తెలంగాణలో మొత్తం 12,769 గ్రామపంచాయతీలు ఉన్నాయి. 2018లో అప్పటి టిఆర్ఎస్ ప్రభుత్వం రిజర్వేషన్ 10 సంవత్సరాలు కొనసాగేలా చట్టం చేసింది. 224 నూతన గ్రామపంచాయతీల ఏర్పాటు బిల్లు ప్రస్తుతం పెండింగ్ లో ఉంది. అవి ఆమోదం పొందుతే 12,769 గ్రామ పంచాయతీలకు ఎన్నికలకు మార్గం సుగమమం వుతుంది.

### సర్ "పంచ్" పటాకా:

ఇటీవల కేంద్ర ప్రభుత్వం పదవ తరగతి పాస్ అయిన వారే సర్పంచ్ పదవి పోటీకి అర్హులని రాష్ట్రాల ఆమోదానికి ముసాయిదాను పంపగా, తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విద్యాధికులు, ప్రజాప్రతినిధులు ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నారు.

### స్వాగతిస్తున్న విద్యాధికులు:

గ్రామపంచాయతీలకు పదవ తరగతి తప్పనిసరి అయినప్పుడు ఎంపీటీసీ, జెడ్పిటిసి, ఎమ్మెల్యే, ఎంపీ పదవులతో పాటు నామినేటెడ్ పోస్టులకు కూడా విద్యార్హతలు నిర్ణయించి కేంద్ర ప్రభుత్వం ముసాయిదాను అన్ని రాష్ట్రాలకు పంపించాలని మేధావి వర్గం కోరుకుంటున్నది.

# కాంగ్రెస్ ఎంపీ ధీరజ్ సాహూ అవినీతిపై బీజేపీ నిరసన



**సికింద్రాబాద్ డిసెంబర్ 12 (ప్రజామంటలు):** జారండ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యులు ధీరజ్ సాహూ అవినీతి అక్రమ సంపాదనకు నిరసనగా రాష్ట్ర బీజేపీ పిలుపు మేరకు మంగళవారం సికింద్రాబాద్ బాటా చౌరస్తాలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆందోళన నిర్వహించారు. అవినీతికి మారుపేరు అయిన కాంగ్రెస్ పార్టీ మరోసారి తన నిజ స్వరూపాన్ని బయట పెట్టుకుందని వక్తలు విమర్శించారు. రూ.353 కోట్లకు పైగా నగదు, బంగారం పట్టుబడటం దారుణమని, ఇలాంటి అవినీతి తిమింగాల నుంచి అవినీతి సొమ్మును పూర్తిగా స్వాదీనం చేసుకొని, వారిని దేశ బహిష్కరణ చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎన్.డీ.ఎమ్.ఏ. మాజీ వైస్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి, కార్పొరేటర్లు కొంతం దీపిక, చీర సుచిత్ర, సికింద్రాబాద్ పార్లమెంటరీ కన్వీనర్ తడిసిన రాజశేఖర్ రెడ్డి, నాయకులు పెద్ది రవీందర్, దయానంద్, గుంటి సత్యనారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీర్పూర్ మండలంలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పర్యటన

**బీర్పూర్ డిసెంబర్ 12 (ప్రజామంటలు):** మండల కేంద్రంలోని ఫిల్టర్ బెడ్ పరిశీలించి ఫిల్టర్ బెడ్ మరమ్మతులకు కావల్సిన నిధుల అంచనా వ్యేయం తెలిపితే నిధులు సమకూర్చుకొని బీర్పూర్ మండలంలో త్రాగునీటి సమస్యను పరిష్కరిస్తాం అని తెలిపారు. అధికారులు ఫిల్టర్ బెడ్ కావల్సిన నిధుల వ్యయం అంచనా వేసి త్వరలో అందిస్తాం అని తెలిపారు. అనంతరం రోళ్ల వాగు ప్రాజెక్టు పనులను పరిశీలించి త్వరలో పూర్తి చేయడం తో పాటు తూము షెటర్స్ బిగించాలి అని అధికారులకు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి సూచించారు. అనంతరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మీటింగ్ లో పాల్గొని పత్రిక సమావేశంలో పాల్గొన్నారు.



# ఖోఖో రాష్ట్ర స్థాయి పోటీలో ప్రతిభ చాటిన అంబరిపేట జడ్.పి.హెచ్.ఎస్. విద్యార్థిని తోకల శాలిని



**కథలాపూర్ డిసెంబర్ 12 (ప్రజామంటలు):** జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలంలోని అంబరిపేట జడ్.పి.హెచ్.ఎస్. పాఠశాలలోని తోకల శాలిని జూనియర్ ఖో ఖో పోటీల్లో నిజాంబాద్ జిల్లా నందిపేట గ్రామంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొని విజయం సాధించారు. జూనియర్ ఖో ఖో సర్టిఫికెట్ జడ్.పి.హెచ్.ఎస్. ప్రధానోపాధ్యాయులు కిషన్ రావు, వ్యాయామ ఉపాధ్యాయులు వాసాల రాజు చేతుల మీదుగా అందించారు. పిల్లలు చదువుతోపాటు పాటలలో అన్ని రంగాలలో ముందుకు దూసుకుపోతూ ఇలాంటి విజయాలను సాధిస్తూ ముందుకు వెళ్లాలని ఉపాధ్యాయులు తల్లిదండ్రులు కోరారు. ఉపాధ్యాయుల సిబ్బంది మరియు గ్రామ సర్పంచ్ గోపు శ్రీనివాస్, ఎంపీటీసీ గంగరాజం, ఎస్ఎంసి చైర్మన్ ఉమ తదితరులు అభినందించారు.

prajamantalau daily pages (13-12)_times of varha main (13-2).qxd 12/13/2023 6:20 AM Page 5



# ప్రజలకు సేవ చేస్తా..అందరికీ అందుబాటులో ఉంటా

**ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే**

**అమలులోకి మహాలక్ష్మి, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాలు**





**గొల్లపల్లి డిసెంబర్ 12 (ప్రజామంటలు):** గొల్లపల్లి మండలం లో ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మంగళవారం భారీవిజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.... తెలంగాణ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తున్నామని ముఖ్యంగా మహిళలకు ఎంతో ఉపయోగపడే మహాలక్ష్మి పథకాన్ని సమర్ధంగా అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన మేనిఫెస్టో ను తప్పకుండా అమలు చేసి తీరుతామన్నారు. ఇప్పటికే రెండు గ్యారెంటీలను ప్రారంభించడం జరిగిందని మరో నాలుగు గ్యారంటీలను వంద రోజుల్లో ప్రభుత్వం ప్రారంభిస్తుందని స్పష్టం చేశారు. ఇరవై నాలుగు గంటల విద్యుత్ రాదంటూ ప్రతిపక్షాలు చిల్లర రాజకీయం చేస్తున్నాయని ప్రజలు, రైతులు వారి మాటలను నమ్మవద్దన్నరు. కాంగ్రెస్ ప్రభుత్వం తప్పకుండా ఇరవై నాలుగు గంటల విద్యుత్ ను అందజేస్తుందని రైతులు ఆందోళన చెందొద్దని పేర్కొన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద దాయాలసీస్ రోగులకు ఉచితంగా చికిత్స అందిస్తామన్నారు. నూట ఇరవై ఆరు రకాల చికిత్స లకు ఒక సంవత్సరం కాలం ఉచితంగా మందులు అందిస్తామని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని మహిళల కళ్ళలో ఆనందం చూడాలన్న ఉద్దేశంతో మహిళల కోసం రాష్ట్రంలో మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టి ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం సంతోషకర మన్నారు. అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే మహాలక్ష్మి పథకం, రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని కొనియాడారు. అనారోగ్యంతో బాధపడుతున్న పేద ప్రజలు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని అప్పుల పాలు కావద్దన్న ఉద్దేశంతో రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టి పది లక్షల రూపాయలతో ఉచిత వైద్యం చేయించుకోనేలా కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించిందని అందరూ సద్వినియోగపర్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ కటారి చంద్రశేఖర రావు, సీనియర్ నాయకులు తాండ్ర సురేం దర్. సర్పంచ్ లు చిర్ర గంగాధర్. సరసాని తిరుపతిరెడ్డి, పురు శెట్టి పద్మ వెంకటేశం, ఉపసర్పంచ్ కొండ వెంకటేష్ గౌడ్, కొక్కుల జలంధర్, గండ్ర రామారావు, రంగు శ్రీనివాస్ గౌడ్, చెవులమద్ది హనుమాన్లు, వినోద్, విక్రం, ప్రవీణ్, ఎనగందుల తిరుపతి, శ్రీధర్, రాజేశ్వర్ వార్డు సభ్యుల గురుజల బుచ్చిరెడ్డి, పట్టణ అధ్యక్షులు మహేష యూత్ కాంగ్రెస్ పాల్గొన్నారు.

## జగిత్యాల-కరీంనగర్ రహదారిపై ప్రమాదం వ్యక్తి దుర్మణం



**జగిత్యాల జిల్లా ప్రతినిధి కోరుట్ల డిసెంబర్ 12 (ప్రజామంటలు):** జగిత్యాల జిల్లా మల్యాల మండలం నూకపెల్లి శివారు జగిత్యాల - కరీంనగర్ రహదారిపై మంగళ వారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం చెందారు. విఆర్కే కళాశాల దగ్గర హనుమాన్ దేవాలయం ముందు గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. మల్యాల పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృత దేహాన్ని జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి వద్ద లభించిన సెల్ ఫోన్ ఆధారంగా మృతుడి వివరాలు తెలుసుకొనే ప్రయత్నం చేస్తున్నారు. మృతుడు మెట్ పల్లి వాసిగా పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించనున్నారు.

## 30న గచ్చిబౌలిలో మాస్టర్స్ అథ్లెటిక్స్ స్టేట్ మీట్

**ఎమ్మెల్యే తలసాని కి ఆహ్వానం**



**సనత్ నగర్ డిసెంబర్ 12 (ప్రజామంటలు):** ఈ నెల 30 వ తేదీన గచ్చిబౌలి స్టేడియంలో తెలంగాణ నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఆధ్వర్యంలో నిర్వహించే 10 వ స్టేట్ మీట్ కు హాజరు కావాలని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ను నిర్వాహకులు ఆహ్వానించారు. ఈ మేరకు మంగళవారం వెస్ట్ మారేడ్ పల్లిలోని నివాసంలో తెలంగాణ నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ లైఫ్ ప్రెసిడెంట్ మర్రి లక్ష్మారెడ్డి, జనరల్ సెక్రెటరీ ప్రభుకుమార్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆర్.పీ. భగవాన్, రత్నకుమార్, ట్రెజరర్ డీ. లక్ష్మి లు తలసాని శ్రీనివాస్ యాదవ్ ను కలిసి ఆహ్వానాన్ని అందజేశారు. 30 నుండి 100 సంవత్సరాల మధ్య వయసు కలిగిన సుమారు 800 మంది రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల కు చెందిన అథ్లెటిక్స్ క్రీడాకారులు పాల్గొంటారని వారు వివరించారు. ఎమ్మెల్యే గా మూడోసారి గెలిచి హ్యాట్రిక్ సాధించిన తలసాని శ్రీనివాస యాదవ్ ను మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ తరపున ఘనంగా సత్కరించారు.

## తపాలా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**ఉద్యోగుల నిరవధిక సమ్మె**



**గొల్లపల్లి డిసెంబర్ 12 (ప్రజామంటలు):** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలో గ్రామీణ ప్రాంతాలలో పని చేస్తున్న తపాలా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తపాలా ఉద్యోగులు డిమాండ్ చేశారు. నిరవధిక సమ్మెలో భాగంగా మంగళవారం విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. తపాలా ఉద్యోగులకు సివిల్ సర్వెంట్ హెూదా కల్పించాలని, ఎనిమిది గంటల పని సీనియర్ సర్వీస్ కు అదనపు ఇంక్రిమెంట్స్ కల్పించాలని, కమలేష్ చంద్ర సిఫార్సులను అమలు చేసి టార్గెట్లు రూపంలో వేదించకుండా ఐపీపీబీ సేవలను పని నింపుడులోకి తీసుకోవాలని, రిటైర్డ్ అయిన ఉద్యోగికి ఐదు లక్షల రూపాయల గ్రాడ్యుటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి సబ్ పోస్ట్ ఆఫీస్ పరిధిలో తపాలా ఉద్యోగులు విజయేందర్ రావు, నల్ల పోచయ్య, లక్ష్మీకాంతం మురళి, ఫక్రుద్దీన్, చరణ్, సులేమాన్, తదితరులు పాల్గొన్నారు.

## గణతంత్ర వేడుకలకు బైడెన్ రాక అనుమానమే

**న్యూఢిల్లీ,డిసెంబర్12:** వచ్చే నెలలో జరగనున్న భారత గణతంత్ర దినోత్సవ వేడుకలకు అమెరికా అధ్యక్షుడు జో బిడెన్ హాజరు కాకపోవచ్చని తెలుస్తోంది. జనవరి 26న గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొనాలంటూ బిడెన్ను భారత ప్రధాని మోదీ ఆహ్వానించారని ఇండియాలోని భారత అంబాసిడర్ ఎరిక్ గర్సెట్టి గుర్తుచేశారు. అయితే భారత ఆహ్వానంపై ఎలాంటి స్పందన లేదని విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నాయి. మరోవైపు వచ్చే ఏడాది 2024 ద్వితీయార్ధంలో భారత్ వేదికగా క్వాడ్ సదస్సును నిర్వహించాలనే ప్రతిపాదన ఉందని ప్రభుత్వవర్గాలు పేర్కొన్నాయి. క్వాడ్ సదస్సుకు సంబంధించిన తేదీలను సవరించాలని భావిస్తున్నామని, ప్రతిపాదిత తేదీల్లో అన్ని భాగస్వామ్య దేశాలు సదస్సుల్లో పాల్గొనే అవకాశం లేదని రిపోర్టులు పేర్కొంటున్నాయి.

## శిలాజ ఇంధనాలను అంతం చేయండి

**భూ గ్రహాన్ని రక్షించే చర్యలు కావాలి**

**అంతర్జాతీయ వేదికపై 12 ఏళ్ల మణిపూర్ బాలిక నిరసన**

**న్యూఢిల్లీ,డిసెంబర్12 :** దుబాయ్‌లో జరిగిన ఐక్యరాజ్యసమితి వాతావరణ సమావేశం 2023 లో మణిపూర్‌కు చెందిన 12 ఏళ్ల వాతావరణ కార్యకర్త లిసిప్రియ కంగుజం నిరసన తెలిపారు. కాన్ఫరెన్స్ జరుగుతుండగా ఒక్కసారిగా వేదికపైకి వచ్చిన బాలిక 'శిలాజ ఇంధనాలను అంతం చేయండి. మన గ్రహాన్ని, భవిష్యత్తును రక్షించండి.' అనే ప్లకార్డును ప్రదర్శించింది. శిలాజ ఇంధనాల వాడకానికి వ్యతిరేకంగా ఆమె ఈ నిరసన తెలిపారు. ప్లకార్డుతో వేదికపైకి దూసుకొచ్చిన ఆమె ఓ చిన్న ప్రసంగం కూడా చేశారు. ఆమె ప్రసంగానికి మెచ్చి అక్కడ ఉన్నవారంతా చప్పట్లతో లిసిప్రియను అభినందించారు. సీఓపీ 28 డైరెక్టర్ జనర్ అంబాసిడర్ మజిద్ అల్ సువైదీ మాట్లాడుతూ లిసిప్రియ ఉత్సాహాన్ని ప్రశంసించారు. ఈవెంట్‌కు హాజరైన ప్రేక్షకులతో ఆమెకు మరోసారి చప్పట్లు కూడా కొట్టించారు. కాగా లిసిప్రియ వేదికపై నిరసన తెలుపుతుండగా కార్యక్రమం నిర్వహకులు ఆమెను నిర్బందించి బయటికి తీసుకెళ్లారు. అందుకు సంబంధించిన 2 నిమిషాల 17 సెకన్ల వీడియోను లిసిప్రియ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. 'ఈ నిరసన తర్వాత వారు నన్ను 30 నిమిషాలకుపైగా నిర్బంధించారు. నా ఏకైక నేరం వాతావరణ సంక్షోభానికి ప్రధాన కారణమైన శిలాజ ఇంధనాలను తొలగించమని అడగడం. ఇప్పుడు వారు నన్ను సీఓపీ 28 నుంచి తొలగించారు. నా నిరసనకు సంబంధించిన పూర్తి వీడియో ఇక్కడ ఉందని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. మరొక పోస్ట్‌లో 'శిలాజ ఇంధనాలకు వ్యతిరేకంగా నిరసన తెలిపినందుకు నా బ్యాడ్జ్‌ను నిలిపివేయడానికి కారణం ఏమిటి? మీరు నిజంగా శిలాజ ఇంధనాలకు వ్యతిరేకంగా నిలబడితే, మీరు తప్పనిసరిగా నాకు మద్దతు ఇవ్వాలి. మీరు వెంటనే నా బ్యాడ్జ్‌లను విడుదల చేయాలి. ఇది ఐక్యరాజ్యసమితి బాలల హక్కుల సూత్రానికి విరుద్ధం. ఐక్యరాజ్యసమితిలో నా స్వరం వినిపించే హక్కు నాకుంది. కాబట్టి నా బ్యాడ్జ్‌ను నిలిపివేయడం బాలల హక్కుల ఉల్లంఘన, దుర్వినియోగం కిందికి వస్తుందని ట్వీట్ చేశారు.

## ఫైబర్‌నెట్ కేసు విచారణ

**జనవరి 17కు వాయిదా వేసిన సుప్రీం**

**న్యూఢిల్లీ,డిసెంబర్12 :** ఫైబర్ నెట్ కేసు విచారణను సుప్రీం కోర్టు జనవరి 17కు వాయిదా వేసింది. ఫైబర్‌నెట్ కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సుప్రీంలో పిటిషన్ దాఖలు చేశారు. స్కిల్ కేసులో 17 ఏపై తీర్పు పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో విచారణ పలుమార్లు వాయిదా పడుతూ వచ్చింది. ఈరోజు సుప్రీంలో జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ బేలా ఎం. త్రివేది ధర్మాసనం ముందు ÷బైర్ నెట్ కేసు విచారణకు వచ్చింది. స్కిల్ కేసులో 17 ఏపై తీర్పు వెలువరించాల్సి ఉన్నందున ఫైబర్ నెట్ కేసును జనవరి 17కి వాయిదా వేస్తున్నట్లు ధర్మాసనం స్పష్టం చేసింది. అంతవరకూ చంద్రబాబుపై ఎటువంటి తదుపరి చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది. ఫైబర్ నెట్ కేసు గురించి కూడా చంద్రబాబు మాట్లాడకుండా నిలువరించాలని ఏపీ ప్రభుత్వం తరపు న్యాయవాది రంజిత్ కుమార్ విజ్ఞప్తి చేశారు. చంద్రబాబు మాట్లాడటం లేదని ఆయన తరపు సీనియర్ కౌన్సిల్ సిద్దార్ధ లూథ్రా స్పష్టం చేశారు. ఏఏజీ, డీజీపీలు మాత్రమే ఢిల్లీ, హైదరాబాద్‌లలో విలేకరుల సమావేశం పెట్టి కేసు గురించి మాట్లాడు తున్నారని సిద్దార్థ లూథ్రా తెలిపారు.

## అధికారుల అలసత్వం.. ప్రజా ప్రతినిధుల అనుపస్థితి..

**(రామ కిష్టయ్య సంగన భట్ల)**



**ధర్మపురి డిసెంబర్ 12 (ప్రజామంటలు):** సమస్యల పరిష్కార వేదికగా ఉండాల్సిన మండల సర్వసభ్య సమావేశం అధికారుల అలసత్వం, అధిక సంఖ్యాకులైన ఎంపిటిసి సభ్యుల బాధ్యతా రాహిత్య అనుపస్థితి కారణాలుగా లక్ష్యానికి దూరంగా నడిచింది. మంగళ వారం మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ధర్మపురి ఎంపీపీ చిట్టిబాబు అధ్యక్షతన, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ నిర్వహించిన, జెడ్పీటీసీ బత్తిని ఆరుణ, తహసీల్దార్ కృష్ణ చైతన్య వేదికాసీనులు కాగా ఎంపీటీసీలు, వివిధ గ్రామాల సర్పంచులు, అధికారులు హాజరైనారు. ఉదయం 10.30గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం కోరం లేని స్థితిలో సుదీర్ఘ కాలయాపన అనంతరం 12.50గంటలకు ప్రారంభ మయింది. వైస్ ఎంపీపీ మహిపాల్ రెడ్డి, ఎంపీటీసీలు 13మందికి గాను రామటెంకి చందన, కుంబాల రవిత, ఆకుబత్తిని తిరుపతి, కాళ్ల సత్తయ్య, కోఆప్షన్ సభ్యులు కైసర్ మాత్రమే హాజరైనారు. ఎజెండా లోని అంశాలను సంబంధిత అధికారులు వివరించే సమయాలలో ప్రజా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు, సందేహాలకు సమాధానాలు చెప్పక, గత సమావేశాలలో లాగానే సమాధానాలు రావడంతో, ప్రశలడిగిన ప్రజా ప్రతినిధులు నిరసించారు. సంబంధిత అధికారులు 19 అంశాలను అధికారులు చదివి వినిపించారు. ముందుగా వ్యవసాయశాఖ అధికారి చంద్ర దీపక్ తో ప్రాంభించి, అధికారులు రాజేందర్ రెడ్డి, రవి శంకర్, వెంకటేష్, సతీశ్, భూమయ్య, మహేష్, మురళి, రాహుల్, రోహిత్, ముకర్రం, కుసుమ, విజయశ్రీ, నరేష్, రమాదేవి, సృజన్, నరేష్, వీరయ్య, తహశీలదార్ చైతన్యలు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. జైనా పీఎసీఎస్ చైర్మన్ సౌల్ల నరేష్, గోవిందుపల్లె సర్పంచ్ పురం శెట్టి రాజయ్య, ఆరెపెల్లి ఎంపీటీసీ రవిత, కో ఆప్షన్ సభ్యులు కైసర్, దుబ్బయ్య, పాక్స్ చైర్మన్ నరేష్ తదితరులు వివిధ సమస్యలను దృష్టికి తెచ్చారు. ఎంపీపీ చిట్టిబాబు... గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం అందరు కృషి చేయాలని కోరారు.

## పేకాట స్థావరంపై సీసీఎస్ పోలీసుల దాడి

**పేకాట ఆడుతూ పట్టుబడ్డ 8 మందిపై కేసు నమోదు**

**రూ. 23,600 వేల నగదు స్వాధీనం**

**పేకాట ఆడిన, నిర్వహణ స్థావరాలు ఏర్పాటు చేసిన చట్ట ప్రకారం కఠిన చర్యలు**



**జగిత్యాల రూరల్ డిసెంబర్ 12 (ప్రజామంటలు):** జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ధరూర్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్న స్థావరంపై సిసిఎస్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలోవారు సిబ్బందితో ఆకస్మిక దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న 8 మందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుండి 23,600 వేల రూపాయల నగదు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిసిఎస్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.... పేకాట ఆడుతూ జీవితాలను నాశనం చేసుకోవద్దని, జూదం ఆడి డబ్బులు సంపాదించవచ్చు అనే ఆశ ఉండకూడదని దీని వల్ల ఎక్కువ శాతం నష్టమే ఉంటుందని అభిప్రాయపడ్డారు. పేకాట ఆడుతూ పట్టుబడ్డ, నిర్వహణ స్థావరాలు ఏర్పాటు చేసిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.

## గాంధీ ఆసుపత్రిలో గుర్తు తెలియని డెడ్ బాడీ



**సికింద్రాబాద్ డిసెంబర్ 12 (ప్రజామంటలు):** గాంధీ ఆసుపత్రిలో మరో గుర్తు తెలియని డెడ్ బాడీ ని పోలీసులు గుర్తించారు. చిలకలగూడ ఎస్.ఐ పి. కిషోర్ కథనం ప్రకారం.... గాంధీ ఆసుపత్రి ఓపీ బ్లాక్ సమీపం లోని వెయిటింగ్ హాల్ వద్ద ఉన్న దాదాపు 45-50 ఏండ్ల వయస్సు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి డెడ్ బాడీని ఆసుపత్రి సిబ్బంది చూసి, పోలీసులకు సమాచారం అందించారు. అయితే డెడ్ బాడీ వద్ద వ్యక్తి కి సంబందించిన ఎలాంటి వివరాలు ఏవీ లభించకపోవడంతో డెడ్ బాడీని మార్చురీకి తరలించి, భద్రపరిచారు. ఫొటోలోని వ్యక్తిని గుర్తుపట్టిన వారు తమను సంప్రదించాలని ఎస్.ఐ. విజ్ఞప్తి చేశారు.

**ఇటీవల పెరిగిన అనాధల మరణాలు:** చలి తీవ్రత పెరగడంతో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే గాంధీ ఆసుపత్రి, గాంధీ మెట్రో స్టేషన్ ప్రాంతాల్లోని యాచకులు వ్యాధి ముదిరి ఇటీవల కాలంలో ప్రాణాలు విడవటం సాధారణంగా మారింది. ఈ మరణాలు ఇటీవల కాలంలో బాగా పెరిగాయి. అయితే మృతుల వివరాలు తెలియకపోవడంతో శవాల అప్పగింత, అంత్యక్రియలు, కేసు ధర్యాప్తు అంశాలు పోలీసులకు ఓ పెద్ద సవాల్ గా మారాయి.

## తెలంగాణ ఉద్యమకారులను గౌరవించండి



**హైదరాబాద్ డిసెంబర్ 12 (ప్రజామంటలు):** తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి, గౌరవించి ప్రభుత్వం తరపున కొన్ని సంక్షేమ పథకాలు అందిస్తామని కాంగ్రెస్ ఎన్నికల మానిఫెస్టోలో పెట్టిన వాటి గురించి వెంటనే వెలువరించి పని ప్రాంభించాలని తెలంగాణ ప్రజాసమితి కార్యాలయంలో జరిగిన ఆత్మీయుల సమ్మేళనం కోరింది. త్వరలో ముఖ్యమంత్రిని కలవాలని తీర్మానించింది. ఈ మీటింగులో బి.ఎస్. రాములు, డాక్టర్ షోయబ, మీరా కుమార్, మీరాయిన్సా, కరుణాకర్ రెడ్డి, సిహెచ్ ప్రభాకర్ రావు, అశోక్, మురళీధరరావు దేశ్ పాండే, ఆనంద్, కేలా జనార్దన్ సనావుల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు

## కొత్తకొండ ఆలయ చైర్మన్ పదవి ఇవ్వాలని విన్నపం



**భీమదేవరపల్లి డిసెంబర్ 12 (ప్రజామంటలు):** మండలంలోని కొప్పూర్ గ్రామానికి చెందిన కొత్త వాసుదేవరెడ్డి ఓటుహక్కు వచ్చినప్పటి నుండి కాంగ్రెస్ పార్టీలో పని చేస్తూ, విద్యార్థి దశ నుండి అనేక విద్యార్థి సమస్యలపై పోరాటం చేసి, రాజకీయ ప్రస్థానం 1988 నుండి నుండి 1992 వరకు భీమదేవరపల్లి మండల ఎన్ఎస్ యుఐ ప్రెసిడెంట్ గా 1996 నుండి 2000 వరకు భీమదేవరపల్లి మండల్ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ గా, 2006 నుండి 2007 సిటీ కాంగ్రెస్ సెక్రెటరీ గా తర్వాత 2010 నుండి 2011 సిటీ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ గా సేవలు అందించిన తనను కొత్తకొండ దేవస్థానం చైర్మన్ పదవికి పరిగణలోకి తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కు విన్నవించారు. రాజకీయ ప్రస్థానంలో ఎక్కడ కూడా పార్టీ ప్రతిష్టకు ఇబ్బంది కలగకుండా, క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా కాంగ్రెస్ పార్టీకి విధేయుడుగా, పార్టీ ఆదేశించిన ప్రతి పనిని ఎన్ని అడ్డంకులు ఎదురైనా పార్టీ కొరకు సక్రమంగా పనిచేశాననీ తెలిపారు. తుదిశ్వాస వరకు కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతారని అన్నారు.

## డాక్టర్కు డాక్టర్ కంటి పరీక్ష

**కోరుట్ల ఎమ్మెల్యేకు జగిత్యాల ఎమ్మెల్యే చేసిన కంటి పరీక్షలు**



**జగిత్యాల డిసెంబర్ 12 (ప్రజామంటలు):** వృత్తి రీత్యా ఇద్దరు డాక్టర్లే..... ఇద్దరు ఎమ్మెల్యే లే.... ఇద్దరు వారి వారి పనుల్లో నిత్యం బిజీగా ఉండేటోళ్లే. నిత్యం పేషెంట్లకు పరీక్షలు చేస్తుండటం సర్వసాధారణమైన విషయం. కానీ ఇలా ఒక డాక్టర్ ఇంకొక డాక్టర్ను పరీక్షించడమే విశేషం. దీనికి వేదిక అయింది జగిత్యాల పట్టణంలోని పావని కంటి వైద్యశాల. ఇటీవలే తొలిసారి కోరుట్ల ఎమ్మెల్యేగా ఎన్నికైన డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ను కలిసిన సందర్భంలో కోరుట్ల ఎమ్మెల్యేకు జగిత్యాల ఎమ్మెల్యే ఇలా కంటి పరీక్షలు నిర్వహించారు.

prajamantalau daily pages (13-12)_times of varha main (13-2).qxd 12/13/2023 6:20 AM Page 6



# లవ్‌ట్రాక్‌లో పడ్డ అడవిశేష్

## సూర్యతో పనిచేయడం ఓ థ్రిల్: బాబీ డియోల్




28 ఏళ్ల తర్వాత 'యానిమల్'తో సూపర్ హిట్ అందుకున్నారు బాబీ డియోల్ . ప్రస్తుతం ఆయన వరుస చిత్రాలతో బిజీగా ఉన్నారు. అటు తమిళం, ఇటు తెలుగు చిత్రాలతో ముందుకెళు_న్నారు. తెలుగులో 'హరిహర వీరమల్లు'తోపాటు బాలకృష్ణ చేయబోయే ఓ చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్నారు. తమిళంలో సూర్య నటిస్తున్న 'కంగువా'లో విలన్ గా కనిపించనున్నారు. తాజాగా ఈ సినిమాలోని తన పాత్ర గురించి ఆసక్తికర విషయాలు చెప్పారు బాబీ దేవోల్. 'కంగువా' కథ, అందులో నా పాత్ర బాగా నచ్చింది. ఇక చిత్ర బృందం అయితే ఎప్పటికీ గుర్తుండిపోతుంది. సూర్య నటన అద్భుతంగా ఉంటుంది. అలాంటి అంకితభావం ఉన్న నటుడితో పని చేయడం ఆనందంగా ఉంది. తమిళంలో నా తొలి చిత్రమిది. ఇప్పటి దాకా ఈ తరహా పాత్ర చేయలేదు. ఇందులోనేను చేస్తున్న పాత్ర నా కంఫర్ట్ జోన్లో లేదు. ఎందుకంటే నాకు ఈ భాష తెలియదు. రెండు నెలల్లో తమిళం నేర్చుకోలేను' అని అన్నారు. కంగ అనే ఓ పరాక్రముడి కథతో ఈ సినిమా తెరకెక్కుతోంది. ఇందులో సూర్య ఆరు భిన్నమైన అవతారాల్లో కనిపించనున్నారు. శివ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రమిది. 38 భాషల్లో విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఐమ్యాక్స్, 3డీ వెర్షన్‌లోనూ ఇది అందుబాటులో ఉ ఒడనుంది. దిశా పటానీ కథానాయికగా నటిస్తుండగా..వచ్చే ఏడాది వేసవి కానుకగా ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు.

## శృతిహాసన్‌తో కొత్త సినిమా





టాలీవుడ్‌లో ఉన్న యంగ్ డైనమిక్ హీరోల్లో ఒకరు అడివిశేష్. క్షణం, గూడఛారి, మేజర్, హిట్ 2 సినిమాలతో హీరోగా తనకంటూ సూపర్ ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకున్నాడు. ఈ క్రేజీ హీరో కాంపౌండ్ నుంచి ఇప్పటికే గూఢచారి 2 వస్తున్న విషయం తెలిసిందే. తాజాగా అడివిశేష్ కొత్త సినిమాకు సంబంధించిన ప్రకటన ఒకటి బయటకు వచ్చింది. ఈ సారి లవ్ స్టోరీతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. ప్రేమ.. దాని వెనకున్న యూనిక్ స్టోరీని మీ ముందుకు తీసుకొచ్చేందుకు అడివిశేష్, శృతిహాసన్ కలిసి వస్తున్నారు.. నయా సినిమాకు సంబంధించిన అప్‌డేట్ ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. ఈ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తుండగా.. ఆసియన్ సునీల్ సహనిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రానికి కథనందిస్తూ దర్శకత్వం వహిస్తున్నాడు. మొత్తానికి చాలా కాలం తర్వాత అడివిశేష్ నుంచి లవ్ ట్రాక్ రాబోతుండటంతో అంతా ఆసక్తి నెలకొంది. ఈ మూవీ షూటింగ్ ప్రారంభమైనట్లు తెలియజేస్తూ అడివి శేష్.. 'జీ2' నుంచి ప్రీ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ సీక్వెల్‌ను పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ బ్యానర్‌లపై టీజీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. శేష్ ఎక్స్ శృతి అంటూ తాజాగా ఈ సినిమాకు సంబంధించిన అప్‌డేట్‌ని మేకర్స్ వదిలారు. శృతిహాసన్ ఆ మధ్య లవ్ అంటూ.. సినిమాలకు కాస్త గ్యాప్ ఇచ్చింది. ఆమె ప్రేమాయణంలో కాస్త గందరగోళం నెలకొనడంతో తిరిగి సినిమాలలోకి రీ ఎంట్రీ ఇచ్చింది. రీ ఎంట్రీలో ఆమెకు మంచి హిట్స్ కూడా పడ్డాయి. 'వాల్తేరు వీరయ్య', 'వీరసింహారెడ్డి' సినిమాలతో హిట్స్ అందుకున్న శృతిహాసన్ రీసెంట్‌గా వచ్చిన 'హాయ్ నాన్న' సినిమాలోనూ మెరిసింది. ఇప్పుడు ప్రభాస్ సరసన 'సలార్'తో సంచలనానికి సిద్ధమవుతోంది. రీ ఎంట్రీలో స్టార్ హీరోలకే ఇంపార్టెన్స్ ఇచ్చిన శృతి.. ఇప్పుడు యంగ్ హీరో శేష్‌తో పాన్ ఇండియా ప్రాజెక్ట్‌కు సిద్ధమైంది. ప్రస్తుతానికి మేకర్స్ ఈ వివరాలను మాత్రమే రివీల్ చేశారు. ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. అయితే అడివి శేష్ ఇప్పటి వరకు సస్పెన్స్ థ్రిల్లర్స్‌తో అలరిస్తూ వస్తున్నాడు. కానీ ఈ ప్రాజెక్ట్ అనౌన్స్‌మెంట్ చూస్తుంటే.. ఇదొక లవ్ స్టోరీ అని తెలుస్తుంది. ఈ లవ్ స్టోరీతో శేష్ ఎలా మెప్పిస్తాడో చూడాల్సి ఉంది. ఈ సినిమా విషయమై శేష్.. శృతిహాసన్‌తో ఉన్న ఫొటోలను షేర్ చేసి తన ఆనందాన్ని తెలియజేశాడు. ప్రస్తుతం ఆ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## 15న విడుదలకు సిద్దంగా అఘోరి



బుల్లితెర నటుడు సిద్ధు సిధ్ కథానాయకుడిగా మారి..హీరోగా నటించిన 'అఘోరి' చిత్రం ఈనెల 15న విడుదలకు సిద్ధమైంది. ఇందులో షాయాజీ షిండే వైవిధ్యభరితమైన పాత్రను పోషించారు. పీవీఆర్ పిక్చర్స్ విడుదల చేసే ఈ చిత్రాన్ని మోషన్ ఫిల్మ్ పిక్చర్స్ ఐఎన్‌సీ పతాకంపై నిర్మాత సురేష్ కే మేనన్ నిర్మించారు. డీఎస్ రాజ్‌కుమార్ దర్శకత్వం వహించారు. శృతి రామకృష్ణన్ హీరోయిన్‌గా నటించగా, ఇతర పాత్రలను మైమ్ గోపి, డార్లింగ్ మదన గోపాల్, రియామికా, మాధవి, వెట్రి, కార్తీ, శరత్, డిజైనర్ భవన్ తదితరులు పోషించారు. వసంత్ ఛాయాగ్రహణం అందించగా, ఫోర్ మ్యూజిక్ బ్యాండ్ పేరుతో నలుగురు సంగీత దర్శకులు సంగీత స్వరాలను సమకూర్చారు. ఈ చిత్ర కథను దర్శకుడు డీఎస్ రాజ్‌కుమార్ వివరిస్తూ... ఇది పూర్తిగా వినోదాత్మక చిత్రం. ఆరు నుంచి అరవైయేళ్ళ వారు చూసేలా అన్ని రకాల కమర్షియల్ ఫీచర్లతో రూపొందించాం. అఘోరిగా షిండే అద్భుతంగా నటించారు. కేరళలోని అటవీ ప్రాంతాల్లో వేసిన భారీ సెట్లలో అఘోరీలతో ఉండే సన్నివేశాలను భీతిగొల్పేలా తెరకెక్కించాం. సినిమాలో గ్రాఫిక్స్ ప్రతి ఒక్కరినీ అబ్బురపరిచేలా ఉంటాయి. తెలుగులో 'సహా' చిత్రంలో నటించిన జక్కుల్లా బాబు ప్రతి నాయకుడి పాత్రను పోషించారు. కర్ణాటక ప్రభుత్వం నుంచి ఉత్తమ అవార్డు స్వీకరించిన శృతి రామకృష్ణన్ హీరోయిన్‌గా నటించారని వివరించారు.

## 22న రిలీజ్‌కు సలార్ సిద్ధం

### పాటల విడుదల పై అభిమానుల్లో ఆత్రుత




పాన్ ఇండియా స్టార్ హీరో ప్రభాస్ కాంపౌండ్ నుంచి వస్తున్న చిత్రం సలార్. యాక్షన్ థ్రిల్లర్ జోనర్‌లో వస్తోన్న ఈ మూవీకి కేజీఎఫ్ ఫేం ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహిస్తున్నాడు. సలార్ రెండు పార్టులుగా తెరకెక్కుతుండగా.. డిసెంబర్ 22న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదలకు రెడీ అవుతోంది. రిలీజ్ డేట్ దగ్గర పడుతున్న నేపథ్యంలో మేకర్స్ ఏదో ఒక అప్‌డేట్‌తో మూవీ లవర్స్‌లో జోష్ నింపుతున్నరు. సలార్ ఫస్ట్ సింగిల్‌కు అంతా సిద్ధమైంది. హోంబలే మ్యూజిక్‌లో పాటలను మీ ముందుకు తీసుకురాబోతున్నామని ట్వీట్ చేశారు మేకర్స్. మరికొద్ది సేపట్లో ఫస్ట్ సింగిల్ ప్రకటన ఉండబోతుందన్న అప్‌డేట్‌తో ఫుల్ ఖుషీ అవుతున్నారు మూవీ లవర్స్. ఇటీవలే లాంఛ్ చేసిన సలార్ ట్రైలర్ నెట్టింట వ్యూస్ పంట పండిస్తూ.. టాక్ ఆఫ్ ది గ్లోబల్ ఇండస్ట్రీగా మారుతోంది. ఇటీవలే సలార్ సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకోగా.. సలార్‌కు సీబీఎఫ్‌సీ ఏ సర్టిఫికెట్ జారీ చేసింది. సలార్ రన్ టైం 2 గంటల 55 నిమిషాల 22 సెకన్లు. యాక్షన్ డ్రామా నేపథ్యంలో వస్తున్న సలార్‌లో మాలీవుడ్ సూపర్‌స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ వరదరాజ మన్నార్ ది కింగ్ పాత్రలో నటిస్తోంది. ఇప్పటికే విడుదల చేసిన వరదరాజ మన్నార్ ది కింగ్ లుక్ ఇప్పటికే నెట్టింట హల్ చల్ చేస్తుండగా.. శృతిహాసన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. సలార్‌ను కేరళలో పృథ్వీరాజ్ సుకుమారన్ హోం బ్యానర్ పృథ్వీరాజ్ ప్రొడక్షన్స్ హౌజ్ విడుదల చేస్తోంది. నైజాంలో టాలీవుడ్ పాపులర్ ప్రొడక్షన్ బ్యానర్ మైత్రీ మూవీ మేకర్స్ సలార్‌ను రిలీజ్ చేస్తుండగా.. నార్తిండియాలో అనిల్ తడని ఈ సినిమాను విడుదల చేస్తోంది. ఇక ఓవర్సీస్‌లో సలార్‌ను విడుదల చేస్తోంది.

## 21న విడుదల కానున్న డంకీ

### వైష్ణోదేవి ఆలయంలో షారూఖ్ పూజలు





ఒకే ఏడాది రెండు వెయ్యి కోట్ల సినిమాలు చేసిన హీరోగా షారుఖ్ ఖాన్ సంచలనం సృష్టించాడు. ఈ ఏడాది ప్రథమార్ధంలో 'పఠాన్'తో కలెక్షన్ కోత సృష్టిస్తే. ద్వితియార్థంలో 'జవాన్'తో కలెక్షన్‌ల మోత మోగించారు. ఇప్పుడు ఏడాది చివర్లో మరో సంచలనానికి సిద్ధమవుతున్నాడు ఈ బాలీవుడ్ బాద్‌షా. ప్రస్తుతం షారుఖ్ నటించిన 'డంకీ' చిత్రం విడుదలకు సిద్ధమైన విషయం తెలిసిందే. డిసెంబర్ 21వ తేదీన ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్ర రిలీజ్‌కు ముందు షారుఖ్ ప్రముఖ పుణ్యక్షేత్రం జమ్మూకశ్మీర్‌లోని మాతా వైష్ణో దేవి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. కాగా, ఏడాదిలో వైష్ణోదేవి ఆలయాన్ని షారుఖ్ సందర్శించడం ఇది మూడోసారి. జవాన్ చిత్రానికి ముందు గతేడాది డిసెంబర్‌లో షారుక్.. వైష్ణోమాతా ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత 'పఠాన్' రిలీజ్‌కు ముందు కూడా ఆయన ఆ ఆలయాన్ని సందర్శించారు. ఆగస్టులో అక్కడికి వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆ రెండు చిత్రాలు సూపర్ డూపర్ హిట్ కావడంతో.. మూడోసారి 'డంకీ' రిలీజ్‌కు ముందు కూడా షారుఖ్ వైష్ణోదేవి ఆలయాన్ని సందర్శించారు. దీంతో ఈ చిత్రం కూడా హిట్ అవుతుందంటూ ఫ్యాన్స్ చెప్పుకుంటున్నారు.

## ప్రపంచ కప్ 2024
## షెడ్యూల్ ప్రకటించిన ఐసీసీ

ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) ప్రపంచ కప్ 2024 షెడ్యూల్‌ను ప్రకటించింది. జనవరి 19 నుండి ఫిబ్రవరి 11 వరకు ఈ మ్యాచ్ లు జరగనున్నాయి. ఇంతకుముందు.. ఈ టోర్నమెంట్ శ్రీలంకలో నిర్వహించేందుకు నిర్ణయించగా.. ఇప్పుడు అక్కడి నుంచి వేదికను తరలించారు. ఈ టోర్నమెంట్ లో.. భారత్, బంగ్లాదేశ్, అమెరికా, వెస్టిండీస్, నమీబియా, ఇంగ్లండ్, ఆఫ్ఘనిస్తాన్, నమీబియా, నేపాల్, దక్షిణాఫ్రికా, పాకిస్థాన్, శ్రీలంక, న్యూజిలాండ్, జింబాబ్వే, ఐర్లాండ్, ఆస్ట్రేలియాతో కలిపి 16 జట్లు పాల్గొననున్నాయి. మొత్తం 41 మ్యాచ్‌లు జరుగనున్నాయి. బ్లూమ్‌ఫోంటెయిన్‌లోని మాంగాంగ్ ఓవల్‌లో జరిగే ఛాంపియన్‌షిప్ ప్రారంభ మ్యాచ్‌లో ఐర్లాండ్-యుఎస్‌ఎ జట్టు తలపడనున్నాయి. పోచెఫ్‌స్ట్రూమ్‌లోని జెబి మార్క్స్ ఓవల్, ఈస్ట్ లండన్‌లోని బఫెలో పార్క్, కింబర్లీలోని కింబర్లీ ఓవల్, బెనోనిలోని విల్లోమూర్ పార్క్ ఈ టోర్నమెంట్ కు వేదికలు కానున్నాయి. ఇదిలా ఉంటే.. డిఫెండింగ్ ఛాంపియన్స్ భారత్ తన తొలి మ్యాచ్ జనవరి 20న బంగ్లాదేశ్ తో ఆడనుంది. ఆ తర్వాత.. జనవరి 25, 28 తేదీల్లో జరిగే తొలి రౌండ్‌లో ఐర్లాండ్‌తోనూ, అమెరికాతోనూ భారత్ తలపడనుంది.



## బర్త్ డే పార్టీలో సందడి చేసిన ధోని



ఇండియా మాజీ క్రికెటర్ ఎం ఎస్ ధోని పేరు ఈ మధ్య సోషల్ మీడియాలో తెగ వినిపిస్తుంది.. అభిమానులను కలవడం, స్నేహితులకు సంబంధించిన ఈవెంట్స్ లలో పాల్గొంటు సందడి చేస్తున్నాడు.. తాజాగా తన ఫ్రెండ్ పుట్టినరోజు వేడుకలో ధోని సందడి చేశాడు.. అందుకు సంబంధించిన వీడియో, ఫోటోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో ట్రెండ్ అవుతున్నాయి.. ఆ వైరల్ అవుతున్న వీడియోలో అతను ఆ వ్యక్తి పుట్టినరోజును ఉత్సాహంగా జరుపుకోవడమే కాకుండా అతని ముఖానికి కేక్ పెట్టడం కూడా చూపిస్తుంది.. ఈ వీడియోను సుమీత్ కుమార్ బజాజ్ అనే యూజర్ ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. ఆ వీడియోలో గది మొత్తం బెలూన్‌లతో అలంకరించబడి, టేబుల్‌పై ఉంచిన రెండు కేకులను చూపిస్తూ మొదలవుతుంది. ఓ వ్యక్తి కేక్ కట్ చేయడానికి ముందుకు సాగిన క్షణంతో పాటు పుట్టినరోజు పాటను ఆనందంగా పాడే వ్యక్తుల సమూహంతో స్థలం ఉల్లాసంగా ఉంటుంది. %మీ% ధోనీ కేక్ ను తినిపించిన తర్వాత, ముఖానికి కేక్ పూయడం చేస్తాడు ధోని.. దానికి అందరు నవ్వుతారు.. ఫన్నీగా ఉంటుందిఈ వీడియో రెండు రోజుల క్రితం షేర్ చేయబడింది. పోస్ట్ చేసినప్పటి నుండి, ఇది ఎనిమిది లక్షలకు పైగా వీక్షణలను మరియు 72,000 కంటే ఎక్కువ లైక్‌లను పొందింది.. ఈ వీడియో ను చూసిన ధోని ఫ్యాన్స్ ఫుల్ ఖుషి అవుతున్నారు.. అలాగే నెటిజన్లు గ్రేట్ అంటూ రకరకాల కామెంట్స్ చేస్తున్నారు.. మొత్తానికి ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది..

## ఫ్రాంచైజీల కళ్లన్నీ ఆ ఇద్దరిపైనే..
## కోట్ల వర్షం పక్కా!




4ఐపీఎల్ 2024 కోసం ఆటగాళ్ల వేలానికి సర్వం సిద్ధమైంది. డిసెంబర్ 19న దుబాయ్‌లో జరిగే వేలంలో మొత్తం 333 మంది ఆటగాళ్లు అమ్మకానికి ఉన్నారు. ఐపీఎల్ 2024 వేలం కోసం మొత్తం 1166 మంది ఆటగాళ్లు నమోదు చేసుకుకోగా.. ఫ్రాంచైజీలతో సంప్రదించాక ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ 333 మందితో తుది జాబితాను ప్రకటించింది. ఇందులో 214 మంది భారతీయులు ఉండగా.. 119 మంది విదేశీయులు, ఇద్దరు అసోసియేట్ దేశాల నుంచి ఉన్నారు. 333 మంది ఆటగాళ్లలో కొందరిపై కాసుల వర్షం కురవనుంది. వన్డే వరల్డ్‌కప్ 2023లో ఆస్ట్రేలియాను విజేతగా నిలపడంలో కీలకపాత్ర పోషించిన ఓపెనర్ ట్రావిస్ హెడ్‌పై ఫ్రాంచైజీలన్నీ కన్నేశాయి. అతడికి ఐపీఎల్ 2024 వేలంలో భారీ మొత్తం దక్కే అవకాశాలు ఉ న్నాయి. దాదాపుగా 10 కోట్లకు పైనే హెడ్ అమ్ముడుపోయే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. మరోవైపు వన్డే ప్రపంచకప్ 2023లో న్యూజిలాండ్ తరఫున మెరిసిన రచిన్ రవీంద్రను కొనడానికి కూడా ఫ్రాంచైజీలు ఎగబడే అవకాశాలు ఉన్నాయి. ఆల్‌రౌండర్ కావడం రవీంద్రకు కలిసొచ్చే అంశం. అంతేకాదు ఓపెనింగ్ చేయడం, హిట్టింగ్ చేయడం కూడా అతడికి కలిసొచ్చే అంశాలు. ఆస్ట్రేలియా ఆటగాళ్లు ప్యాట్ కమిన్స్, జోష్ ఇంగ్లిస్, మిచెల్ స్టార్క్‌లకు మంచి డిమాండ్ ఉండనుంది. వీళ్ల కనీస ధర రూ. 2 కోట్లు. రచిన్ రవీంద్ర కనీస ధర రూ.50 లక్షలు. ఐపీఎల్ 2024 వేలంలో ఖర్చు పెట్టడానికి ఫ్రాంఛైజీల వద్ద మొత్తం రూ. 262.95 కోట్లు ఉ న్నాయి. ఈ వేలంలో మొత్తం 77 మందిని ఫ్రాంఛైజీలు కొనుగోలు చేయనున్నారు. ఇందులో గరిష్టంగా 30 మంది విదేశీ క్రికెటర్లను జట్లు కొనుక్కోవచ్చు. భారత ప్లేయర్స్ హర్షల్ పటేల్, శార్దూల్ ఠాకూర్, ఉమేశ్ యాదవ్ కనీస ధర రూ. 2 కోట్లు.

prajamantalau daily pages (13-12)_times of varha main (13-2).qxd 12/13/2023 6:20 AM Page 7



# ఏడాది మొత్తం టీమిండియా అదరగొట్టినా?



టీమ్ ఇండియా 2023 లో ఏట్రోఫీని గెలుచుకోకపోవచ్చు. కానీ, ఈ సంవత్సరం భారత జట్టుకు అద్భుతంగా ఉంది. ఈ ఏడాది టీ20 నుంచి వన్డే, టెస్టు ఫార్మాట్ల వరకు మొత్తం 11 ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడిన టీమ్ ఇండియా అందులో 9 సిరీస్‌లను గెలుచుకుంది. దీంతో పాటు ఈ ఏడాది జరిగిన రెండు ఐసీసీ టోర్నీల్లోనూ ఫైనల్స్‌కు చేరుకుంది. శ్రీలంకతో వన్డే సిరీస్‌తో భారత జట్టుకు కొత్త సంవత్సరం ప్రారంభమైంది. ఇక్కడ శ్రీలంకతో జరిగిన మూడు వన్డేల సిరీస్‌ను ఆతిథ్య భారత్ క్లీన్ స్వీప్ చేసింది. ఆ తర్వాత, భారత జట్టు తన సొంత గడ్డపై న్యూజిలాండ్‌తో జరిగిన మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను కూడా 3-0 తేడాతో ఏకపక్షంగా కైవసం చేసుకుంది. అయితే, మార్చిలో ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్‌లో టీమిండియా 1-2తో సొంత మైదానంలో ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. దీంతో సెప్టెంబర్‌లో జరిగిన వన్డే సిరీస్‌లో కంగారూలను ఓడించి భారత్ ప్రతీకారం తీర్చుకుంది. ప్రపంచకప్‌నకు ముందు జరిగిన ఈ సిరీస్‌లో భారత్ 2-1తో ఆస్ట్రేలియాను ఓడించింది. మరోవైపు వెస్టిండీస్‌తో జరిగిన వన్డే సిరీస్‌ను కూడా భారత్ 2-1 తేడాతో కైవసం చేసుకుంది. ఈ ఏడాది భారత్ నాలుగు టీ20 సిరీస్‌లు ఆడింది. జనవరిలో శ్రీలంకను 2-1తో ఓడించిన టీమ్ ఇండియా ఆ తర్వాత వెంటనే 2-1తో న్యూజిలాండ్‌ను ఓడించింది. ఆగస్టులో వెస్టిండీస్ పర్యటనలో 2-3 తేడాతో ఓటమిని చవిచూసింది. ఆ తర్వాత టీ20 సిరీస్‌లో ఐర్లాండ్‌ను 2-0తో, తాజాగా ఆస్ట్రేలియాను 4-1తో టీమిండియా ఓడించింది. ఈ ఏడాది భారత్ కేవలం రెండు టెస్టు సిరీస్‌లను మాత్రమే గెలుచుకుంది. మొదటి టెస్ట్ సిరీస్ ఆస్ట్రేలియాతో జరిగింది. ఇందులో భారత జట్టు నాలుగు మ్యాచ్‌ల బోర్డర్-గవాస్కర్ ట్రోఫీని 2-1తో గెలుచుకుంది. ఆ తర్వాత, జులైలో వెస్టిండీస్ పర్యటనలో, టీమిండియా ఆతిథ్య జట్టును టెస్ట్ సిరీస్‌లో 1-0తో ఓడించింది. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను కోల్పోయింది. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ చివరి మ్యాచ్‌లో ఆస్ట్రేలియాను భారత్ ఎదుర్కొంది. ఇంగ్లండ్‌లోని ఓవల్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో టీమిండియా ఏకపక్షంగా ఓడి వరుసగా రెండోసారి ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను చేజార్చుకుంది. నవంబర్‌లో జరిగిన ప్రపంచకప్‌లో టీమిండియా అద్భుత ప్రదర్శన చేసింది. భారత జట్టు తన అన్ని మ్యాచ్‌లను ఏకపక్ష పద్ధతిలో గెలిచి ఫైనల్స్‌కు చేరుకుంది. అయితే ఇక్కడ భారత జట్టు ఆస్ట్రేలియా చేతిలో ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. ఇలా పదేళ్ల తర్వాత మరోసారి ఐసీసీ ట్రోఫీని చేజిక్కించుకోవాలనే కల కలగానే మిగిలిపోయింది. భారత జట్టు ఈ ఏడాది ఐసీసీ టోర్నీలను గెలవలేకపోయినా.. ఆసియా కప్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఆతిథ్య శ్రీలంకను ఏకపక్షంగా ఓడించి ఆసియా కప్ ట్రోఫీని కైవసం చేసుకుంది. ....

# రీఎంట్రీకి సిద్ధమైన రిషబ్ పంత్



ఇండియన్ ప్రీమియర్ లీగ్ సీజన్ 17లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు రిషబ్ పంత్ ఇంపాక్ట్ ప్లేయర్‌గా ఉంటాడని నివేదికలు వెల్లడవుతున్నాయి. గతేడాది డిసెంబర్‌లో జరిగిన కారు ప్రమాదంలో గాయపడిన పంత్.. ఇప్పుడు మళ్లీ ఫిట్‌నెస్‌ను పొందే దిశగా పయనిస్తున్నాడు. ఐపీఎల్ ప్రారంభం నాటికి అతను పూర్తి ఫిట్‌గా ఉంటాడు. అయితే, అతను ఎక్కువ కాలం వికెట్లు కాపాడుకోవడం అనుమానమే. ఈ కారణంగానే ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంఛైజీ రిషబ్ పంత్‌ను ఇంపాక్ట్ ప్లేయర్‌గా ఉపయోగించుకోవాలని ఆలోచిస్తున్నట్లు నివేదిక పేర్కొంది. ఈ నివేదిక ప్రకారం, పంత్ బ్యాట్స్‌మెన్‌గా బరిలోకి దిగడం ఖాయం. కానీ, ఫీల్డింగ్ చేస్తున్నప్పుడు, మరొక ఆటగాడు ఇంపాక్ట్ ప్లేయర్‌గా ఆడే అవకాశం ఉంది. మొత్తానికి ఈ ఐపీఎల్ ద్వారా రిషబ్ పంత్ మళ్లీ పోటీ క్రికెట్‌లోకి రావడం దాదాపు ఖాయమని తెలుస్తోంది. ఇప్పుడు, డేవిడ్ వార్నర్ ఇంపాక్ట్ ప్లేయర్‌గా బరిలోకి దిగితే ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు కెప్టెన్‌గా కొనసాగుతాడని తెలుస్తోంది.

ఈసారి ఐపీఎల్ వేలానికి ముందు రోవ్‌మన్ పావెల్, ముస్తాఫిజుర్ రెహమాన్, రిలే రూసోతో సహా మొత్తం 11 మంది ఆటగాళ్లను ఢిల్లీ క్యాపిటల్స్ విడుదల చేసింది. కాబట్టి, ఈసారి ఢిల్లీ జట్టులో దాదాపు కొత్త ఆటగాళ్లు కనిపించనున్నారు.రిషబ్ పంత్, ప్రవీణ్ దూబే, డేవిడ్ వార్నర్, విక్కీ ఓస్వాల్, పృథ్వీ షా, అన్‌రిచ్ నార్జ్టే, అభిషేక్ పోరెల్, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్, లుంగీ ఎన్‌గిడి, లలిత్ యాదవ్, ఖలీల్ అహ్మద్, మిచెల్ మార్ష్, ధుల్ శర్మ, ఇషాంత్‌కే ఢిల్లీ క్యాపిటల్స్‌లో ఉంచుకున్న ఆటగాళ్లు. ఢిల్లీ క్యాపిటల్స్ విడుదల చేసిన ఆటగాళ్లు: రోవ్‌మన్ పావెల్, రిలే రోసో, మనీష్ పాండే, సర్ఫరాజ్ ఖాన్, ఫిల్ సాల్ట్, ముస్తాఫిజుర్ రెహమాన్, కమలేష్ నాగరకోటి, రిపాల్ పటేల్, అమన్ ఖాన్, ప్రియం గార్గ్, చేతన్ సకారియా.

# ఐపీఎల్ వేలంలో అతి పిన్న వయస్కుడైన ఆటగాడు క్వేనా మఫాకా

ఐపీఎల్ 2024 వేలం డిసెంబర్ 19న దుబాయ్‌లో జరగనుంది. ఇందుకోసం 333 మంది ఆటగాళ్లను ఎంపిక చేశారు. అంటే 333 మంది ఆటగాళ్లను వేలంలో వేలం వేయనున్నారు. మిచెల్ స్టార్క్ 8 ఏళ్ల తర్వాత ఐపీఎల్ వేలంలో కనిపించబోతున్నాడు. ఇదిలా ఉంటే.. ఈసారి జరిగే వేలంపాటలో ఆస్ట్రేలియన్ ఆటగాళ్లు డిమాండ్ పలుకనున్నారు. కాగా.. ఈ 333 మంది ఆటగాళ్ల జాబితాలో యువ ఆటగాళ్లు, సీనియర్ ఆటగాళ్లు ఎవరో ఇప్పుడు తెలుసుకుందాం. క్వేనా మఫాకా ఈ జాబితాలో అత్యంత పిన్న వయస్కుడు. క్వేనా మఫాకా దక్షిణాఫ్రికాకు చెందినాడు. ఈ ఆటగాడు అండర్-19 ప్రపంచకప్‌లో తన ఆటతో దుమారం రేపాడు. క్వేనా వయసు ప్రస్తుతం 17 ఏళ్లు మాత్రమే. అతను 8 ఏప్రిల్ 2006న జన్మించాడు. 2022లో ఆడిన 19 ప్రపంచ కప్‌లో లెఫ్ట్ ఆర్మ్ ఫాస్ట్ బౌలర్ క్వేనా బౌలింగ్ తో విధ్వంసం సృష్టించాడు.. దీంతో అతన్ని రబాడ పార్ట్-2 అని పిలిచారు. వేలానికి ఎంపికైన 333 మంది ఆటగాళ్లలో క్వేనా అతి పిన్న వయస్కుడు కాగా.. ఆఫ్ఘనిస్తాన్ ఆల్ రౌండర్ మహ్మద్ నబీ అత్యంత వయోవృద్ధుడు. అతని వయస్సు 39 సంవత్సరాలు ఉంది.

# అంతర్జాతీయ క్రికెట్‌లో కొత్త క్రికెట్ రూల్ ట్రయల్ ప్రారంభం



అంతర్జాతీయ క్రికెట్‌లో కొత్త క్రికెట్ రూల్ ట్రయల్ ప్రారంభం ఆయింది. ఈ నియమానికి 'స్టాప్ క్లాక్' అని పేరు పెట్టారు. ఈ నిబంధన ప్రవేశంతో, ఓవర్ ముగిసిన తర్వాత ఫీల్డింగ్ జట్టు ఎక్కువ సమయం వృధా చేయలేరు. ఈ నిబంధన కేవలం తెల్ల బంతితో ఆడే క్రికెట్ ఫార్మాట్‌లో మాత్రమే వర్తిస్తుంది. అంటే, టెస్టు క్రికెట్‌లో ఈ నిబంధనను ప్రవేశపెట్టరు. ఈరోజు ప్రారంభం కానున్న ఇంగ్లండ్ వర్సెస్ వెస్టిండీస్ టీ20 సిరీస్‌లో తొలిసారిగా ఈ నిబంధనను అమలు చేయనున్నారు. వచ్చే 6 నెలల పాటు వివిధ టీ20 సిరీస్‌లలో ఈ నిబంధనను అమలు చేయనున్నారు. ఇది ఆటపై ప్రతికూల ప్రభావం చూపకుండా, ప్రయోజనాలు కలిగి ఉంటే, అది %ు20, ాణ×%లో శాశ్వతంగా చేయనున్నారు. ఈ నిబంధన ప్రకారం, ఒక ఓవర్ ముగిసిన 60 సెకన్లలోపు బౌలింగ్ జట్టు రెండో ఓవర్ వేయడానికి సిద్ధంగా ఉండాలి. ఒక ఓవర్ ముగిసిన వెంటనే, థర్డ్ అంపైర్ వాచ్ ప్రారంభమవుతుంది. ఈ గడియారం స్టేడియంలోని పెద్ద స్క్రీన్‌పై నడుస్తూనే ఉంటుంది. బౌలింగ్ చేసే జట్టు 60 సెకన్లలోపు రెండవ ఓవర్‌ను ప్రారంభించకపోతే, ఒక ఇన్నింగ్స్‌లో రెండుసార్లు ఇలా చేసినందుకు జరిమానా ఉండదు. అయితే, ఇది మూడోసారి జరిగితే, బౌలింగ్ జట్టుపై 5 పరుగుల పెనాల్టీ విధించబడుతుంది. అంటే బ్యాటింగ్ చేసే జట్టుకు అదనంగా 5 పరుగులు ఇవ్వనున్నారు. దానితో పాటు మరికొన్ని నియమాలు కూడా ఉన్నాయి. ఉదాహరణకు, బ్యాటింగ్ చేసే జట్టు సమయాన్ని వృథా చేస్తే, తర్వాత బౌలింగ్ చేయడానికి బయటకు వచ్చినప్పుడు, వృథా అయిన సమయం దానికి అందుబాటులో ఉన్న మొత్తం సమయం నుంచి తీసివేస్తారు. ఇటువంటి పరిస్థితిలో రెండు ఓవర్ల మధ్య 60 సెకన్ల కంటే తక్కువ సమయం ఉంటుంది. 6 నెలల ట్రయల్ తర్వాత, ఈ నియమం ప్రయోజనాలు, అప్రయోజనాలపై పూర్తి విశ్లేషణ ఉంటుంది. ఆపై దీన్ని మరింత కొనసాగించాలా వద్దా అనే దానిపై నిర్ణయం తీసుకోబడుతుంది.

# ట్రాన్స్‌కోకు గుదిబండగా విద్యుత్ బకాయిలు

## బిల్లులు చెల్లించడంలో స్థానిక సంస్థల నిర్లక్ష్యం

**సిద్దిపేట,డిసెంబర్12 :** విద్యుత్ బకాయలు చెల్లింపు జరక్క అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ప్రజలు వాడుకున్న విద్యుత్‌కు సకాలంలో బిల్లులు చెల్లించడం లేదు. అలాగే పారిశ్రామిక బకాయిలు కూడా పెరుగుతున్నాయి. దీంతో డిస్కంలకు రుణభారం పెరుగుతోంది. కొన్ని మునిసిపాలిటీలు గా మారాక కరెంట్ బిల్లు బకాయిపడితే మరికొన్ని గ్రామపంచాయతీల ఆదాయం లేక బకాయిలను మూటగట్టుకున్నాయి. వీధి దీపాలు, నీటి సరఫరాకు సంబంధించి విద్యుత్‌ను వాడుకుంటున్నా బిల్లులు చెల్లించడం లేదు. బిల్లుల చెల్లింపు విషయంలో మునిసిపాలిటీలు వ్యవహరిస్తున్న తీరు విద్యుత్ శాఖకు ఇబ్బందికరంగా మారిందని అధికారులు వాపోతున్నారు. దీంతోవిద్యుత్ బకాయిల చెల్లింపులో మునిసిపాలిటీలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలు ట్రాన్స్‌కోకు చెల్లించాల్సిన బకాయిలు కోట్లల్లో పేరుకుపోయాయి. కొన్ని మునిసిపాలిటీలు ఏళ్ల తరబడి బిల్లులు చెల్లించక పోవడం విద్యుత్ శాఖకు భారంగా మారింది. జిల్లాలో సిద్దిపేట మునిసిపాలిటీ దశాబ్దాల క్రితం నుంచి ఉంది. 2012 ఫిబ్రవరిలో గజ్వేల్, హుస్నాబాద్ మునిసిపాలిటీలు ఏర్పాటయ్యాయి. 2013 దుబ్బాక పురపాలక సంఘం ఏర్పడింది. చేర్యాల మునిసిపాలిటీ 2018 ఆగస్టులో కొత్తగా ఏర్పడింది. సిద్దిపేట మునిసిపాలిటీ గతేడాది పెద్ద ఎత్తున బకాయిలు చెల్లించింది. సుమారు రూ.22 కోట్లు ప్రభుత్వం చెల్లించినట్లు సమాచారం. మిగిలిన వాటికి ప్రభుత్వ పరంగా ప్రత్యేక నిధులు రావడం లేదు. దాంతో కార్యాలయాలకు కరెంట్ కట్ కాకుండా చూసుకుంటున్నారు. మిగిలిన వాటికి విద్యుత్ సరఫరా నిలిపి వేసే అవకాశంలేనందున పట్టించుకోవడం లేదు. దుబ్బాక మునిసిపాలిటీల బకాయిలు కొన్నేళ్ల నుంచి పేరుకుపోయినట్లు విద్యుత్ అధికారులు చెబుతున్నారు. నిధులు విడుదలవుతున్నా సక్రమంగా చెల్లింపులు జరగడం లేదన్న అపవాదు ఉంది. ఈ బకాయల కారణంగా విద్యుతం సంస్థలు నష్టాలను మూటగట్టుకుంటున్నాయి.

# తడిసిన ధాన్యంతో అన్నదాతల ఆందోళన

## తక్షణం కొనుగోలు చేయాలని డిమాండ్

**గుంటూరు,డిసెంబర్12 :** ధాన్యం కొనుగోళ్లు ఒక ఎత్తయితే తడిసిన ధాన్యం కొనడం మరో ఎత్తు. అకాల వర్షాలతో తడిసిన ధాన్యంతో ఇప్పుడు రైతులు లబోదిబోమంటున్నా..పాలకులు ఎవరు కూడా పట్టించుకోవడం లేదు. ఎపిలో ధాన్య తడవడంతో పాటు పంటలు చాలావరకు నీటమునిగాయి. వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం ఇప్పటికీ రంగంలోకి దిగలేదన్న ఆరోపణలు ఉన్నాయి. తెలంగాణలోనూ తడిసిన ధాన్యంతో రైతులు లబోదిబో మంటున్నారు. ఓ వైపు వీరు మరోవైపు ధాన్యం కొనుగోళ్లు చేయాలని రైతులు ఆందోళన చెందుతున్నా ఆదుకునే వారు, సమాధానం చెప్పడం లేదు. ధాన్యం కొనుగోళ్లలో శ్రద్ధ చూపని పాలకుల తీరుపై మండిపడుతున్నారు. అకాల వర్షాలతో అన్నదాత నిండా మునిగిపోయాడు. చేతికి అందివచ్చిన పంట నీటిపాలైంది. ఆరుకాలం కష్టించిన రైతులకు కన్నీళ్లే మిగిలాయి. జిల్లా వ్యాప్తంగా పలుమండలాల్లో పంట నష్టపోయినట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. అకాల వర్షంతో లక్షలాది మంది రైతులు తీవ్రంగా నష్టపోయారు. నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలి. మార్కెట్ యార్డ్‌లో వరి కొనుగోలు ప్రారంభించాలని కోరుతున్నారు.కళ్లాల్లో ఆరబెట్టిన పంట పూర్తిగా తడిసిపోయింది. రబీలో శనగ పంటను సాగు చేయగా అది కూడా వర్షం ధాటికి దెబ్బతింది. కేవలం నాలుగు రోజులు కురిసిన వర్షం.. జిల్లాను అతలాకుతలం చేసింది. జిల్లాలో ఉన్న పిల్ల కాలువ దగ్గర నుంచి వాగులు, వంకలు.. పొంగిపొర్లాయి. భూగర్భజలాలు పెరిగాయి. రోడ్లు డ్యామేజ్ అయ్యాయి. పంటలు దెబ్బతిన్నాయి. ఇప్పుడిప్పుడే జిల్లాలో సాధారణ పరిస్థితులు కనిపిస్తున్నాయి.

# రాజస్థాన్ సిఎంగా భజన్‌లాల్ శర్మ

## ఖరారు చేసిన బిజెపి అధిష్టానం

**జయపుర,డిసెంబర్12 :** రాజస్థాన్ ముఖ్యమంత్రిపై సస్పెన్స్ ఎట్టకేలకు వీడింది. రాజస్థాన్ ముఖ్యమంత్రిగా భజన్ లాల్ శర్మను ఎన్నుకున్నారు. రాజధాని జైపూర్‌లో జరిగిన బీజేపీ లెజిస్లేచర్ పార్టీ సమావేశంలో భజన్ లాల్ శర్మను బీజేపీ ఎల్పీగా ఎన్నుకున్నారు. మాజీ సీఎం వసుంధర రాజే.. భజన్ లాల్ పేరును ప్రతిపాదించగా బీజేపీ ఎమ్మెల్యేలు అంగీకారం తెలిపారు. దాంతో రాజస్థాన్ తదుపరి ముఖ్యమంత్రి గా భజన్ లాల్ శర్మ త్వరలో ప్రమాణం స్వీకారం చేయనున్నారు. రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన దాదాపు 9 రోజుల తర్వాత రాజస్థాన్ సీఎం పేరు ఖరారుచేశారు..రాజస్థాన్ ముఖ్యమంత్రి ఎవరనే సస్పెన్స్‌కి బీజేపీకి తొమ్మిదిరోజుల తర్వాత తెరదించింది. కొత్త సీఎంగా భజన్‌లాల్ శర్మ పేరును ప్రకటించింది. పార్టీ ప్రధాన కార్యాలయంలో కేంద్ర పరిశీలకులు రాజ్‌నాథ్ సింగ్, సరోజ్ పాండే, వినోద్ తవాడే సమక్షంలో జరిగిన సీఎల్‌పీ సమావేశానంతరం ఏకగ్రీవంగా భజన్‌లాల్ పేరును ప్రకటించారు. సంగనేర్ నియోజకవర్గం నుంచి భజన్‌లాల్ శర్మ తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 56 ఏళ్ల శర్మ ఏబీవీపీలో తొలుత పనిచేశారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడుగా మూడుసార్లు పనిచేసి బీజేపీకి సుదీర్ఘ కాలంగా సేవలందిస్తూ వస్తున్నారు. ముఖ్యమంత్రి పదవికి మాజీ సీఎం వసుధరా రాజే, అర్జున్ రామ్ మేఘ్వాల్, గజేంద్ర సింగ్ షెకావత్, అశ్విని వైష్ణవ్, కైలాష్ చౌదరి, దియా కుమారి, అనిత్ భదేల్ పేర్లు ప్రముఖంగా వినిపించినప్పటికీ అందరి అంచనాలను తలకిందులు చేస్తూ భజన్‌లాల్ శర్మ పేరును ఖరారు చేశారు. ఇటీవల జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో 199 స్థానాలకు 115 స్థానాలను బీజేపీ గెలుచుకుంది.

# అయ్యప్ప మాలధారులకు పండగ

## శబరి దర్శనం కోసం నియమనిష్టలతో పూజలు

**తిరుపతి,డిసెంబర్12 :** కార్తీక మాసంలో అయ్యప్ప భక్తులకు నిజమైన పండగ. ఎక్కడచూసిన మాలధారులు కనిపిస్తుంటారు. నిత్యం అయ్యప్ప శరణుఘోషతో పూజలు జరుగుతుంటాయి. అయ్యప్పస్వామిని లక్షలాది మంది తమ ఇష్టమైన దైవంగా కొలుస్తారు. ఎంతో మంది దేవుళ్లు ఉన్నా.. అయ్యప్పస్వామికి ఓ ప్రత్యేకత ఉంది. అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు చేయడం, 41 రోజుల పాటు దీక్ష చేపడ్డటం, ఉత్సవాలు నిర్వహించడం అన్నీ ప్రత్యేకమే. శబరిమల ఆలయం కేరళ రాష్ట్రంలోని పట్టనంతిట్ట జిల్లాలో పశ్చిమ కనుమల్లో సయ్యాద్రి పర్వత శ్రేణుల మధ్య ఉంది. సముద్రమట్టానికి సుమారు 3వేల అడుగుల ఎత్తులో దట్టమైన అడవులు, 18 కొండల మధ్య కేంద్రీకృతమై ఉంది. శబరిమలకు చేరేందుకు పంబానది నుంచి కాలినడక మార్గం తప్ప ఎలాంటి రవాణా సౌకర్యం లేదు. తిరుమల కొండలు ఎంత ప్రత్యేకమైనవో, ఇక్కడ అయ్యప్ప కొండలు కూడా అంతే ప్రత్యేకమైనవి. శబరిమలలో ఉండే 18 మెట్లు 1984 వరకు రాతి మెట్లపైనే భక్తులు వెళ్లి అయ్యప్పస్వామిని దర్శించుకునేవారు. అప్పట్లో భక్తులు అయ్యప్ప దీక్ష ఎన్నిసార్లు తీసుకుంటే అన్నిమెట్లకు కొబ్బరికాయలు కొంటే ఆచారం ఉండేది. ఈ ఆచారం వల్ల మెట్లపై ఉండే రాళ్లు చెడి పోవడంతో 1985 సంవత్సరం నుంచి పంచలోహంతో కప్పి మెట్లను తయారు. చేయించారు. బంగారం, వెండి, రాగి, ఇనుము, తగరం వంటి వాటిని ఈ 18 మెట్లకు అమర్చారు. ఎంతో పరమ పవిత్రంగా భావించే ఈ మెట్లపై ఇతరులెవ్వరిని అనుమతించరు. ఈ మెట్లు ఎక్కాలంటే 41 రోజుల పాటు దీక్ష చేపట్టి, నియమ నిష్టలు, కఠిన నిబంధనలు పాటించి ఎక్కాల్సిందే.అయితే ఈ 18 మెట్లకు ప్రత్యేకత ఉంది. మొదట ఐదు మెట్లు పంచేంద్రియాలకు సంకేతం. ఆ తర్వాత 8 మెట్లు అష్టరాగాలకు సంకేతం. అనంతరం 3 మెట్లు సత్వం, తామసం, రాజషానికి సంకేతం. ఈ త్రిగుణాలు బద్ధకాన్ని విడిచిపెట్టాలని సూచిస్తాయి. చివరి రెండు మెట్లు విద్య, అవిద్యకు సంకేతం. విద్య అంటే జ్ఞానం పొందడానికి, అవిద్య అంటే అహంకారాన్ని వదిలిపెట్టడానికి సంకేతం. శబరిమలను దర్శించుకుంటే దోషాలు, కష్టాలు తొలగుతాయని భక్తుల నమ్మకం. దీక్షను చేపట్టిన భక్తులు ఈ మెట్లను ఎక్కిన తర్వాత మొదటగా కనిపించేది ధ్వజస్తంభం. 200 ఏళ్ల క్రితం అయ్యప్పస్వామి గర్భాలయంపైన, ఆలయం చుట్టూ బంగారు రేకులతో కప్పించారు.

# కిలో బియ్యం పథకంపై సమీక్ష ఏదీ

## అక్రమాలు జరుగుతున్న పట్టింపు లేదా?

**హైదరాబాద్,డిసెంబర్12 :** కిలో రూపాయి బియ్యం పంపిణీ విషయంలో ప్రభుత్వాలు మాత్రం ఏ మాత్రం వెనక్కి తగ్గడం లేదు. మరోవైపు తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వం అందచేస్తున్న కిలో రూపాయి బియ్యం పథకం పక్కదారి పడుతోంది. రూపాయికి కొత్తిమీర కూడా లభించని ఈ రోజుల్లో ఇంకా ఈ పథకాన్ని కొనసాగించడం ఆర్థిక భారం తప్ప మరోటి కాదు. ఆర్థిక మందగమనం నేపథ్యంలో అనేక పథకాలను సమీక్షించాల్సి ఉంది. నిరుపేదలకు ఉచిత పథకాలపై సమీక్షించకుంటే తెలుగు రాష్ట్రాల్లో ఆర్థికమాంద్యం కూడా తీవ్ర ప్రభావం చూపగలదు. ఇప్పటికే పెరిగిన అప్పులకు తోడు ఇలాంటి పథకాలు గుదిబండగా మారాయి. ప్రజలు చెమటోడ్చి పన్నుల రూపంలో కట్టిన డబ్బులు వృధా పథకాలతో దుబారా చేస్తున్న పథకాలకు చరమగీతం పలకలి. నిజానికి ఈ డబ్బులతో రైతుల వద్ద ఉన్న ధాన్యం కొంటే కొంత ఊరట కలిగేది. ధాన్యం కొనడం వల్ల ఎంత ఖర్చవుతుందో అంత లెక్క కట్టి ఆ మేరకు బియ్యం పథకం ధరలను పెంచాలి. ప్రజల డబ్బులకు జవాబుదారీగా ఉండాల్సిన పాలకులు తమకు అనుగుణంగా, ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం పథకాలను కొనసాగించడం సరికాదు. బియ్యం పథకంపై ఆజమాయిషీ లేకపోవడం వల్ల చౌక బియ్యాన్ని తినడానికన్నా అమ్ముకోవడానకే ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. ఇది కొందరికి వనరుగా, మరికొందరికి ఆదాయ వనరుగా మారింది. ఈ బియ్యంతో హోటళ్లలో టిఫిన్లు తయారవుతున్నాయి. అలాగే సరిహద్దులు దాటి సన్నబియ్యంగా మారుతున్నాయి. నిరుపేదల కడుపు నింపడానికి పంపిణీ చేయాల్సిన రాయితీ బియ్యం యథేచ్ఛగా నల్ల బజారుకు తరలి అక్రమార్కుల పరం అవుతోంది. సిబ్బంది కొరత, కొరవడిన తనిఖీలకు ప్రజల అమాయకత్వం జత కలవడంతో ప్రజా పంపిణీ వ్యవస్థ గాడి తప్పింది. బియ్యం అక్రమ రవాణా చేయడం నిత్యకృత్యంగా మారినా అరికట్టాల్సిన అధికారులు చేష్టలుడిగి ప్రేక్షక పాత్రకు పరిమితమవుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆనాటి ముఖ్యంత్రి ఎన్టీఆర్ బడుగు బలహీన వర్గాలకు బియ్యం అందచేయాలన్న లక్ష్యంతో కిలో రెండు రూపాయల బియ్యం పథకాన్ని అమలు చేశారు. 40ఏళ్ల క్రితం పెట్టిన పథకం అది. చంద్రబాబు సిఎం అయ్యాక దానిని ఐదు రూపాయలకు పెంచారు. దీంతో కొంత దుబారా తగ్గిందనే చెప్పాలి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిక మళ్లీ కిలో రెండు రూపాయలకు చేశారు. దీనిని కిరణ్ కుమార్ రెడ్డి సర్కార్ కిలో రూపాయికే మార్చడం ద్వారా అక్రమాలకు తెరలేపారు. కిలో రూపాయికి బియ్యం ఇవ్వడం వల్ల రాయితీ బియ్యం అక్రమ రవాణాను కొందరు వృత్తిగా మార్చుకున్నారు. తెలంగాణ జిల్లాలకు మహారాష్ట్ర అతి సమీపంలో ఉండటం, అక్కడ బియ్యం ధర అధికంగా ఉండటంతో పేదల ఆకలి తీర్చాల్సిన రాయితీ బియ్యాన్ని అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. రైళ్లలో అక్రమ రవాణా జరుగుతున్నా, బియ్యాన్ని పోలీసులు పట్టుకోవడం నిత్యం జరుగుతున్నా అవకతవకలకు అడ్డుకట్ట పడడం లేదు. దీనిపై సమీక్షించి కఠినంగా వ్యవహరించడంతో పాటు కిలో రూపాయిని కనీసం ఐదు రూపాయలకు పెంచాల్సిన అవసరం ఉంది. ఈ మొత్తాన్ని రైతులకు మద్దతు ధరలకు కేటాయిస్తే మరీ మంచిది. వేలకోట్లు దండగమారి పథకానికి ఖర్చు చేస్తున్నారు. కిలోబియ్యం పథకం దుబారాను తగ్గించి వాటిని ధాన్యం కొనుగోళ్లకు వెచ్చించాలి. కార్డులు తగ్గించడంతో పాటు అక్రమాలపై దృష్టి పెట్టడం లేదు. పేదలకు బియ్యం అందించాలన్న సదుద్దేశ్యాన్ని ఎవరూ కాదనలేరు. కానీ రూపాయికే ఇవ్వాలనుకోవడం, అలా ఇచ్చిన బియ్యం అక్రమంగా తరలకుండా కఠినంగా చర్య తీసుకోకపోవమే ఆక్షేపణీయం.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL 2021/81092, PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com